ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 24.11.2026 | సంపుటి:13 సంచిక:124 | పేజీలు:12 వెల:రూ.4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





నిమ్స్‌లో అవినీతి కుంభకోణాలు

- ఏసీబీ అధికారుల తనిఖీల్లో విస్తుబోయే విషయాలు
- ఇంప్లాంట్ల్, అనధికారిక నిల్వలు, ఆరోగ్యశ్రీ బిల్లింగ్‌లో రూ.25 కోట్ల అవకతవకలు గుర్తింపు

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో అధికారుల అవినీతి వ్యవహారం బట్టబయలైంది. అక్టోబర్29, నవంబరు 2న ఏసీబీ అధికారులతో పాటు ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్, లేబర్ శాఖల అధికారులు సంయుక్తంగా ఆసుపత్రిలో నిర్వహించిన తనిఖీల్లో కోట్ల రూపాయల అవినీతి వ్యవహారం వెలుగుచూసింది. అధికారుల సోదాల్లో సుమారు రూ.25 కోట్ల విలువైన ఇంప్లాంట్ల్ అనధికారిక నిల్వలు, ఆరోగ్యశ్రీ బిల్లింగ్ కుంభకోణం, టెండర్ల కేటాయింపుల్లో అక్రమాలు బయటపడ్డాయి. ఆసుపత్రిలోని ఐదు ఆపరేషన్ థియేటర్లు, సబ్ స్టోర్ల సమీపంలోని అల్మారాల్లో సుమారు రూ.25 కోట్ల విలువైన

మిగతా 2లో..

కేసీఆర్ హయాంలోనే కృష్ణాజలాలు ఆంధ్రాకు సమర్పయామి

పలాడు వాటర్‌గ్రిడ్ ఒప్పందం కేసీఆర్‌తోనే జరిగింది



- తెలంగాణ నీటి హక్కులకు సమాధి కట్టింది కేసీఆర్, హరీశ్‌రావే
- హరీశ్‌రావుకి అసలు గురువు వైఎస్ఆర్
- ఏపీ ప్రాజెక్టులను చట్టబద్ధంగా అడ్డుకుంటాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): నదీ జలాల విషయంలో బీఆర్ఎస్ ప్రణాళికా బద్ధంగా అసత్యాలు ప్రచారం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పల్నాడు వాటర్ గ్రిడ్ అంశంపై దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. అసత్యాలు, అర్ధసత్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆ పార్టీ నేతలు బురద జల్లుతున్నారని మండిపడ్డారు. అన్ని ఆధారాలతో బీఆర్ఎస్ నేతల దుష్ప్రచారాన్ని ఎండగడతామన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.“పల్నాడు వాటర్ గ్రిడ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోలేదని ప్రచారం చేస్తున్నారు. దానిని కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే 2022 లోనే జగన్ ప్రారంభించారు. రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో జల్‌జీవన్ మిషన్ కింద ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తూ జగన్

మిగతా 2లో..

పల్నాడు వాటర్ గ్రిడ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోలేదని ప్రచారం చేస్తున్నారు. దానిని కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే 2022లోనే జగన్ ప్రారంభించారు. రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో జల్‌జీవన్ మిషన్ కింద ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తూ జగన్ జీవో ఇచ్చారు. పల్నాడు వాటర్ గ్రిడ్‌పై కేసీఆర్ ఒక్కసారి కూడా నోరు మెదపలేదు. కేంద్రం సాయం చేస్తున్నా నోరెత్తలేదు. 2024లోపు ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని జగన్ జీవో ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ అంశం మా దృష్టికి రాగానే కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్రానికి కూడా ఫిర్యాదు చేశారు.
- సీఎం రేవంత్ రెడ్డి

గురునానక్ సందేశం ఎప్పటికీ అనుసరణీయం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

నాగార్జునసాగర్ ఆయకట్టు నుంచి చుక్కనీరూ వదులుకోం

గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు రూ.1,115 కోట్ల కేటాయింపు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్(జనంసాక్షి): నాగార్జునసాగర్ ఆయకట్టు నుంచి చుక్కనీరూ వదులుకోమని మంత్రి ఉత్తమ్‌కు మార్‌రెడ్డి తెలిపారు. గోదావరి పుష్కరాల లోగో డిజైన్ వర్క్ షాప్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.గోదావరి పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేపడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పనపై ఇవాళ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో దేవాదాయ

మిగతా 2లో..

అతిపెద్ద బహుళరంగ ప్రదర్శనగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

- ఫేసియల్ రికగ్నిషన్‌తో కంపెనీల ప్రతినిధులకు ప్రవేశం
- గ్లోబల్ సమిట్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- కార్యక్రమ ఏర్పాట్లు, విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరిక

హైదరాబాద్(జనంసాక్షి): ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మిట్ లలో 80 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అతిపెద్ద బహుళ-రంగ ఎక్స్ పో గా ఈ సమ్మిట్ ను చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లపై సోమవారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో మంత్రి డి. శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ

మిగతా 2లో..

ఏఐసీసీ ఇంచార్జి సందీప్ మంత్రులతో వరుస భేటీలు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు
- కష్టపడి పనిచేసే వారికే పదవులు
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 90కిపైగా సీట్లు
- భేటీ వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించిన మంత్రులు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తన అంచనా ప్రకారం వచ్చే ఎన్నికల్లో 90 సీట్లకు పైగా కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌ఛార్జ్ సందీప్‌కుమార్‌తో మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు వేర్వేరుగా సమావేశయ్యారు. అనంతరం పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి, తుమ్మల మీడియాతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని కోమటిరెడ్డి అన్నారు. కష్టపడి పనిచేసే వారికే పదవులు ఇవ్వాలని ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌తో చెప్పానన్నారు. పొంగులేటి మాట్లాడుతూ ఇన్‌ఛార్జ్ తొలిసారి రాష్ట్రానికి వచ్చినందున మర్యాదపూర్వకంగా కలిశామని చెప్పారు. ఆయనతో పార్టీ అంశాలు మాత్రమే చర్చించామన్నారు. కాంగ్రెస్‌పై ఎలాంటి

మిగతా 2లో..

నీటి కేటాయింపులపై
నిర్ణయం జరగలేదు

- ముగిసిన కేఆర్ఎంబీ సమావేశం
- మరోసారి చర్చించాలని యాజమాన్య బోర్డు నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి): జలసౌధలో భేటీ అయిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ ఎలాంటి నిర్ణ యం తీసుకోకుండానే సమావేశాన్ని ముగించింది. చర్చలో భాగంగా మొత్తం 19 టీఎంసీలు కావాలని ఏపీ కోరగా.. ఫిబ్రవరి వరకు 21 టీఎంసీలు కావాలని తెలంగాణ అడిగింది. ఈనేపథ్యంలో పూర్తిస్థాయి బోర్డు సమావేశంలో మరోసారి చర్చించాలని యాజమాన్య బోర్డు నిర్ణయించింది. పల్నాడు వాటర్ గ్రిడ్ అంశాన్ని తెలంగాణ లేవనెత్తగా.. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆ పనులు చేస్తోందని, ఆ విషయాలు తమకు తెలియవని ఏపీ జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. సాగర్‌లో మొత్తం 45 టీఎంసీల నీరు ఉందన్నారు. వచ్చే జులై వరకు సాగర్ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. హైదరాబాద్ తాగునీటి కోసమే జులై వరకు 15 టీఎంసీలు అవసరమవుతాయన్నారు. “ సాగర్ నీళ్లు తాగునీరు, కుడి, ఎడమ కాల్వల కోసమే వాడాలని చెప్పాం. కృష్ణా డెల్టాకు చుక్క నీరు కూడా ఇచ్చే అవకాశం లేదని చెప్పాం. హైదరాబాద్ తాగునీరు పోను.. మిగిలిన 25 టీఎంసీలపై చర్చిద్దామని చెప్పాం. ఏపీకి పులిచింతలలో 42 టీఎంసీలు ఉన్నాయి. పట్టిసీమ నుంచి కూడా కృష్ణా డెల్టాకు నీళ్లు వస్తున్నాయి. సాగర్‌లో ఉన్న 45 టీఎంసీల్లో 5 టీఎంసీలు ఆవిరయ్యే అవకాశం ఉంది” అని రమేశ్ బాబు అన్నారు. కాగా, కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. దీనిపై 10 రోజుల క్రితమే బోర్డుకు లేఖలు రాసినట్లు చెప్పారు. పల్నాడు వాటర్ గ్రిడ్ గురించి ఈ సమావేశంలో చర్చకు రాలేదన్నారు.కృష్ణా డెల్టాకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి చుక్క నీటిని కూడా విడుదల చేసే అవకాశం

మిగతా 2లో..



దేశంలో చొరబాటుదారులకు
కాంగ్రెస్ మద్దతు

- రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలకు ఏటీఎంలా మారారు
- కాంగ్రెస్ అరాచక రాజకీయాలకు ప్రజాస్వామ్యమే సమాధానం
- కాంగ్రెస్ ప్రభుత్వ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది
- ప్రజల మద్దతు, అసలైన ఓట్లు బీజేపీ వైపే.. : నితిన్ నబీన్

కరీంనగర్ బ్యూరో (జనంసాక్షి): కాంగ్రెస్, ఇండీ కూటమి అరాచక రాజకీయాలను నమ్ముకుంటే.. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని, ప్రజల ఆశీర్వాదాన్ని నమ్ముకుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మహాపాదయాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కాంగ్రెస్, ఇండీ కూటమి నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ మహాపాదయాత్రలో కంటికి కనిపించినంత దూరం ప్రజలే కనిపిస్తున్నారని, మహిళలు, యువత భారీ సంఖ్యలో తరలిరావడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజాస్వామ్య గొంతుకను బలంగా వినిపించేందుకే కరీంనగర్ గడ్డపైకి

మిగతా 2లో..

మళ్లీ పసిడి పరుగులు

అదే బాటలో వెండి కూడా..

2లో..

రష్యా యుద్ధనౌకను ముంచేశాం

వీడియో విడుదల చేసిన జెలెన్‌స్కీ

నేపాల్‌కు రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం

ప్రకటించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): నేపాల్‌కు ప్రధాని నరేంద్ర మోదీ 24,000 కోట్ల నేపాలీ రూపాయల (భారత కరెన్సీలో రూ.15,109 కోట్లు) అభివృద్ధి ప్యాకేజీని ప్రకటించారు. భారత పర్యటనలో భాగంగా నేపాల్ ప్రధాని బాలేంద్ర షా సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విస్తృత చర్చలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఇరువురు నేతలు నేపాల్‌లో భారత్ సాయంతో చేపట్టే పలు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య నుంచి నేపాల్‌లోని జనక్‌పుర్ ధామ్ మధ్య రైలును జెండా ఊపి ప్రారంభించారు.“భారత్, నేపాల్ మధ్య సంబంధం.. బంధుత్వం వంటిది. రెండు దేశాల మధ్య చెక్కుచెదరని విశ్వాసం ఉంది. ఒకరి పురోగతిలో ఒకరం భాగస్వాములం. కష్ట సమయాల్లో అండగా ఉంటాం. ఈ ఏడాది చమురు సరఫరాకు సంబంధించి తీవ్ర సవాళ్లు ఎదురైనప్పటికీ.. నేపాల్‌కు ఇంధనం, ఎరువులు, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరా కొనసాగించాం. నేపాల్ పునర్నిర్మాణానికి, దీర్ఘకాలిక అభివృద్ధికి నేడు 24 వేల కోట్ల నేపాలీ రూపాయల అభివృద్ధి ప్యాకేజీని ప్రకటించాం” అని ప్రధాని మోదీ తెలిపారు. ఆగస్టులో నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల వల్ల కలిగిన ప్రాణనష్టంపై

మిగతా 2లో..

మైన్స్‌ను పూర్తిగా క్లియర్ చేశాకే
కర్రెగుట్టల్లోకి అనుమతి

లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం: డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్(జనంసాక్షి): కర్రెగుట్టల్లోకి పర్యాటకులను అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీ అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. “కర్రెగుట్టల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అక్కడ మావోయిస్టులు పెద్ద సంఖ్యలో వివిధ రకాల మైన్స్ ఏర్పాటు చేశారు. ప్రెషర్ మైన్స్ ఎక్కువగా ఉన్నట్లు అనుమానముంది. అవి ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో స్పష్టమైన సమాచారం లేదు. కొంతమంది మావోయిస్టులను విచారించడంతో 9 డంప్‌లను గుర్తించాం. కర్రెగుట్టల్లోకి పర్యాటకులను అనుమతిస్తే ప్రమాదాలు

మిగతా 2లో..





'మెట్రో'కు మొండిచేయి

- ఆర్థిక సాయం నా పరిధిలో లేదు
- స్పష్టం చేసిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రో రెండోదశ విస్తరణకు ఆర్థిక సాయం తన పరిధిలో లేని అంశమని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. రెండోదశ నిర్మాణానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ఇస్తానన్న రుణం సంగతి కూడా తనకు తెలియదని చెప్పారు. మెట్రో ఫేజ్-2 రుణాల కోసం పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి మెమొరాండం సమర్పించారు. రెండోదశకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నిధుల వ్యవహారంలో గతంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించారు.

మిగతా 2లో..



మళ్లీ జెన్సన్ హువాంగే..

- ఎన్విడియా సీఈఓగా తిరిగి నియామకం
- ఆయన పునర్నియామకానికి కంపెనీ బోర్డు ఆమోదం

వాషింగ్టన్(జనంసాక్షి): ప్రముఖ చిప్ తయారీ కంపెనీ ఎన్విడియా సీఈఓగా జెన్సన్ హువాంగ్ తిరిగి నియమితులయ్యారు. ఆయన పునర్నియామకానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. చైనా గూఢచారిగా భావిస్తున్న వ్యక్తితో వివాహేతర సంబంధం నేపథ్యంలో

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24.11.2026

గురునానక్ సందేశం ఎప్పటికీ అనుసరణీయం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):సిక్కు మత స్థాపకుడు గురునానక్ బోధించిన వినయం, సేవాభావంతో జీవితాన్ని గడపాలనే సందేశం ఎప్పటికీ అనుసరణీయం, ఆదర్శప్రాయమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలు, సిక్కు సోదరులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. గురునానక్ దేవ్ జీ కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా మానవులందరూ సమానమేనని బోధించారన్నారు. ప్రేమ, సేవ, సోదరభావం, నిజాయితీతో కూడిన జీవనమే గొప్పదని ఆయన అన్నారు. గురునానక్ బోధించిన ప్రేమ, కరుణ, మానవత్వం వంటి విలువలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తూ సరైన మార్గంలో నడిపించాలని సీఎం ఆకాంక్షించారు. శ్రమను గౌరవించాలని, సంపాదించిన దానిని ఇతరులతో పంచుకోవాలని గురునానక్ బోధించారని గుర్తు చేశారు. ప్రజలు సోదరభావం, సామరస్యంతో జీవించాలని, కష్టపడి పనిచేయడాన్ని గౌరవించాలని, ఆత్మగౌరవంతో బతకాలని గురునానక్ ప్రపంచానికి గొప్ప సందేశాన్ని అందించారని సీఎం కొనియాడారు. గురునానక్ జీవితం, ఆయన బోధనలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని రేవంత్ రెడ్డి చెప్పారు.

'మెట్రో'కు మొండిచేయి

కానీ, సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో, ఐఆర్ఎఫ్సీ ఆర్థిక సహకారం విషయాలేవీ తనకు తెలియదని చెప్పడం గమనార్హం.మరోవైపు వచ్చే ఏడాది మేలో బుల్లెట్ రైలు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రైలు 250 కి.మీ వేగంతో నడుస్తుందన్నారు. అహ్మదాబాద్– ముంబయి మధ్య బుల్లెట్ ట్రైన్ కారిడార్ నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. సూరత్ – బిలిమొరా సెక్షన్లో 50 కి.మీ మేర రైలు కారిడార్ పూర్తయిందని, ఇదే వేగంతో అన్ని సెక్షన్లలో నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఏప్రిల్ నాటికి బుల్లెట్ ట్రైన్ కోచ్లు అందుబాటులోకి వస్తాయన్న ఆయన.. 2029 నాటికి బుల్లెట్ ట్రైన్ థానే వరకు చేరుతుందని చెప్పారు."సరకు రవాణాలో అనేక సంస్కరణలు తెచ్చాం. దీంతో రూ.1,078 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. మరోవైపు ఈ ఏడాది రైల్లలో ఇప్పటికే 800 కోట్ల మంది ప్రయాణాలు చేశారు. 1980 నాటి టికెట్ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశాం" అని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

మళ్లీ జెన్సన్ హువాంగే..

ఆయన తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. 11 రోజులు తిరగక ముందే సీఈఓగా బాధ్యతలు చేపట్టేందుకు బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. జెన్సన్ రాకతో ఎన్విడియా షేర్లు దూసుకెళ్లాయి. "ఎన్విడియాకు నాయకత్వం వహించడానికి జెన్సన్ సరైన వ్యక్తి. వాటాదారులు, ఉద్యోగులు, భాగస్వాములు, వినియోగదారుల ప్రయోజనార్థం ఆయన పున్నరియామకం అవసరం అని బోర్డు విశ్వసిస్తోంది" అని ఎన్విడియా బోర్డు ఛైర్మన్ హార్వే సి జోన్స్ అన్నారు. జెన్సెన్పై తమకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. అలాగే, ఎన్విడియా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్గా తన బాధ్యతలను కొనసాగిస్తూనే, తాత్కాలిక సీఈఓగా సేవలందించిన కోలెట్ క్రెస్కు బోర్డు కృతజ్ఞతలు తెలియజేసింది.హువాంగ్ను తిరిగి నియమించడం వల్ల జాతీయ భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని తాము విశ్వసిస్తున్నట్లు అమెరికా ప్రభుత్వ ఉన్నత స్థాయి వర్గాల నుంచి సమాచారం అందినట్లు బోర్డు పేర్కొంది. సీఈవోగా నియమితులవ్వడం పట్ల జెన్సన్ సంతోషం వ్యక్తంచేశారు. అతిపెద్ద టెక్నాలజీ కంపెనీని మరింత నిబద్ధతతో ముందుకు తీసుకెళతానని పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచిన బోర్డుకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఎన్విడియాకు జెన్సన్ హువాంగ్ తిరిగి రావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ద్వారా స్పందించారు. ఆయనను తిరిగి నియమించడం ద్వారా బోర్డు 'సరైన నిర్ణయం' తీసుకుందని కొనియాడారు. ఇది కంపెనీ విజయం, శ్రేయస్సు మాత్రమే కాదని, అమెరికా ఆర్థిక వ్యవస్థకూ చాలా కీలకమని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

ఎన్విడియా షేర్లు జూమ్

జెన్సన్ హువాంగ్ పునర్నియామకానికి బోర్డు ఆమోదం తెలపడంతో చిప్ కంపెనీ షేర్లు దూసుకెళ్లాయి. జెన్సన్ వార్త బయటకు వచ్చిన వెంటనే కంపెనీ షేర్లు 31 శాతానికి పైగా పెరిగాయి. ఎన్విడియాతో పాటు మైక్రాన్ టెక్నాలజీస్ 14 శాతం, కోర్వీవ్ 29 శాతం, ఏఎండీ షేర్లు 9 శాతం చొప్పున దూసుకెళ్లాయి.

నేపాల్కు రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం

భారత్ తరపున సంతాపం ప్రకటించారు. "భారత్– నేపాల్ మధ్య సంబంధాలు హిమాలయాలంత దృఢంగా, సముద్రాలంత విశాలంగా ఉన్నాయి. భారత్ మాకు నమ్మకమైన పొరుగు దేశం. కష్టకాలంతోపాటు ప్రకృతి వైపరీత్యాల వంటి విపత్కర పరిస్థితుల్లో ఎల్లప్పుడూ అండగా నిలిచింది. పరస్పర గౌరవం, దృఢమైన విశ్వాసాలనేవి ఇరు దేశాల మధ్య సంబంధాలకు పునాది" అని బాలేంద్ర షా అన్నారు.



కేసీఆర్ హయాంలోనే కృష్ణాజలాలు ఆంధ్రాకు సమర్పయామి

జీవో ఇచ్చారు. పల్నాడు వాటర్ గ్రిడ్పై కేసీఆర్ ఒక్కసారి కూడా నోరు మెదపలేదు. కేంద్రం సాయం చేస్తున్నా నోరెత్తలేదు. 2024లోపు ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని జగన్ జీవో ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ అంశం మా దృష్టికి రాగానే కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి కేంద్రానికి కూడా ఫిర్యాదు చేశారు.వైఎస్ఆర్ హయాంలో హరీశ్రావు మంత్రిగా ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడుకు అనుమతులు ఇచ్చారని సిద్దిపేటలో నేను ఆరోపించాను. నా ఆరోపణపై హరీశ్స్పందిస్తూ తాను రాజీనామా చేశాక అనుమతులు ఇచ్చారని చెప్పారు. 2005 సెప్టెంబర్లో జీవో 170 వచ్చేటప్పటికి తాను మంత్రిగా లేరని హరీశ్ అంటున్నారు. 2005 మార్చిలో పెట్టిన బడ్జెట్లోనే పోతిరెడ్డిపాడుకు నిధులు కేటాయించారు. క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాతే బడ్జెట్లో పెడతారు. 2005 బడ్జెట్ ఆమోదం పొందేనాటికి హరీశ్తోపాటు ఐదుగురు బీఆర్ఎస్ (అప్పటి తెరాస) నేతలు మంత్రులుగా ఉన్నారు. మంత్రులుగా మీరే బడ్జెట్కు ఆమోదం తెలిపారు కదా. హరీశ్రావుకు అసలైన గురువు కేసీఆర్ కాదు.. వైఎస్ఆర్. వార్డు మెంబర్గా కూడా లేని హరీశ్ను వైఎస్ఆర్ మంత్రిని చేశారు. అందుకు గురుదక్షిణగా పోతిరెడ్డిపాడుకు హరీశ్రావు అనుమతులిచ్చారు.2005లో కడప జిల్లా ఇన్ఛార్జ్ మంత్రిగా నాయిని నర్సింహారెడ్డి ఉన్నారు. 2005లో హరీశ్ మంత్రి కాగానే.. హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీల నీటి తరలింపునకు అనుమతిచ్చారు. వైఎస్ నీళ్లు తరలించుకుపోతుంటే.. హారతులిచ్చింది హరీశ్రావే కదా. తెలంగాణ నీటి హక్కులకు సమాధి కట్టింది కేసీఆర్, హరీశ్రావే. 811 టీఎంసీలు ఉన్న కృష్ణా జలాల్లో పరివాహక ప్రాంతం ఆధారంగా వాటాలు పంపిణీ జరిగితే మనకు 575 టీఎంసీలు రావాలి. 26 జూన్ 2015న కేంద్ర జల్శక్తి ఆధ్వర్యంలో కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. నాడు ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలు అని కేసీఆర్ సంతకాలు చేశారు. నాడు సంతకం చేసి.. రాష్ట్ర నీటి హక్కులపై కేసీఆర్ మరణశాసనం రాశారు. 2020 జనవరి 29న ఏపీకి శాశ్వతంగా 512 టీఎంసీలు వెళ్లేలా సంతకం చేయించారు. బీఆర్ఎస్ ట్రాప్లో మేం పడలేదు. 20 ఏళ్ల వివాదానికి తెరదించేందుకు కృషి చేస్తున్నాం. చట్టబద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులను అడ్డుకుంటాం.ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రధానిని రెండుసార్లు కలిశాం. కేసీఆర్ అవినీతిని గుర్తించి.. ప్రజలు ఆయన్ని ఇంట్లో కూర్చోబెట్టారు. పదేళ్ల పాలనలో కృష్ణా బేసిన్లో ఉన్న ప్రాజెక్టులకు కేసీఆర్ కేవలం రూ.11,255 కోట్లు ఖర్చు చేశారు. భూ నిర్వాసితుల కోసం కేసీఆర్ రూ.3,315 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మేం మూడేళ్లలో రూ.6,767 కోట్లు ఖర్చు చేశాం. ప్రాజెక్టులు పూర్తికావడం కేసీఆర్కు ఇష్టం లేదు. భూసేకరణపై కేసీఆర్ ఏనాడూ దృష్టి పెట్టలేదు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా గ్రామాలను తరలించగలరా? పదేళ్లలో మరో రూ.10 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే.. చాలా ప్రాజెక్టులు పూర్తయ్యేవి. ఏ ప్రాజెక్టూ పూర్తి చేయకపోవడం వల్లే ఏపీ నీళ్లు తరలించుకుపోతోంది" అని రేవంత్రెడ్డి అన్నారు.

నాగార్జునసాగర్ ఆయకట్టు నుంచి చుక్కనీరూ వదులుకోం

శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్షాప్లో మంత్రి ఉత్తమ్? వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణలో గోదావరి నది పరివాహక ప్రాంతంలోని 77 ప్రాంతాల్లో పుష్కర ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం ప్రధాన పుష్కర కేంద్రాలుగా ఉండనున్నాయని పేర్కొన్నారు. 2015 పుష్కరాలకు 5.8 కోట్ల మంది భక్తులు హాజరుకాగా, ఈసారి పుష్కరాలకు 8 కోట్లకు పైగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా. పుష్కరాల సందర్భంగా శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.1,115 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం ఉన్న 4 కి.మీ అదనంగా మరో 3 కిలోమీటర్లకు కొత్త ఘాట్లను నిర్మించి మొత్తం 7 కి.మీ మేర ఘాట్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఘాట్ల నిర్మాణం, ఆలయాల పునరుద్ధరణ, రహదారుల అభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భద్రత, వైద్య సదుపాయాల కల్పనకు నిధులు వినియోగించనున్నట్లు వెల్లడించారు. ప్రధాన ఆలయాల అభివృద్ధికి కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. బాసర ఆలయానికి రూ.324 కోట్లు, భద్రాచలం ఆలయానికి రూ.276 కోట్లు, కాళేశ్వరం ఆలయానికి రూ.198 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

మైన్స్ను పూర్తిగా క్లియర్ చేశాకే కర్రెగుట్టల్లోకి పర్యాటకులకు అనుమతి

జరిగి ఇబ్బం దులు ఎదురవుతాయి. ఆ ప్రాంతంలో మైన్స్ను పూర్తిగా క్లియర్ చేసి భద్రతా చర్యలు చేపట్టిన తర్వాతే పర్యాటకులు వెళ్లేందుకు అనుమతిస్తాం"అని డీజీపీ తెలిపారు.

అతిపెద్ద బహుళరంగ ప్రదర్శనగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్పో, క్లైమేట్ కాంక్లేవ్ల నిర్వహణపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ నిర్వహిస్తున్నారు. అన్ని రంగాలనుంచి వెయ్యికి పైగా కంపెనీలు పాల్గొననున్నాయి. సమ్మిట్కు పెద్ద ఎత్తున ప్రతినిధులు హాజరయ్యే అవకాశమున్నందున ప్రతినిధులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సునాయాసంగా ప్రవేశం కోసం ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ వాడాలన్నారు. ఆహ్వానాలు పంపే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతినిధులతో అత్యంత మర్యాదగా వ్యవహరించేలా విధుల్లో ఉన్న అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు.తెలంగాణ చరిత్ర, సంస్కృతి, కాకతీయుల శిల్పకళ, సమ్మక్క సారలమ్మ ఆలయంలో ఉన్న తోరణాల నమూనాలు, సోమశిల ఆలయం, నిర్మల్ పెయింటింగ్స్, రాష్ట్రానికి చెందిన భౌగోళిక గుర్తింపు ఉన్న ఉత్పత్తులు, చేనేత, రాష్ట్ర అభివృద్ధి, గాంధీ సరోవర్ ప్రాజెక్టు తదితర భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ముఖ్యమైన ప్రతినిధులకు ఆహ్వానాలు పంపే బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబులకు అప్పగించాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల ముఖ్య మంత్రులను కూడా సమ్మిట్కు ఆహ్వానించాలని సూచించారు.సమ్మిట్కు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 30 ఫుడ్ స్టాల్స్, వివిధ చేనేత వస్త్రాల ప్రదర్శనకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. రక్షా ఎక్స్ పో లో భాగంగా డిసెంబర్ 7 వ తేదీన ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎయిర్ షోతో పాటు ఇతర కార్యక్రమాలను వీక్షించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ట్రైబల్ సమ్మిట్ లో భాగంగా భారతీయ, వివిధ దేశాల్లోని తెగలకు సంబంధించిన బృందాలు సాంస్కృతిక ప్రదర్శనలు చేయనున్నారు. క్లైమేట్ కాంక్లేవ్ లో భాగంగా సద్గురు జగ్గి వాసుదేవ్, ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు, వివిధ ప్రపంచ స్థాయి నిపుణులు ప్రసంగించనున్నారు. స్థానికంగా ఉన్న ఇక్రిశాట్ వంటి సంస్థల నుంచి శాస్త్రవేత్తలు, స్టార్ట్ అప్స్, స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేయనున్నారు. గ్రీన్ ఎకానమీకి సంబంధించిన పెట్టుబడులపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు.ఎడ్యుకేషన్ కాంక్లేవ్ లో భాగంగా యూకే పెవిలియన్, యూరోపియన్ పెవిలియన్ లతో పాటు ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ప్రదర్శనలు ఉండనున్నాయి. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఐఐటీ హైదరాబాద్, నల్సార్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సహా తెలంగాణలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల ప్రతినిధులు అంతర్జాతీయ అతిథులతో మాట్లాడుకునే విధంగా స్టాల్స్ ఏర్పాట్లు చేస్తున్నారు.ఇండియా జాయ్ కాంక్లేవ్ లో భాగంగా దాదాపు 150 యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల కంపెనీలు పాల్గొననున్నాయి. ఇందులో అడోబ్, సోనీ, ఉబిసాఫ్ట్ వంటి ప్రముఖ సంస్థలు ప్రదర్శనలు చేయబోతున్నారు. ఇప్పటికే ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 1,500 మంది కంపెనీల సీఈవోలు, ఎండీలు, పెట్టుబడిదారులు, వివిధ దేశాలకు సంబంధించిన రాయబారులు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

నీటి కేటాయింపులపై నిర్ణయం జరగలేదు

లేదని కేఆర్ఎంబీ సమావేశంలో తెలంగాణ తేల్చి చెప్పింది. ఈ మేరకు హైదరాబాద్లో కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కుమార్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.నాగార్జున సాగర్లో ప్రస్తుతం 45 టీఎంసీలే ఉండగా వచ్చే జులై వరకూ వాటినే జాగ్రత్తగా వాడుకోవాలని తెలంగాణ ఈఎన్సీ చెప్పారు. 45 టీఎంసీల్లో 5 టీఎంసీలు ఆవిరయ్యే అవకాశం ఉండగా హైదరాబాద్ తాగునీటి కోసమే జులై వరకూ 15 టీఎంసీలు కావాలని కోరినట్లు పేర్కొన్నారు. ఏపీలోని కృష్ణా డెల్టాకు నీళ్లు కావాలని వారు పట్టుబట్టగా ఎట్టి పరిస్థితుల్లో సాగర్ నుంచి తాగునీటిని కుడి, ఎడమ కాల్వల కోసమే వాడాలని చెప్పామని ఈఎన్సీ స్పష్టం చేశారు.

నిమ్స్లో అవినీతి కుంభకోణాలు

ఇంప్లాంట్లు, కన్జెన్మెంట్ వస్తువులను అనధికారికంగా నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం మెయిన్ స్టోర్కు ఇండెంట్ పెట్టాల్సి ఉండగా, కొందరు వైద్యులు నర్సింగ్ సిబ్బంది నేరుగా వెండర్ల నుంచే ఇంప్లాంట్లు తీసుకుంటున్నట్లు తేలింది.ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందిన రోగుల విషయంలో తీవ్ర అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. రోగులు డిశ్చార్జ్ అయిన తర్వాత బిల్లులు ప్రాసెస్ చేయడం, కొన్ని సందర్భాల్లో రోగులు మరణించిన మూడు నెలల తర్వాత కూడా వారి పేరిట బిల్లులు ప్రాసెస్ చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. కేవలం జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో డిశ్చార్జ్ అయిన రోగులకు సంబంధించి సుమారు రూ.66 లక్షల విలువైన బిల్లింగ్ ఎంట్రీలను ఆలస్యంగా నమోదు చేసినట్లు తనిఖీల్లో తేలినట్లు అధికారులు ప్రకటించారు.

ఒకే రోగికి వారంలో 800 గ్లౌజులు!

రోగులకు ఆపరేషన్లు పూర్తయిన తర్వాత యుటిలిటీ సర్టిఫికెట్లు జారీ చేసి, వెండర్ బిల్లులతో పాటు మెయిన్ స్టోర్కు పంపుతున్నట్లు గుర్తించారు. ఈ విధానం వల్ల అసలు వినియోగించని ఇంప్లాంట్లకు యుటిలిటీ సర్టిఫికెట్లు జారీ చేసి, ప్రభుత్వ ఖజానా నుంచి బిల్లులు క్లెయిమ్ చేసే ప్రమాదం ఉందని ఏసీబీ అనుమానిస్తోంది. అంతేకాకుండా, సర్జికల్ కన్స్యూమబుల్స్ వినియోగంలో అసాధారణ పెరుగుదల నమోదైంది. ఏకంగా ఒకే రోగికి వారంలో 800 గ్లౌజులు వినియోగించినట్లు రికార్డుల్లో నమోదు చేయడం అధికారులను విస్మయానికి గురిచేసింది.

మందుల విక్రయల్లో ఉల్లంఘనలు

నిమ్స్లో మ్యాన్పవర్, సెక్యూరిటీ సేవల టెండర్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం, కుమ్మక్కు వ్యవహారాలు బయటపడ్డాయి.సెక్యూరిటీ టెండర్ల ఖరారులో అసాధారణ జాప్యం చేస్తూ కాంట్రాక్టులను పదేపదే పొడిగించారని అధికారులు తెల్చారు. నిబంధనల ప్రకారం పనిచేయక డిఫాల్ట్ అయిన ఏజెన్సీకి చెందిన రూ.28.13 లక్షల బ్యాంక్ గ్యారెంటీని జప్తు చేయకుండా నిర్లక్ష్యం వహించారు.2019 నుంచి 2025 మధ్య టెండర్ ప్రక్రియను పూర్తి చేయకుండానే పాత విధానాన్ని కొనసాగించారు. ఉద్యోగుల నియామకాలు, వారిని సెమీ స్కిల్డ్ కేటగిరీలోకి మార్చడంలో నిబంధనలు ఉల్లంఘించారు. ఈ నియామక ప్రక్రియలో కుమ్మక్కైనట్లు ప్రాథమిక ఆధారాలు లభించియని అధికారులు తెలిపారు. మరోవైపు, ఆసుపత్రి ప్రాంగణంలోని మెడికల్ షాపుల్లో మందుల విక్రయ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, అర్హత లేని, రిజిస్టర్ కాని సిబ్బందిని నియమించడం వంటి ఉల్లంఘనలను డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు.

దేశంలో చొరబాటుదారులకు కాంగ్రెస్ మద్దతు

వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు, పార్టీ శ్రేణులను అభినందించారు.ఓట్ల చోరీ జరిగిందంటూ రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను నితిన్ నబీన్ తప్పుబట్టారు. ప్రజల మద్దతు, అసలైన ఓట్లు బీజేపీ పక్షానే ఉన్నాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఇండీ కూటమి అడ్డుకుంటోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా మూడు కోట్ల మంది మరణించిన వారి పేర్లు, ఆరు కోట్లకు పైగా వలస వెళ్లిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా? అని ప్రశ్నించారు. ద్వంద్వ ఓట్లు, నకిలీ ఓట్ల తొలగింపును కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. అక్రమంగా దేశంలోకి వచ్చిన చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించాలన్నదే కాంగ్రెస్, ఇండీ కూటమి వైఖరని ఆరోపించారు. రాజ్యాంగ ప్రతులను చేతిలో పట్టుకుని తిరిగేవారికి రాజ్యాంగం తమ చేతుల్లోనే కాకుండా మనసుల్లో, హృదయాల్లో ఉందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థలను బీజేపీ గౌరవిస్తుందని చెప్పారు.కుటుంబం, పదవుల కోసం కాంగ్రెస్ గతంలో దేశంలో అత్యవసర పరిస్థితిని విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని నితిన్ నబీన్ విమర్శించారు. రాహుల్ గాంధీ దేశంలో ఉన్నప్పుడు ప్రజలను, విదేశాలకు వెళ్లినప్పుడు భారతదేశ ప్రతిష్ఠను అవమానించేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో బలహీన ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఉన్న భారత్.. నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. 2014కు ముందు దేశంలో నిరాశానిస్పృహలు ఉండేవని, మోదీ నాయకత్వంలో ప్రజల్లో నమ్మకం, ఆశలు చిగురించాయని అన్నారు. పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రభుత్వ సాయం నేరుగా లబ్ధిదారులకు చేరుతోందని వివరించారు. సరిహద్దుల్లో సైనికులకు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించడంతో పాటు సరిహద్దు గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

రేవంత్రెడ్డి ఢిల్లీ పెద్దలకు ఏటీఎంలా మారారు

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై నితిన్ నబీన్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఢిల్లీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. 36 నెలల పాలన పూర్తికాకముందే 82 సార్లకు పైగా ఢిల్లీకి వెళ్లారని, తెలంగాణ ప్రజలకు కాకుండా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధిష్ఠానానికి ఏటీఎంలా పనిచేస్తున్నారని వ్యాఖ్యానించారు. రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ ప్రజల కష్టార్జితాన్ని ఢిల్లీ పెద్దల కోసం వినియోగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ కౌంట్డౌన్ ప్రారంభమైందని, బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. 2028, 2029 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి ఆశీర్వాదం అందిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్తో పాటు నషా ముక్త్ భారత్ లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్లో కనిపిస్తున్న కాషాయ శ్రేణుల ఉత్సాహం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. నితిన్ నబీన్ నాయకత్వం పార్టీకి కొత్త ఉత్సాహాన్నిస్తోందని కొనియాడారు. 25 ఏళ్లకే ఎమ్మెల్యేగా ఎన్నికై ఐదుసార్లు గెలిచిన నితిన్ నబీన్, 45 ఏళ్లకే జాతీయ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం విశేషమన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు ఏళ్ల తరబడి పోరాడుతున్నారని, లాఠీ దెబ్బలు తిన్నా వెనక్కి తగ్గలేదని పేర్కొన్నారు. మరణించిన వారి ఓట్లు, వలస వెళ్లిన వారి ఓట్లు, ద్వంద్వ ఓట్లను తొలగిస్తే కాంగ్రెస్కు వచ్చిన నష్టమేంటని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్కు ప్రజలు ఎందుకు ఓటేయాలని నిలదీశారు. బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో కాంగ్రెస్ పాలనలో పలుమార్లు ఓటర్ల జాబితా సవరణ జరిగినప్పుడు అభ్యంతరం చెప్పని రాహుల్ గాంధీ ఇప్పుడు ఎస్ఐఆర్ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. మోదీ ఎన్నిక చెల్లదంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. రేవంత్రెడ్డి ప్రభుత్వాన్ని రద్దు చేసే ధైర్యం ఉందా అని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. మహాపాదయాత్రకు భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐసీసీ ఇంచార్జి సందీప్ మంత్రులతో వరుస భేటీలు

వ్యతిరేకత లేదన్నారు. రెండోసారి కూడా కాంగ్రెస్ పార్టీదే అధికారమని ఉత్తమ్కుమార్రెడ్డి అన్నారు. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు రాష్ట్ర ఇన్ఛార్జ్కు పలు సూచనలు చేసినట్లు చెప్పారు. మూడేళ్లలో చాలా మంది కార్యకర్తలకు న్యాయం జరగలేదని.. వారి గుర్తింపు కోసం కృషి చేస్తానన్నారు. పార్టీ అంతర్గత అంశాలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు తుమ



మక్తల్ అభివృద్ధికి విద్యే పునాది

రూ.9 కోట్లతో నూతన డిగ్రీ కళాశాల నిర్మాణం

- త్వరలో పీజీ కళాశాల.. మక్తల్‌ను స్టడీ, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, నవంబర్ 23 (జనంసాక్షి): మక్తల్ ప్రాంత విద్యాభివృద్ధికి రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన డిగ్రీ కళాశాల భవనానికి రాష్ట్ర క్రీడా, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్‌ను విద్యా, క్రీడా రంగాల్లో ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సాధారణంగా కేటాయించే రూ.6 కోట్లకు బదులుగా రూ.9 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం 540 మంది విద్యార్థులు డిగ్రీ చదువుతున్నారని, వచ్చే ఏడాది కార్తీక మాసంలో కళాశాల భవనాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలో పీజీ కళాశాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

నియోజకవర్గంలో సుమారు రూ. 2 వేల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, విద్య, వైద్యం, క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వెటర్నరీ పరిశోధనా కేంద్రాన్ని తీసుకొచ్చామని, వచ్చే నెలలో 150 పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తామని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సమీకృత పాఠశాలను ప్రారంభిస్తామన్నారు. సంగంబండ ప్రాజెక్టులో అదనంగా మరో టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధి పనులే చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఏడాదిలో కళాశాల నిర్మాణం పూర్తిచేయాలని, తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతు, కౌన్సిలర్ అల్కూరి పావని, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపాధి.. గ్రామాలకు అభివృద్ధే లక్ష్యం

- ప్రతి అర్హత గల కుటుంబానికి జాబ్ కార్డు..
- ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను ఏర్పాటు చేయాలి...
- జలసిరి కార్యక్రమంలో చెక్ డ్యాములు, కుంటలు,బోర్ రీఛార్జ్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి...
- డిసెంబర్ నుంచి గ్రామాల్లో అభివృద్ధి, ఉపాధి పనులను వేగవంతం చేయాలి..
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు బ్యూరో,నవంబర్23(జనం సాక్షి): గ్రామాల సమగ్ర అభివృద్ధి, గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రతి సర్పంచ్ తన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.సోమవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబి–జి రామ్ జి) పథకం కింద చేపట్టాల్సిన పనుల కార్యాచరణ ప్రణాళికపై సర్పంచులు, ఎంపీడీవోలు,సంబంధిత శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిధుల కొరత లేదని, అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి పనులను పెంచడంతో పాటు శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సర్పంచులు తమ పదవీకాలాన్ని గ్రామాల అభివృద్ధికి ఒక గొప్ప అవకాశంగా భావించి పనిచేయాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉపాధి పనులు కోరుకునే అర్హులైన ప్రతి కుటుంబానికి జాబ్ కార్డు అందేలా ఎంపీడీవోలు, సర్పంచులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రతి ఆవాసంలోని అర్హులను గుర్తించి జాబ్ కార్డుల కోసం దరఖాస్తులు చేయించడంతో పాటు ప్రతి 40 మంది ఉపాధి కూలీలకు ఒక మేట్‌ను ఏర్పాటు చేసి కూలీల భాగస్వామ్యాన్ని పెంచాలని ఆదేశించారు.

గ్రామాల్లో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా చర్యలు చేపట్టాలని, మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయించాలని సూచించారు. ప్రభుత్వ సహాయంతో పాటు లబ్ధిదారులు తమ ఆర్థిక స్థోమతకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలతో మరుగుదొడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.గ్రామాల్లో నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.జలసిరి కార్యక్రమం కింద ఊటకుంటలు, నీటికుంటలు, కట్టకుంటలు, బోర్ రీఛార్జ్ పనులతో పాటు చెక్ డ్యాముల నిర్మాణాన్ని కూడా చేర్చినట్లు తెలిపారు. గ్రామాల భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా చెరువులు,కుంటల పూడికతీత,చెక్ డ్యాముల నిర్మాణం వంటి నీటి సంరక్షణ పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి సమృద్ధిగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో నీటి కొరత సమస్యగా మారకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.గ్రామాల్లో సీసీ రోడ్లు,మట్టి రోడ్లు, బీటీ రోడ్లు,తాగునీటి సౌకర్యాలు,కాలువల తవ్వకం,పాఠశాలల నిర్మాణం,ప్రహరీ గోడలు, అంగన్వాడీ భవనాలు, షెడ్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పనులు అందుబాటులో లేకపోతే సమీప గ్రామాల్లో ఉపాధి కల్పించే అవకాశాలను పరిశీలించాలని, అటవీ ప్రాంతాల్లో కూడా అనుమతించబడిన పనులను చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. డిసెంబర్ నుంచి మే, జూన్ వరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి గ్రామాభివృద్ధిని ప్రతిబింబించేలా ప్రత్యేక పేరు పెట్టే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.ప్రజలకు ఉపాధి,గ్రామాలకు అభివృద్ధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా డిసెంబర్ మొదటి తేదీ నుంచి పనులను వేగవంతం చేయాలని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ములుగు జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన జిల్లాగా,ములుగు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఇందుకోసం సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామంలో అభివృద్ధి కనిపించేలా కృషి చేయాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీరాజ్ కమిషనర్ దిశానిర్దేశం

హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొని సర్పంచులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జాబ్ కార్డు ఉండేలా చూడాలని,ప్రతి 40 మంది ఉపాధి కూలీలకు ఒక మేట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వీబీ–జీ రామ్ జీ పథకం కింద అనుమతించబడిన 375 రకాల పనులపై సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, ముఖ్యంగా చెక్ డ్యాముల నిర్మాణం, నీటి సంరక్షణ పనులు, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా,వీబీ–జీ రామ్ జీ జాయింట్ కమిషనర్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్ హైదరాబాద్ మోరె శ్రీనివాస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం.సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్లు బైరెడ్డి భగవాన్ రెడ్డి, గుమ్మడి సోమయ్య, డీఆర్‌డీఓ చంద్రశేఖర్, డీపీఓ వెంకయ్య, గ్రామాల సర్పంచులు, ఎంపీడీవోలు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రిగోల్డ్ బాధితులకు ఊరట

- ఈ నెల 25 నుంచి బాండ్ల పరిశీలన
- ఐదు జిల్లాలకు మహబూబ్‌నగర్‌లో ప్రత్యేక కేంద్రం

వనపర్తి, నవంబర్ 23 (జనంసాక్షి): ఆగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. బాధితుల వద్ద ఉన్న అసలు బాండ్లు, నగదు రసీదుల పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను ఈ నెల 25 నుంచి ప్రారంభించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం, సీఐడీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పది ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల బాధితుల కోసం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయానికి ఎదురుగా ఉన్న సీఐడీ భవనంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. మండలాల వారీగా 193 రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియలో రోజుకు గరిష్ఠంగా 250 మంది బాండ్లను పరిశీలిస్తారు. నిర్దిష్ట తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బాధితులు హాజరుకావాలని ఎస్పీ డి. సునిత రెడ్డి సూచించారు. బాధితులు అసలు బాండ్ లేదా నగదు రసీదు, ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఫొటో, మొబైల్ నంబర్ల వివరాలు తీసుకురావాలి. డిపాజిటర్ మరణిస్తే నామినీ లేదా వారసులు మరణ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలు సమర్పించాలి. అసలు బాండ్లను అప్పగించాల్సిన అవసరం లేదని, పరిశీలన కోసమే చూపించాలని అధికారులు స్పష్టం చేశారు. బాండ్ కలర్ జిరాక్స్‌పై సంతకం చేసి సమర్పించాలి. సమర్పించిన పత్రాలకు రసీదు అందజేస్తారు.

ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జికి ఉప్పల శుభాకాంక్షలు

హైదరాబాద్ (జనంసాక్షి) : గాంధీ భవన్‌లో నూతన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ బి.ఎం. సందీప్ కుమార్‌కు టీపీసీసీ ఉపాధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త శుభాకాంక్షలు తెలిపారు. తన చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ వివాహ పత్రికను ఆయనకు అందజేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నూతన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఎం సందీప్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.





తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంలో, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో నూతన ఇన్‌చార్జ్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆకాంక్షించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

బోగస్ డెత్ సర్టిఫికెట్ల కుంభకోణంలో అసలు నిందితులను కాపాడుతున్న అధికారులు

- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 23, (జనంసాక్షి) : బెల్లంపల్లి మండలంలో చోటు చేసుకున్న బోగస్ డెత్ సర్టిఫికెట్ల కుంభకోణంలో అసలు నిందితులను అధికారులు కాపాడుతున్నారని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. సోమవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బెల్లంపల్లి మండలంలో బోగస్ డెత్ సర్టిఫికెట్ల వ్యవహారం రోజురోజుకూ అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. పాత బెల్లంపల్లి గ్రామపంచాయతీకి చెందిన మరణించిన వ్యక్తి పేరుతో, బూదే కుర్దు గ్రామపంచాయతీలో మరణించినట్లుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించారని అగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్‌తో పాటు స్థానిక సర్పంచ్, మీ సేవా కేంద్రం నిర్వాహకుడు, పంచాయతీ కార్యదర్శులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, అసలు పాత్రధారులందరినీ వెలికితీసి కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందనే కారణంతో కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక రక్షణ కల్పిస్తున్నారా? అని ప్రశ్నించారు. పోలీసుల విచారణలో రాజకీయ నాయకుల ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, వారిని విచారణ పరిధిలోకి తీసుకురాకుండా, ఈ వ్యవహారంతో సంబంధం లేని వ్యక్తులపై మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా చేయడం నిష్పక్షపాత విచారణ ఎలా అవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ జరిపి అసలు దోషులను గుర్తించకుండా, కేవలం పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేయడంతోనే బాధ్యత ముగిసిందని



భావిస్తున్నారా అని ప్రశ్నించారు. కేవలం కిందిస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకుంటే ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు వ్యక్తులపై చర్యలు లేవా అని అన్నారు. పెర్కపల్లి గ్రామపంచాయతీలోనూ ఇదే తరహా అక్రమాలు జరిగాయని అన్నారు. పెర్కపల్లి గ్రామపంచాయతీలోనూ సుమారు 10 మంది గోదావరి ఖని ప్రాంతానికి చెందిన వ్యక్తుల పేర్లపై మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.80 వేల రూపాయల మేర బేరసారాలు జరిగినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, పోలీసులు సమగ్ర విచారణ ఎందుకు చేపట్టడం లేదన్నారు. బోగస్ డెత్ సర్టిఫికెట్ల వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయంపై వస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులపై ఆరోపణలు వస్తే విచారణ జరగకూడదా? నిజంగా తప్పు చేసిన వారిని వదిలేసి, సంబంధం లేని వ్యక్తులపై కేసులు నమోదు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ పారదర్శక పాలనా? కంప్యూటర్ ఆపరేటర్, సర్పంచ్, మీ సేవా నిర్వాహకుడు, పంచాయతీ కార్యదర్శుల వరకు ఎవరి పాత్ర ఎంత ఉందో బహిర్గతం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? ఈ కుంభకోణంపై నిష్పక్షపాత విచారణకు ఎమ్మెల్యే స్వయంగా చొరవ తీసుకుంటారా? అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

ఎస్ఐ అత్యుత్సాహం.. యువకుడికి గాయాలు!

తల్లాడ (జనంసాక్షి) : భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థలను పరిష్కరించాల్సిన పోలీసు అధికారి అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. కౌన్సిలింగ్ కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ యువకుడిపై ఎస్ఐ చేయి చేసుకోవడంతో అతడి చెవికి తీవ్ర గాయమై రక్తస్రావమైన ఘటన ఖమ్మం జిల్లా తల్లాడ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోనిజర్ల మండలం పెద్ద రాంపురం గ్రామానికి చెందిన కుప్పక పవన్ కుమార్‌కు, తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో సమస్య పరిష్కారం కోసం ఈ నెల 21న ఇరువురు తల్లాడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో దంపతులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న తల్లాడ రెండో ఎస్ఐ బానోతు వెంకటేష్ ఒక్కసారిగా సహనం కోల్పోయి పవన్ కుమార్ ఎడమ చెవిపై బలంగా కొట్టినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో పవన్ తల పక్కనే ఉన్న గోడకు బలంగా

ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇంగ్లీష్ టీచరే లేరు

- 198 మంది విద్యార్థుల భవిష్యత్తుతో విద్యాశాఖ చెలగాటం
- ఇంగ్లీష్ టీచర్‌తో పాటు పీఈటీ, పర్మనెంట్ హెడ్‌మాస్టర్ కూడా కరువే
- న్యాయం కోసం కలెక్టర్ కార్యాలయం మెట్లెక్కిన నామాపురం విద్యార్థులు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 23,(జనం సాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని ప్రభుత్వం గొప్పగా చెబుతోంది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థుల భవిష్యత్తును బంగారు బాటలు వేస్తామని ప్రకటనలు చేస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. ఇంగ్లీష్ మీడియంలో చదువులు చెబుతున్న ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ పాఠాలు బోధించే ఉపాధ్యాయుడే లేకపోవడం విద్యాశాఖ పనితీరుకు అద్దం పడుతోంది. ఒకరిద్దరు కాదు.. ఏకంగా 198 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో కీలకమైన ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది.నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం నామాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ దుస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠాలు చెప్పే టీచర్ లేకపోతే వారి విద్యా ప్రమాణాలు ఎలా మెరుగుపడతాయన్న ప్రశ్న తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతోంది.





198 మంది విద్యార్థులు.. ముగ్గురు కీలక సిబ్బంది కరువు

పాఠశాలలో మొత్తం 198 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నప్పటికీ ఇంగ్లీష్ టీచర్ అందుబాటులో లేరు. అంతేకాదు, విద్యార్థుల క్రీడా నైపుణ్యాలను పెంపొందించాల్సిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) కూడా లేరు. పాఠశాల నిర్వహణకు అత్యంత కీలకమైన పర్మనెంట్ హెడ్‌మాస్టర్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. ఒకవైపు విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉన్నా, మరోవైపు కీలకమైన సిబ్బంది లేకపోవడం పాఠశాల విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను బయటపెడుతోంది. విద్యార్థులకు కేవలం పుస్తకాలు, భవనాలు ఉంటే సరిపోదు. వారికి పాఠాలు బోధించే అర్హులైన ఉపాధ్యాయులు, పాఠశాలను సమర్థవంతంగా నడిపించే ప్రధానోపాధ్యాయుడు, క్రీడల్లో ప్రోత్సహించే పీఈటీ అవసరం. కానీ నామాపురం ప్రభుత్వ పాఠశాలలో ఈ మూడు కీలక బాధ్యతలకు సంబంధించిన పోస్టులు ఖాళీగా ఉండటం విద్యార్థుల చదువుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో విద్యాశాఖ అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

కలెక్టర్ కార్యాలయం మెట్లెక్కిన విద్యార్థులు

తమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎన్నిసార్లు చెప్పుకున్నా పరిష్కారం దొరకడం లేదన్న ఆవేదనతో విద్యార్థులు కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తమకు ఇంగ్లీష్ టీచర్‌ను నియమించాలని, పర్మనెంట్ హెడ్‌మాస్టర్‌ను ఏర్పాటు చేయాలని, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌ను నియమించి పాఠశాలలో పూర్తిస్థాయి విద్యా వాతావరణం కల్పించాలని కోరుతున్నారు. విద్యార్థులే నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రతను తెలియజేస్తోంది.

ఇంగ్లీష్ మీడియం అంటారు.. ఇంగ్లీష్ టీచర్‌ను ఎందుకు నియమించరు

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని చెబుతున్న పాలకులు, విద్యాశాఖ అధికారులు ముందుగా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినప్పుడు అందుకు అవసరమైన ఉపాధ్యాయులను కూడా నియమించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయుడు లేకుండా విద్యా బోధన ఎలా కొనసాగుతుంది. 198 మంది విద్యార్థుల చదువుకు బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలు ఇప్పుడు నామాపురం గ్రామంలో వినిపిస్తున్నాయి.

విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించాలి

నామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలి. ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, పర్మనెంట్ హెడ్‌మాస్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తాత్కాలిక ఏర్పాట్లతో సరిపెట్టకుండా పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 నవంబర్ 2026

పేదరికం లెక్కలు, పేదల బతుకులు: ఏది నిజం?

సంపాదకీయం
జనంసాక్షి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లింక్డ్‌ఇన్‌లో రాసిన సుదీర్ఘ పోస్టు చూస్తే, దేశంలో పేదరికం దాదాపు కనుమరుగవుతున్నట్లు, వికసిత్ భారత్ గడప దాకా వచ్చేసినట్లు అనిపిస్తుంది. ప్రపంచబ్యాంక్ నివేదిక ప్రకారం 2011-23 మధ్య దాదా పు 50 కోట్ల మంది పేదరికాన్ని జయించారని, మోదీ సర్కారు సంక్షేమ కార్యక్రమాల వల్లే ఇది సాధ్యమైందని ఆమె చెప్పారు. అయితే ఇదే దేశంలో 80 కోట్ల మంది ప్రభు త్వం ఇచ్చే ఉచిత రేషన్‌పై బతుకుతున్నారు. ఈ రెండు వాస్తవాలను ఒకే వాక్యంలో పెట్టి చూస్తే, ఎవరికైనా ఒక ప్రశ్న రాకుండా ఉండదు. ఈ లెక్కలను ఎలా నమ్మాలి?

ఆర్థిక మంత్రి చెప్పిన నిర్వచనం బాగుంది. డబ్బు లేకపోవడం ఒక్కటే పేదరికం కాదని, ఇల్లు, తాగునీరు, వైద్యం వంటి కనీస అవసరాలు అందుబాటులో లేకపోవడం కూడా పేదరికమేనని, ఒక్క తీవ్రమైన అనారోగ్యం కుటుంబాన్ని కటిక పేదరికంలోకి నెట్టేస్తుందని ఆమె అన్నారు. ఇదే కొలమానంతో దేశాన్ని చూద్దాం. కుటుంబ ఆదాయంలో పెద్ద భాగం వైద్యానికే పోతున్న కోట్ల మంది పరిస్థితి ఏమిటి? ఆరోగ్య బీమా ఉన్నా సొంత జేబు నుంచి ఖర్చు పెట్టాల్సి వస్తున్న కుటుంబాలు ఎన్ని? ప్రభుత్వ బడుల్లో పిల్లలు ఏం నేర్చుకుంటున్నారు? ఐదేళ్లలోపు పిల్లల్లో దాదాపు 30 శాతం మంది ఎదుగుదల లోపంతో ఉంటే, ఆకలి సూచికలో 122 దేశాల్లో మనది 100వ స్థానమైతే, ఈ నిర్వచనం ప్రకారం పేదరికం తగ్గిందని ఏ ముఖంతో చెప్పగలం? మంత్రి ఇచ్చిన కొలమానమే ప్రభుత్వ వాదనకు ఎదురు తిరుగుతోంది. పేదరికాన్ని కొలిచే గీత ఎక్కడ గీస్తారన్నదే అసలు మతలబు. రోజుకు కొన్ని డాలర్ల కంటే ఎక్కువ ఖర్చు చేస్తే పేదరికం నుంచి బయటపడినట్లు లెక్కిస్తే, ఆ గీతను దాటినవాడు కూడా ఒక జబ్బు వస్తే మళ్లీ కిందికి జారిపోతాడు. అలాంటి వాడికి కూడా నెలనెలా ఉచిత బియ్యం, గోధుమలు అవసరమవుతున్నాయి. కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని చెబుతూనే, 80 కోట్ల మందికి రేషన్ ఇవ్వడం మానలేకపోతున్నామంటే, ఆ బయటకు వచ్చిన వారు ఎంత దూరం వచ్చినట్లు? గీతకు అటు ఇటు తచ్చాడుతున్నవారిని లెక్కల్లో విజేతలుగా చూపించడం పేదరికం మీద గెలుపు కాదు, గణాంకాల మీద గారడీసంక్షేమ పథకాలను తక్కువ చేయాల్సిన పనిలేదు.

స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, ముద్ర రుణాలు ఎందరికో ఉపయోగపడ్డాయి. ముద్ర రుణంతో కుటుంబ ప్రింటింగ్ వ్యాపారాన్ని నిలబెట్టుకున్న సుస్మితా ఘరాయ్, నాగాలాండ్ నుంచి చిరుధాన్యాలను ఆన్‌లైన్‌లో అమ్ముతున్న లఖ్‌పతి దీదీ ఎస్థర్ నిజమైన విజయగాథలే. కానీ కొన్ని విజయగాథలను చూపించి కోట్ల మంది కష్టాన్ని కప్పిపుచ్చడం న్యాయం కాదు. ఇలాంటి ఉదాహరణలు ఉన్నాయి కాబట్టి దేశం మొత్తం బాగుందని చెప్పలేం. గ్రామాల్లో ఆసుపత్రులకు వైద్యులు లేరు, బడులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు, మరుగుదొడ్లు ఉన్నా నీళ్లు లేవు. ఈ లోటులను పథకాల పేర్లు, పోస్టుల్లో రాసే అంకెలు పూడ్చలేవు.

2047 నాటికి వికసిత్ భారత్ అన్న లక్ష్యం ఎవరికీ అభ్యంతరం కాదు. కానీ లక్ష్యం గురించి మాట్లాడే ముందు ఇప్పుడు మనం ఎక్కడ ఉన్నామో నిజాయితీగా ఒప్పుకోవాలి. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదుగుతున్నామని చెప్పుకుంటున్న దేశం, మానవ అభివృద్ధి సూచికలో 193 దేశాల్లో 130వ స్థానంలో ఉంది. ఈ అంతరమే అసలు కథ. జీడీపీ పెరగడం అభివృద్ధికి కొలమానం కాదు, ఆ సంపద సామాన్యుడి ఆరోగ్యం, చదువు, తిండి, ఇంటిని ఎంత మెరుగుపరిచిందన్నదే నిజమైన కొలమానం.

ప్రజలు గణాంకాలను చదవరు, తమ జీవితాలను చూస్తారు. నెలాఖరులో రేషన్ షాపు ముందు నిలబడే వృద్ధురాలికి, ఆసుపత్రి బిల్లు కోసం పొలం తాకట్టు పెట్టే రైతుకు, ప్రపంచబ్యాంక్ నివేదిక ఏమీ చెప్పదు. లెక్కలు గొప్పగా కనిపించినంత మాత్రాన బతుకులు బాగుపడవు. 80 కోట్ల మంది చేతులు రేషన్ కోసం చాస్తున్నంత కాలం, పేదరికం జయించామన్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకం కాదు, అనుమానం పెంచుతాయి. పోస్టులు కాదు, పొయ్యిలో కట్టెలు మండే పరిస్థితి రావాలి. అప్పుడే వికసిత్ భారత్ అనే మాటకు అర్థం ఉంటుంది.

496.

నిన్నటి సంచిక తరువాయి

వ్యక్తిగత అభిమానం కాదు.. ప్రజాస్వామ్య ప్రమాణాలే ప్రాతిపదిక!

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రజల కోసం జీవితాలను అంకితం చేసిన మహనీయులకు కొదవలేదు. గిరిజన హక్కుల కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు, రైతుల కోసం ఉద్యమించిన కన్నెగంటి హనుమంతు, సంఘసంస్కరణకు కృషి చేసిన కందుకూరి వీరేశలింగం, ఆధునిక తెలుగు సాహిత్యానికి కొత్త దిశ చూపిన గురజాడ అప్పారావు, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా కలం పట్టిన గుర్రం జాషువా, ప్రజాస్వామిక విలువల కోసం నిలిచిన వావిలాల గోపాలకృష్ణయ్య, శ్రమజీవుల జీవితాలను కవిత్వంలో ప్రతిబింబించిన మహాకవి శ్రీశ్రీ వంటి మహనీయుల సేవలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయి. వీరి జయంతులు, వర్ధంతులను కేవలం ఉత్సవాలుగా కాకుండా వారి ఆశయాలను ఆచరణలోకి తీసుకొచ్చే సందర్భాలుగా మార్చడం ప్రభుత్వాల బాధ్యత.

పాత్రికేయ రంగానికి సంబంధించి మరింత స్పష్టమైన ప్రమాణాలు అవసరం. ప్రభుత్వాలను ప్రశ్నించడం, ప్రతిపక్షాల వైఫల్యాలను కూడా ఎత్తిచూపడం, సామాన్యుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం, వార్తలకు రాజకీయ రంగు పులమకుండా వాస్తవాలను ప్రజల ముందుంచడం నిజమైన జర్నలిజం లక్షణాలు. పత్రికా స్వేచ్ఛ అంటే పత్రికాధిపతికి అపరిమిత అధికారం కాదు. అది ప్రజల సమాచార హక్కుతో ముడిపడిన బాధ్యత. అధికారానికి దూరంగా ఉండటం, తప్పులను సరిదిద్దుకోవడం, సంపాదకీయ స్వాతంత్ర్యాన్ని కాపాడటం మీడియా సంస్థల నైతిక బాధ్యత. రామోజీరావు గొప్ప పారిశ్రామికవేత్తగా చరిత్రలో స్థానం సంపాదించుకున్నారనడంలో సందేహం లేదు. ఆయన వ్యాపార విజయాలను అధ్యయనం చేయవచ్చు, ప్రశంసించవచ్చు. అదే సమయంలో ఆయన రాజకీయ సంబంధాలు, సంపాదకీయ వైఖరులు, వ్యాపార వివాదాలను కూడా విమర్శనాత్మకంగా పరిశీలించాలి. చరిత్ర అంటే కేవలం కీర్తనలు కాదు; ప్రశంసలతో పాటు ప్రశ్నలకు కూడా చోటుండాలి.అంతిమంగా ఒక వ్యక్తిని గౌరవించడం వేరు, ఆయనను మొత్తం సమాజంపై ఆదర్శంగా రుద్దడం వేరు. చంద్రబాబు నాయుడికి రామోజీరావుపై వ్యక్తిగత అభిమానం ఉండవచ్చు. కానీ ప్రభుత్వ నిర్ణయాలు వ్యక్తిగత అనుబంధాలకు అతీతంగా ఉండాలి. ప్రజాస్వామ్యంలో పాలకులు ప్రజలందరికీ ప్రతినిధులు తప్ప, తమకు ఇష్టమైన వ్యక్తుల అభిమాన సంఘాల ప్రతినిధులు కారు. రామోజీరావు వ్యాపార విజయాలు ఆయనకు వ్యక్తిగత గౌరవాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం సమర్థనీయమా కాదా అన్నది నిర్ణయించాల్సింది పాలకుల అభిమానం కాదు, ప్రజాస్వామ్య ప్రమాణాలే.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్, 9849328496.

నల్లమల ఆదివాసీలకు న్యాయం జరగాలి

నవంబర్ 23 అమరుడు పురుషోత్తం వర్ధంతి సందర్భంగా...



హక్కుల పోరాట యోధుడు, నడిగడ్డ అమరుడు పీడిత ప్రజల విముక్తి స్వాప్నికుడిని రాజ్యం హత్య చేయడాననికి భయపడి, ప్రైవేటు హంతక ముఠాచే 23 నవంబర్ 2000 నాడు చంపేసి నేటికి 26 సం॥లు పూర్తవుతున్నాయి. విప్లవోద్యమం నల్లమలను దాటి దండకారణ్యం చేరి దాన్నుంచి కూడా బలంగా విస్తరించకుండా బలహీనంగా నిర్మూలించబడిం దని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కాని హక్కులోద్యమమైనా, విప్లవోద్యమ మైనా పీడిత ప్రజల హక్కుల కోసం, విముక్తి కోసం తమ దారి ఎంత కష్టమైనదైనా దాన్నే ఆచరించి చివరివరకు కొనసాగారు. 1969 నక్సల్బరిలో విప్లవోద్యమం మొదలైనప్పటి నుండి తీవ్రమైన అణచివేత కొనసాగుతూ ఉంది. అది పట్టుకొని చంపేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించే ప్రక్రియను సవాలు చేస్తూ ఆవిర్భవించిందే పౌర హక్కుల సంఘం. ఆ ఎన్‌కౌంటర్ హత్యాకాండ నక్సల్బరీ ఉద్యమానికే పరిమితం కాలేదు. శ్రీకాకుళ ఉద్యమంలో ఉత్తర తెలంగాణ ఉద్యమంలో నల్లమల పోరాటంలో చివరికి దండకారణ్య ఉద్యమంలో కూడా బలంగా కొనసాగి చట్టాల్ని, రాజ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజాస్వామ్యం పేరుతో అన్ని రాజకీయపార్టీలు పాలక వర్గాలుగా ఏదో విధంగా మారి పాలన చేసాయి, నేటికి చేస్తూనే ఉన్నాయి. ఏ పార్టీకూడా ఎన్‌కౌంటర్ (బూటకం) లేకుండా పాలన చేయలేకపోయాయి.

ఆ విధమైన హత్యాకాండతో బలమైన విప్లవోద్యమాన్ని నిర్మూలిం చగలిగాయి. ఈ హత్యాకాండపై ఎన్నో దశాబ్దాలుగా నిజనిర్ధారణ చేస్తున్న హక్కుల సంఘాలను కూడా దండకారణ్యంలో అడుగు పెట్టనీయకుండా చట్టవిరుద్ధ అణచివేతతో ఆదివాసుల జీవించే హక్కును నరసంహారంతో అణచివేసాయి. ఆ ఉద్యమం, ఉద్యమకారులు దశాబ్దాలుగా వారి ఆచరణలో ఇంతటి విలువలైన అంశాలున్నప్పటికి వాటిని ఎక్కడ కూడా ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోలేకపోయాయి. ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలు బీర్సా ముండా, కొమురంభీం పోరాటాల తరువాత ఆదివాసీలు సాధించుకున్న పేసా చట్టం, అడవీ హక్కుల చట్టం, 5వ షెడ్యూల్ లాంటి చట్టాలు ఎక్కడ కూడా అమలు కావడం లేదు. వాటి అమలు కోసం కూడా ఆదివాసీ ప్రాంతాల్లో నేటికి వారు ఉద్యమిస్తూనే ఉన్నారు. ఆ ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా కలింగనగర్ 12 మంది ఆదివాసీలను నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వాలు చంపేసాయి. ప్రభుత్వం రాజ్యాంగంలో పేర్కొన్న చట్టాల అమలు దొరకన ందునే ఆదివాసీ ఉద్యమాలు బలంగా సాగుతున్నాయి. ఆ ఉద్యమాలపై కొనసాగిన అణచివేతను ప్రశ్నించే ఆచరణలోనే కొనసాగుతున్నది పౌర హక్కుల సంఘం. అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టిఆర్ కాలంలో ఆట-మాట-పాట-బంద్ కొనసాగుతున్న స్థితిలో హక్కులకై ఉద్యమించడం కూడా ప్రభుత్వాలు నేరంగా భావించాయి. ఆ స్థితిలో ప్రజల సానుభూతిని బలంగా పొందిన హక్కుల ఉద్యమకారుడు పురుషోత్తంను చంపాలని అనుకున్నప్పటికి రాజ్యానికి ధైర్యం చిక్కలేదు. ఈ నేపథ్యంలోనే అప్పటికే సరెండర్ అయి ఉన్నటువంటి ప్రైవేటు హంతక ముఠా నయీం గ్యాంగ్‌తో అత్యంత కిరాతకంగా పౌరహక్కుల పురుషోత్తంను హత్యగావించారు. ముఖ్యంగా హత్యలతో ఉద్యమాలను అణచివేయాలని, నిర్మూలించాలని ప్రభుత్వాలు చాలా ఏళ్ళుగా ప్రయత్నాలు చేస్తున్నాయి. కాని ప్రజల మౌళిక సమస్యలు పరిష్కారం కానంత వరకు పోరాటాలు ఏదో ఒక రూపంలో ఆవిర్భవిస్తూనే ఉంటాయి.

ప్రజల మౌళిక సమస్యల కోసం పోరాటాలు చేయడం అత్యంత సహజం. ఆ పోరాటలపై వచ్చిన అణచివేతే ఆ పోరాటాలను సాయుధ రూపంలోకి తీసుకెళ్ళాయి. ఆనాటి నుండి ఈనాటి వరకు అఖిల భారత స్థాయిలో హక్కుల సంఘాలు రాజ్యహింసను అణచివేతను ఎన్‌కౌంటర్ హత్యాకాండలను ప్రశ్నిస్తూ ఉద్యమిస్తూనే ఉన్నాయి. గత 14 ఏళ్ళ మోడి పాలన కాలంలో ఎన్‌కౌంటర్ హత్యాకండ ఒకరిద్దరిని దాటి 30, 40, 50ల వరకు చేరింది. దీనికి దండకారణ్యాన్ని మొత్తంగా 8 లక్షల సాయుధ బలగాలతో నింపేసి ఉద్యమకారులను వెతికి వెతికి వెంటాడి మరీ చంపేసిం ది. చివరికి గాజర్ల రవి, హిడ్మాలను కూడా ఉద్యమమే లేని మారెడ్‌మిల్లి అడవిలోకి తీసుకెళ్ళి అత్యంత దారుణంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. ఇలా గత 50 ఏళ్ళుగా ఈ ఉద్యమాలపై అణచివేతలు వివిధ ఆపరేషన్ల పేరుతో కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా 2005లో వచ్చిన సల్వాజుడుం, 2009లో వచ్చిన గ్రీన్‌హంట్, 2024లో వచ్చిన ఆపరేషన్ కగార్‌లు ఉన్నాయి. గతంలో జరిగిన ఆపరేషన్లకు ఈ కగార్ ఆపరేషన్‌కు ఒక ప్రత్యేకమైన తేడా ఉంది, అది ఈ హత్యాకాండను బయటి ప్రపంచానికి తెలియనీయకుండా దేశంలోని అన్ని హక్కుల సంఘాలపై బలమైన నిర్బంధాన్ని కొనసాగించే సరికి, ప్రభుత్వం మీడియా ఏ విషయాలు బయటికి తెచ్చాయో అవే నిజాలయ్యాయి. కాని ప్రభుత్వమే ఉద్యమకారులను చుట్టుముట్టి బంధీలుగా చేసి ఇన్‌ఫార్మర్లతో విష ఆహారం పెట్టించి, తీవ్ర చిత్రహింసలకు గురిచేసి చంపిన హత్యాకాండ ఘటనలే ఎక్కువగా ఉన్నాయనేది సత్యం. గతంలో ప్రభుత్వం చేసిన ఏ ఎన్‌కౌంటర్ హత్యాకాండనైనా నిజనిర్ధారణ చేసి ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి అన్ని హక్కుల సంఘాలు తమ హక్కుగా ఆచరించాయి. కాని ఈ ఆపరేషన్ కగార్‌లో రాజ్యాంగ విలువలు, చట్టబద్ధత, చివరికి మానవత్వం కూడా లేకుండా నిరాయుధులుగా, ఒంటరిగా దొరికిన ఉద్యమకారులను తీవ్ర చిత్రహింసలకు గురి చేసి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించాయి. అందులో భాగంగా ఖాతారాంచంద్రారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మిడ్‌కోలతో పాటు గాజర్ల రవి, హిడ్మాలను కూడా బంధీలుగా చేసుకొని ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారు. కాని గాజర్ల రవి, హిడ్మాలకు సంబంధించి వారిని సరెండర్ చేసే ప్రక్రియలో భాగంగా కుటుంబ సభ్యుల వరకు ఈ విషయాలను తీసుకెళ్ళారు. కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో అత్యంత కిరాతకంగా హత్యచేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. ఆదివాసీల నుంచి వచ్చిన హిడ్మా నేడు బీర్సా ముండా, కొమురంభీంల తరువాత ఆదివాసీలకు ఒక పోరాట నాయకుడి స్ఫూర్తిని ఆదివాసీలకు అందించగలిగారు.

ఈ ఎన్‌కౌంటర్ హత్యాకాండలను ప్రశ్నించడంలో రాజ్యహింసను నిలదీయడంలో ముందు భాగంలో నిలబడ్డందుకే రాజ్యం పురుషోత్తంపై కన్నెర్ర చేసింది. కాని రాజ్యానికి ధైర్యం చాలలేదు. అంత గొప్పగా పురుషోత్తం ప్రజల్లో సానుభూతిని, ఆదరణను పొంది ఉన్నాడు. అందువల్లనే చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన నయీం హంతకముఠా తానుగా దాడు లు చేస్తూ ప్రభుత్వం ఎన్నిక చేసిన ప్రజా సంఘాల నేతల్ని హత్య చేస్తూ సమాజంలో భయానక వాతావరణాన్ని సృష్టించింది. అలాంటి స్థితిలో పౌరహక్కుల సంఘంలో గాని ప్రజా సంఘాలలో గాని పని చేయడం కూడా ఎంతో ధైర్యంతో కూడిన పనిగా మారిపో యింది. చాలా మంది ప్రజాసంఘాల నాయకులు ఉద్య మాలకు ఆచరణకు దూరమయ్యారు. కాని పురుషోత్తం, ఆజాం అలీలు, తమ ఆచరణను ఇంకా పదునెక్కిస్తూ రాజ్యాన్ని నిలదీస్తు హక్కులోద్యమాన్ని బలంగా కొనసాగించారు.నేడు కూడా నల్లమలలో విప్లవోద్యమం లేనప్పటికి అక్కడ జీవిస్తున్న చెంచులు హక్కుల కోసం ఉద్యమిస్తూనే ఉన్నారు. వారిని ఎలాగైనాసరే నల్లమల అడవి ఉంచి ఖాళీ చేయించాలని సుదీర్ఘ కాలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు (రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పార్టీకి చెందినవైనా గాని) తీవ్రంగా ప్రయత్నం చేసాయి. అందులో భాగంగానే 2009 నుండి 2012 వరకు ప్రపంచ ప్రఖ్యాత వజ్రాల తవ్వకం సంస్థ (డిబీర్స్) నాగర్‌కర్నూల్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో వజ్రాలు, విలువైన ఖనిజాల కోసం అన్వేషన జరిపించింది. దీనిని ఆనాడు కూడా దేశంలోని పర్యావరణ వేత్తలు మరియు స్థానిక చెంచు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించిన కారణంగా ఆనాడు మైనింగ్‌కు అనుమతి లభించలేదు.

2019లో యురేనియం ఖనిజం ఉందని, దానిని వెలికి తీయడం కోసం 83 చదరపు హక్టార్ల అడవుల్లో యురేనియం కోసం 4వేల బోర్లు తవ్వడం జరిగింది. ఇవన్నీ ఎవరికి తెలియకుండా ప్రభుత్వం రహస్యంగా నిర్వహించింది. దాన్ని వ్యతిరేకిస్తూ అనేక హక్కుల సంఘాలు ప్రజా సంఘాలు నల్లమల ప్రజలతో కలిసి ధర్నాలు ఊరేగింపులు చేయడం దీనికి మద్దతుగా సినీ ప్రముఖులు పర్యావరణ వేత్తలు ముందుకు రావడంతో యురేనియం వెలికితీత పని కూడా నిలిపివేయబడింది. కాని నేడు జరుగుతున్నది 1,253 కుటుంబాలకు ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పోర్ ఏరియా నుండి 417 కుటుం బాలను మొదటి దశలో, రెండవ దశలో 836 కుటుంబాలను రీలొకేషన్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా మొదటి ఫేజ్‌లో వటవర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు, కొల్లంపేట, దాటిగుండాల గ్రామాల ప్రజలను అదే నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని బాచారం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఇప్పటికే 55 కోట్లు విడుదల కాబడ్డాయి. ఇంకొక 100 కోట్లతో ఈ రీలొకేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. 3700 ఎకరాల బాచారం ఫారెస్టును రెవెన్యూ లాండ్‌గా మార్చి తరలిస్తున్న గ్రామాల ప్రజలకు 5 ఎకరాల భూమి, 250 గజాల ఇంటి స్థలము, 15 లక్షల నగదు ఇచ్చే ప్రక్రియను కొనసాగిస్తున్నది. దీని మూలంగా ఇప్పుడు బాచారం అటవీ ప్రాంతంలో లక్షకు పైగా చెట్లను నరికివేసే ప్రయత్నం జరుగుతున్నది.

ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో గతంలో జరిగిన తరలింపు అనుభవాల వల్ల ఆమ్రాబాద్ చుట్టూ ఉన్న ఆందోళనలు మరింత తీవ్రమవుతున్నాయి. అక్కడ 2024లో మైసంపేట, రాంపూర్ వంటి గ్రామాలను తగిన చట్టపరమైన నిబంధనలు పాటించకుండానే తరలించినట్లు నివేదికలు చెబుతున్నాయి. బాధిత కుటుంబాలు ఇప్పటికీ భూమి కేటాయింపు, పరిహారం, హామీ ఇచ్చిన సౌకర్యాల కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. వారికి ఇచ్చిన భూములు సాగుకు యోగ్యంగా లేకపోవడం లేదా ఆర్థికంగా లాభదాయకంగా లేకపోవడం వల్ల చాలామంది రోజువారీ కూలీలుగా జీవిస్తున్నట్లు తెలుస్తోంది.ఇదే స్థితి ఈ ఆమ్రాబాద్ అడవీ ప్రాంతాల ప్రజలపై పడుతుందని భయపడుతున్నారు. ఇది మొదటి ఫేజ్ 2024 నుంచి ప్రక్రియ ప్రారంభించబడ్డప్పటికి ఇంత వరకు ఏ కుటుంబానికి కూడా 5 ఎకరాల భూమికి సంబంధించి రెవెన్యూ పట్టా అందించలేదు. కేవలం 15 లక్షల రూపాయలు ఇంటి స్థలం పట్టాలు మాత్రం చాలా అట్టహా సంగా అందిస్తున్నారు. ఇప్పటి వరకు అడవీ ప్రాంతాల్లో వారు చేసుకుంటున్న భూమి విషయంపై ఎంత భూమికి ఎంత ఇస్తారు అనే ప్రాతిపదిక లేకుండా పోయింది. కేవలం 5 ఎకరాల భూమి మాత్రం ఇస్తామని చెబుతున్నారు. ఇది కూడా ఇప్పటికి ఆచరణకి నోచుకోవడం లేదు. ఇది ఇలా ఉండగానే సంబంధిత గ్రామాలలో మౌళిక వసతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా పాఠశాల భవనానికి సాంక్షన్ అయిన నిధులను ఆపేసి కూలిపోతున్న పాఠశాలలోనే తరగతులను నిర్వహిస్తున్నారు. కాబట్టి పూర్తిగా రీలొకేషన్‌కు గురవుతున్న ప్రజలకు పూర్తి సమ్మతిని తీసుకోవడం లేదు. తీసుకోకపోగా ఉంటున్న ఆదివాసీలకు ఆదివాసేతరులకు సరియైన మౌలిక హక్కుల పట్ల రక్షణ కల్పించడం లేదు. వీటన్నింటి నేపథ్యంలో ప్రభుత్వం ఏదో రకంగా గ్రామాలను రీలొకేషన్ చేయాలనే తలంపు తప్ప తరలింపుకు గురవుతున్న ప్రజల సమస్యల పట్ల గాని ఉండిపోతున్న ప్రజల సమస్యల పట్ల గాని ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించడం లేదు.

వివిధ గ్రామాల నుండి సేకరించిన సమాచారం ప్రకారం, తరలింపునకు ఏకగ్రీవ మద్దతు లేదని స్పష్టమవుతోంది. సార్లపల్లిలోని 74 చెంచు కుటుంబాలలో కేవలం 20 కుటుంబాలు మాత్రమే తరలివెళ్లడానికి సుముఖంగా ఉన్నట్లు సమాచారం. కుడిచింతలబయలులో 38 కుటుంబాలలో 11 కుటుంబాలు, వట్వర్లపల్లి (రాయులేడుపెంటతో సహా)లో 25 కుటుంబాలలో కేవలం 3 కుటుంబాలు మాత్రమే తరలింపునకు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. తరలివెళ్లడానికి అంగీకరించిన వారిలో కూడా చాలామంది పేదరికం, అభద్రత, కనీస సౌకర్యాల నిరాకరణ లేదా ఇతర ప్రత్యామ్నాయాలు లేకపోవడం వల్ల గత్యంతరం లేక అంగీకరించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది ఒక లోతైన రాజ్యాంగ బద్ధమైన ప్రశ్నను లేవనెత్తుతోంది: లేమి, అసమాన అధికార సంబంధాల మధ్య పొందిన సమ్మతిని నిజంగా స్వచ్ఛందమైనదిగా పరిగణించలేము.

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో జరుగుతున్న ఈ సంఘర్షణ పర్యావరణ పరిరక్షణ, రాజ్యాంగ నైతికత మరియు ఆదివాసీ హక్కులపై జరుగుతున్న ఒక పెద్ద జాతీయ చర్చకు ప్రతిబింబం. ఆదివాసీలు అడవులలోకి చొరబడిన వారు కాదు; వారు ఈ ప్రాంతాలకు చారిత్రక నివాసితులు మరియు సంరక్షకులు. పరిరక్షణ విధానాలు ఆదివాసీ హక్కులు, ప్రజాస్వామ్య భాగస్వామ్యం, ఆవాస భద్రత మరియు సాంస్కృతిక మనుగడను గౌరవించాలని రాజ్యాంగ నైతికత కోరుతోంది. కాబట్టి, ఈ సమస్య కేవలం తరలింపును సమర్థించడం లేదా వ్యతిరేకించడం గురించి మాత్రమే కాదు; వన్యప్రాణుల సంరక్షణ, ఆదివాసీల ఉనికిని పరస్పర విరుద్ధమైన ఎంపికలుగా చూపే అభివృద్ధి నమూనాను ప్రశ్నించడం గురించి. అందువల్ల చెంచుల పోరాటం కేవలం పరిహార ప్యాకేజీలు లేదా పునరావాస కాలనీల కోసం మాత్రమే కాదు. ఇది ఆత్మగౌరవం, స్వయం నిర్ణయాధికారం, సాంస్కృతిక కొనసాగింపు, రాజ్యాంగ రక్షణతో తమ పూర్వీకుల అడవులలో నివసించే హక్కు కోసం. పర్యావరణ పరిరక్షణ పేరుతో బలహీన వర్గాలను నిర్వాసితులను చేయడం, విచ్ఛిన్నం చేయడం మరియు వారి ఉనికిని దెబ్బతీయడం ద్వారా వారి భవిష్యత్తును కాపాడలేము అడవులు మనుగడ సాగిస్తూ, వన్యప్రాణులు వృద్ధి చెందుతూ, ఆదివాసీ సమాజాలు తమ సాంప్రదాయ ఆవాసాలలో గౌరవప్రదంగా జీవిస్తూ పరిరక్షణకు అడ్డంకులుగా కాకుండా, ప్రకృతిని రక్షించడంలో సమాన భాగస్వాములుగా ఉండే పరిరక్షణ నమూనాను భారతదేశం ఊహించగలదా అన్నదే అసలైన ప్రశ్న. చెంచులు చారిత్రాత్మకంగా నివసిస్తున్న ప్రాంతాలలో పులుల సంఖ్య పెరిగి ఉంటే, తరలింపును ఆశ్రయించే ముందు సహజీవన నమూనాలను నిజంగా అన్వేషించారా లేదా అనేదానికి రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అమ్రాబాద్ తరలింపు ప్రక్రియలో ఉన్న అత్యంత తీవ్రమైన ఆందోళనలలో ఒకటి, తరలింపును ప్రారంభించే ముందు అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయడంలో స్పష్టమైన వైఫల్యం కనిపించడం. టైగర్ రిజర్వ్ పరిధిలోని పలు చెంచు గ్రామాలలో, సామాజిక అటవీ హక్కుల క్లెయిమ్‌లు ఇంకా సబ్-డివిజనల్ లెవల్ కమిటీలు మరియు జిల్లా స్థాయి కమిటీల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అనేక వ్యక్తిగత అటవీ హక్కుల క్లెయిమ్‌లు కూడా పరిష్కారం కాకుండా లేదా పాక్షికంగా మాత్రమే గుర్తించబడి ఉన్నట్లు తెలుస్తోంది. రాయులేడుపెంట వంటి గ్రామాలలో కొంతమంది కుటుంబాలకు కేవలం ఐఎఫ్ఆర్ క్లెయిమ్ నంబర్లు మాత్రమే ఇచ్చారని, అధికారిక పట్టాలు ఎప్పుడూ జారీ చేయలేదని నివేదికలు చెబుతున్నాయి.

తక్షణమే హక్కు పత్రాలను పంపిణీ చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులను ఆదేశించినప్పటికీ, అమలు అసంపూర్ణంగానే ఉందని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, చెంచుల వంటి ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాలకు (PVTGs) అత్యంత కీలకమైన ఆవాస హక్కుల (Habitat Rights) ప్రక్రియ అసలు ప్రారంభమే కాలేదని తెలుస్తోంది. ఆవాస హక్కులు చాలా ముఖ్యమైనవి, ఎందుకంటే అవి PVTGలకు తమ సాంప్రదాయ భూభాగాలు, ఆచార వ్యవహారాలు, పర్యావరణ వ్యవస్థలతో ఉన్న సామూహిక సంబంధాన్ని గుర్తిస్తాయి. ఈ హక్కులను గుర్తించకుండా తరలింపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం అటవీ హక్కుల చట్టం (FRA) మరియు NTCA మార్గదర్శకాలను నేరుగా ఉల్లంఘించడమే అవుతుంది.

ప్రభుత్వ కథనం ఈ ప్రక్రియను పదేపదే "స్వచ్ఛంద తరలింపు"గా అభివర్ణిస్తోంది. అయితే, నిజమైన స్వేచ్ఛాయుత మరియు ముందస్తు సమాచారంతో కూడిన సమ్మతి (free and informed consent) వాస్తవంగా ఉందా లేదా అనే దానిపై తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. తమ జీవనాధార ఆర్థిక వ్యవస్థకు అవసరమైన వంటచెరకు, దుంపలు, ఔషధ మొక్కలు, అడవి ఆహారాలు మరియు కలపేతర అటవీ ఉత్పత్తులను సేకరించేటప్పుడు వేధింపులకు గురవుతున్నామని చాలామంది చెంచు మహిళలు ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం. సాగుపై అంక్షలు, దున్నడానికి

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయ పరంపర కొనసాగుతుంది

- బీజేపీ, బీఆర్ఎస్‌లది లోపాయికారీ ఒప్పందం
- కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి: మధుయాష్కి
- గెలిపిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా
- ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి



హయత్‌నగర్, నవంబర్ 23 (జనంసాక్షి): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో ఎన్నికల బరిలోకి దిగుతున్నాయని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం హయత్‌నగర్ టీ–నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. ఎల్బీనగర్‌లో పుట్టి పెరిగిన సామ రామ్మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, అదే విజయ పరంపరను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని కోరారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తాను స్థానికుడినని, తనను ఇంటి బిడ్డగా, తమ్ముడిగా భావించి ఆదరించాలని కోరారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే అందరికీ నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు లభిస్తున్న ప్రజా స్పందన ప్రోత్సాహాన్నిస్తోందన్నారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ కొత్త పట్టభద్రుల ఓటరు నమోదుపై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ముద్దగోని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్ గౌడ్, బానోతు సుజాత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు నిర్మాణం

- కౌన్సిలర్‌కు సబిత అభినందనలు
- రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం
- బీఆర్ఎస్ వార్డులపై నిధుల వివక్ష
- పన్నుల పెంపును నిలిపివేయాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి



చేవెళ్ల, నవంబర్ 23 (జనంసాక్షి): చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఊరెళ్ల రెండో వార్డులో బీఆర్ఎస్ కౌన్సిలర్ డప్పు సువర్ణచందు తన సొంత నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణానికి ముందుకొచ్చిన కౌన్సిలర్‌ను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వ నిధులు రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులకు సమానంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతల సిఫార్సులకే ప్రాధాన్యత ఇవ్వకుండా అర్హులందరికీ ఇళ్లు, పింఛన్లు, సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు.
ఊరెళ్ల వంటి గ్రామీణ ప్రాంతాలను మున్సిపాలిటీలో విలీనం చేయవద్దని ప్రజలు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వర్షాభావంతో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపాలిటీలో విలీనంతో గ్రామీణులకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, విలీన గ్రామాల్లో మూడేళ్ల వరకు ఇంటి పన్నులు పెంచకూడదనే నిబంధన ఉన్నప్పటికీ పన్నుల పెంపు చేపట్టడం సరికాదన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పన్నుల పెంపును నిలిపివేయడంతోపాటు ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు దూత మల్లేష్, మంగమ్మ మల్లేష్, నాయకులు గోనె కరుణాకర్‌రెడ్డి, గోపాల్, నర్సింహులు, వెంకటేష్, అనిల్, ఏంకమొల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల హక్కుల కోసం పెన్నార్ కంపెనీ ఎదుట ధర్నా

- అర్హులైన వారికి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి
- నెలకు రూ.30 వేల వేతనం చెల్లించాలని డిమాండ్

మోమిన్‌పేట, నవంబర్ 23 (జనంసాక్షి): వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం వెల్చాల్, మొరంగ పల్లి పరిధిలోని పెన్నార్ కంపెనీలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బోపోల్లా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏళ్ల తరబడి కంపెనీ అభివృద్ధికి శ్రమిస్తున్న కార్మికులకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు, గౌరవం, వేతనం అందించాలని బోపోల్లా విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి కార్మికుడికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని, నెలకు రూ.30 వేల వేతనం చెల్లించాలని కోరారు. ప్రతినెలా నిర్ణీత సమయంలో వేతనాలు ఇవ్వడంతో పాటు బోనస్ చెల్లించాలని, ఏటా వేతన పెంపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ ధర్నాలో వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు యు. రమేష్ కుమార్, వెల్చాల్ సర్పంచ్ శ్రీనివాస్, మొరంగపల్లి సర్పంచ్ అరుణ బిచ్చయ్య, రైతు నాయకుడు పి. రఘురాం రెడ్డి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కట్టెల మల్లేశం, బీజేపీ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఆర్. శ్రీశైలం తదితరులు పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు.

నకిలీ పత్రాలతో ఖాళీ స్థలం కబ్జాకు యత్నం

పత్రాలు పరిశీలించకుండానే ట్రెస్పాస్ కేసా?

- జేసీబీతో వచ్చి దౌర్జన్యం చేశారని 75 ఏళ్ల వృద్ధుడి ఆరోపణ
- మాజీ ఎంపీపీ లపంగి వజ్రమ్మ, సాగర్‌పై ఫిర్యాదు



మర్రిగూడ, నవంబర్ 22 (జనంసాక్షి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండ లం శివన్నగూడెం గ్రామంలో ఖాళీ స్థలం వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సుమారు 80 ఏళ్లుగా ఖాళీగా ఉన్న తమ కుటుంబ స్థలాన్ని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు మాజీ ఎంపీపీ లపంగి వజ్రమ్మ, సాగర్ ప్రయత్నించారని, జేసీబీతో ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యం చేశారని అదే గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు వడ్డే జంగయ్య ఆరోపించారు. భూమికి సంబంధించిన అసలు పత్రాలు, గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించకుండానే తమ కుటుంబంపై చొరబాటు కేసు నమోదు చేశారని మర్రిగూడ పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

80 ఏళ్లుగా ఖాళీ స్థలం.. ఇంటి నంబర్ ఎలా?

తమ కుటుంబానికి చెందిన స్థలం సుమారు 80 ఏళ్లుగా ఖాళీగానే ఉందని జంగయ్య పేర్కొన్నారు. అసలు ఇల్లు లేని స్థలానికి ఇంటి నంబర్ ఎలా కేటాయించారని, ఒకే ఇంటి నంబరుతో రెండు వేర్వేరు స్థలాలకు సంబంధించిన పత్రాలు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. గ్రామకంఠం భూమికి రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై విచారణ జరిపించాలని కోరారు.

జేసీబీతో వచ్చి దౌర్జన్యం చేశారని ఆరోపణ

మాజీ ఎంపీపీ లపంగి వజ్రమ్మ, సాగర్ జేసీబీతో తమ ఇంటి వద్దకు వచ్చి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని జంగయ్య ఆరోపించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో సాగర్ తనంతట తానే కింద పడటంతో తలకు గాయమైందని తెలిపారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను సమగ్ర విచారణ ద్వారా వెలికితీయాలని కోరారు.

రికార్డులు పరిశీలించకుండానే కేసు నమోదు?

స్థల యాజమాన్య పత్రాలు, ఇంటి నంబర్ కేటాయింపు వివరాలు, గ్రామపంచాయతీ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే తమ కుటుంబంపై ట్రెస్పాస్ కేసు నమోదు చేశారని జంగయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. భూమిపై హక్కులు ఎవరికి ఉన్నాయి? పత్రాల ప్రామాణికత ఏమిటి? అనే అంశాలను నిర్ధారించకుండా కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఘటనతో సంబంధం లేని కుటుంబ సభ్యులను కూడా కేసులో చేర్చారని ఆరోపించారు.

ఎస్పీ, డీపీఓ జోక్యానికి విజ్ఞప్తి

భూమికి సంబంధించిన అసలు పత్రాలు, ఇంటి నంబర్ కేటాయింపు రికార్డులు, గ్రామకంఠం భూమి వివరాలను పరిశీలించి సమగ్ర విచారణ జరిపించాలని జంగయ్య అధికారులను కోరారు. మర్రిగూడ పోలీసుల దర్యాప్తు తీరుపై కూడా విచారణ జరిపి, ఘటనతో సంబంధం లేని కుటుంబ సభ్యులపై నమోదైన కేసుల విషయంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 80 ఏళ్లుగా ఖాళీగా ఉన్న స్థలానికి ఇంటి నంబర్ ఎలా వచ్చింది? ఒకే ఇంటి నంబరుతో రెండు స్థలాలకు పత్రాలు ఉన్నాయా? గ్రామకంఠం భూమి రిజిస్ట్రేషన్ వెనుక వాస్తవాలేమిటి? అనే అంశాలపై రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల రికార్డుల పరిశీలనతోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వివరణ, అధికారుల స్పందన కూడా ఈ వ్యవహారంలో కీలకం కానున్నాయి.

ఓటర్ ఎగ్జిట్ 11 వద్ద రెండు బైకులు ఢీకొని ఒకరి దుర్మరణం!

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్23 (జనం సాక్షి): విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–65)పై ఓటర్ ఎగ్జిట్ నంబర్ 11 సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీ బృందావన్ ఉడిపి హోటల్ ఎదురుగా పెద్ద అంబర్‌పేట వైపు వెళ్లే రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకులపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడిపోగా, అదే సమయంలో అటుగా వస్తున్న కారు వారిపై నుంచి వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడు, గాయపడిన వ్యక్తుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.ప్రమాదానికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.



కల్తీ కల్లు విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసుల దాడి

ఎడపల్లి, (జనంసాక్షి) : ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో నిషేధిత మత్తు పదార్థమైన ఆల్ప్రాజోలం కలిపి కల్తీ కల్లు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, ఎడపల్లి ఎస్ఐ ఎం. రమ ఆధ్వర్యంలో, ఏసీపీ బోధన్ అనుమతితో పంచుల సమక్షంలో కల్లు దుకాణంపై సోమవారం పోలీ సులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో కల్లు దుకాణం నిర్వహిస్తున్న గుర్రం నారాయణ గౌడ్ (68) అనే వ్యక్తి కల్లులో ఆల్ప్రాజోలం కలిపి గ్రామస్థులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. సదరు వ్యక్తి కల్లులో ఆల్ప్రాజోలం కలుపుతున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అదే సమయంలో కల్లు సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులకు మూత్ర పరీక్షలు నిర్వహించగా, వారిద్దరికీ బెంజోడియాజిపైన్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీనిపై కేసు నమోదు చేయడం జరిగింది. కల్తీ కల్లు విక్రయాలపై పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎడపల్లి ఎస్సై రమ స్పష్టం చేశారు.

క్షేత్రస్థాయి పోలీసింగ్‌పై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి

శిక్షణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి

- విధులపై ప్రత్యక్ష అనుభవం పొందాలి
- ప్రజలకు మెరుగైన సేవలందించే అధికారులుగా ఎదగాలి
- ట్రైనీ డీఎస్పీలకు సీపీ గౌష్ ఆలం దిశానిర్దేశం



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 23 (జనంసాక్షి): పోలీస్ శిక్షణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ క్షేత్రస్థాయి విధులపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ట్రైనీ డీఎస్పీలకు సూచించారు. పోలీసింగ్ అంటే నేరాల నియంత్రణ మాత్రమే కాదని, ప్రజలకు భరోసా కల్పించడం, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, బాధ్యతాయుతంగా ప్రజాసేవ అందించడం కూడా అని పేర్కొన్నారు. 2026 నవంబర్ 23 నుంచి 2027 మే 9 వరకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రాక్టికల్ శిక్షణ కోసం కేటాయించిన ఐదుగురు ట్రైనీ డీఎస్పీలు సోమవారం సీపీని కలిసి రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని వివిధ విభాగాలు, వాటి విధులు, బాధ్యతలు, పోలీస్ శాఖ పనితీరుపై సీపీ వారికి వివరించారు. పోలీస్ స్టేషన్ల నిర్వహణ, కేసుల దర్యాప్తు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యక్ష అనుభవం పొందాలని సూచించారు.శిక్షణను కేవలం పరిశీలనకే పరిమితం చేయకుండా సీనియర్ అధికారుల అనుభవాలను తెలుసుకుంటూ విధి నిర్వహణలోని మెళకువలను నేర్చుకోవాలన్నారు. నాయకత్వ లక్షణాలు, నిర్ణయాత్మక సామర్థ్యం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని, బాధితులకు సత్వర న్యాయం అందించే సమర్థవంతమైన అధికారులుగా ఎదగాలని దిశానిర్దేశం చేశారు. శిక్షణకు హాజరైన వారిలో యెల్లబోయిన రుచిత, కొతురి ప్రణీత్, మహేష్ రెడ్డి పైళ్ల, నిశాంత్ పి.ఎం తదితరులు ఉన్నారు. ఆరు నెలలపాటు కొనసాగే ఈ శిక్షణలో వివిధ పోలీస్ విభాగాల్లో పనిచేస్తూ పరిపాలన, దర్యాప్తు, క్షేత్రస్థాయి విధులు, ప్రజాసేవపై ప్రత్యక్ష అనుభవం పొందనున్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తే అరెస్టా..?

- ఎమ్మెల్యే గారు..ఇదేనా మీ ప్రజాస్వామ్యం..?
- మా గ్రామానికి పిఎసిఎస్ కావాలి..కేసులు వద్దు..
- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటయ్య అరెస్టుపై ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రశేఖర్ రెడ్డి

తలకొండపల్లి నవంబర్ 23 (జనంసాక్షి): గ్రామ ప్రజల ఆకాంక్ష మేరకు సమస్యలపై ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటయ్య పై కేసులు పెట్టి అరెస్ట్ చేయించడం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి తగునా అని బీఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో వెంకటయ్య అక్రమ అరెస్టును నిరసిస్తూ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సింగిల్ విండో కార్యాలయాలను మంజూరు చేయడంతో,తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామానికి కూడా నూతన పిఎసిఎస్ కార్యాలయాన్ని మంజూరు చేయాలని గ్రామస్థులు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు.అయితే గ్రామానికి పిఎసిఎస్ మంజూరు కాకపోవడంతో,గ్రామస్థులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య గ్రామంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో గ్రామానికి పిఎసిఎస్ ఏర్పాటులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ చూపకపోవడం సరికాదని,ఆయన ఒక పార్టీకి మాత్రమే ఎమ్మెల్యే కాదు,కల్వకుర్తి నియోజకవర్గం మొత్తానికి ఎమ్మెల్యే అని ప్రశ్నించారు.దీనిని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే కక్ష గట్టి నేడు వెంకటయ్యపై కేసులు పెట్టి అరెస్ట్ చేయించడం తగదని చంద్రశేఖర్ రెడ్డి మండిపడ్డారు.గ్రామ సమస్యల గురించి,గ్రామ పంచాయతీ అభివృద్ధి గురించి మాట్లాడినందుకు నిర్దాక్షిణ్యంగా కేసులు నమోదు చేయించి అరెస్ట్ చెయ్యడం నేరమని అన్నారు.కాంగ్రెస్ ప్రజా పాలనలో సమస్యలపై మాట్లాడిన ప్రతి ఒక్కరిపై ఇలాగే కేసులు పెట్టుకుంటూ వెళితే,నియోజకవర్గంలో అందరిపైనా కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.గ్రామానికి పిఎసిఎస్ రాకపోవడానికి కారణం ఏమిటో చెప్పకుండా,ప్రశ్నించిన వారిని అణిచి వేయాలని చూడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు.ప్రతిపక్ష నాయకులను నిర్బంధిస్తే కాంగ్రెస్ పార్టీకి పతనం తప్పదని హెచ్చరించారు.అక్రమంగా అరెస్టు చేసిన వెంకటయ్యను బేషరుతుగా విడుదల చేయాలని లేనిచో ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మండల కృష్ణయ్య, కొండల్, కృష్ణ, పురుషోత్తం, మహేందర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలు ఆపుండ్రి..!!

ఇకనైనా అధికారుల్లో కదలిక వచ్చేనా...

- రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం
- ప్రత్యామ్నాయ మార్గాల కోసం నిపుణుల సూచనలను తీసుకోండి
- రోడ్డు ప్రమాదాలకు ఏ అధికారులు బాధ్యత వహిస్తారు



వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 23 (జనం సాక్షి):
అప్పుడు ఇప్పుడు ఎప్పుడు అవే ఇకనైనా రోడ్లు అవే వాహనాలు. అప్పట్లో ప్రమాదాల తక్కువ. ఇప్పుడు ప్రమాదాలు ఎక్కువ. అందుకు బాధ్యులెవరనది ప్రశ్న. తప్పిదం తమ వైపు లేదని అధికారులు అంటుంటే అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని సామాన్య ప్రజలు అంటున్నారు. తప్పొప్పులు ఎవరివైనా అమాయకుల ప్రాణాలు మూత్రం గాలిలో కలిసిపోతున్నారు. జిల్లాలో ఒకరోజు ప్రమాదం జరగలేదనే వార్త వినలేము.. వివరాల్లోకి వెళ్లి వికారాబాద్ జిల్లాలో మధ్యకాలంలో విపరీతంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదం వల్ల కొందరు అవిటి వారైతే మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయి. కానీ అధికారులు ప్రజాప్రతినిధు ల్లో చలనం లేదు. ప్రమాదాల పట్ల ఎవరికి చిత్తశుద్ధి లేదు. ప్రతి ఏడాది కొన్ని ప్రభుత్వ శాఖలు రోడ్డు ఘనంగా భద్రోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ప్రజలు ఎంతవరకు చైతన్య వంతులవుతున్నారో తెలియదు కానీ రోడ్డు మరణాలు మాత్రం ఆగ లేదు. సాయంత్రం అయిందంటే చాలు పోలీస్ శాఖ రోడ్డు పైకి వచ్చి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుంది. ద్విచక్ర వాహనం నుంచి భారీ వాహనాలు నడిపేవారు మద్యం సేవించినట్లు తేలితే కేసులు నమోదు చేసి జరిమానాలు వేస్తున్నారు. అయినా రోడ్డు ప్రమాదాలు ఆగినాయంటే లేదని చెప్పవచ్చు. జిల్లాలో ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణ నష్టం వాటిల్లుతుంది. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తే వాహనదారులు తాగి వాహనం నడపొద్దు. ప్రమాదాలు తగ్గుముఖం పట్టాలి . కానీ అలా జరగడం లేదు. అందుకు కారణాలు వేరు ఉన్నారు. తాగుడు మాట అటుంచిన రోడ్లు భవనాల శాఖ ఆర్ టి ఏ పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. రోడ్లు భవనాల శాఖ అధికారులు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు గడ్డి తొలగించకపోవడం. ప్రమాదం పొంచి ఉన్నచోట సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకోకపోవడం. వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్డు పక్కన గ్రామాల పేర్లు లేకపోవడం వల్ల అత్యవసరంగా బ్రేక్ వేయడం లేదా ప్రమాదాన్ని గుర్తించకుండా వాహనాలు నడపడం వల్ల తరచు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. అంతేకాకుండా ఆర్టిఏ అధికారుల నిర్లక్ష్యం కంటికి కనిపించినట్లు ఉంది. ఆటోలు ద్విచక్ర వాహనాలు ఫోర్ వీలర్ పై మోస్తాదు మించి జనాన్ని గమ్యానికి తరలించే ప్రయత్నంలో భాగంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా ద్విచక్ర వాహనం నుంచి భారీ వాహనాల వరకు సైతం డ్రైవర్లకు లైసెన్స్ లేకపోవడం మైనర్లు వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పవచ్చు. వీటిని నియంత్రించే ఆర్టీఏ అధికారులు నిద్ర మత్తులో ఉన్నారు. జిల్లాలో నెలలో రెండు భారీ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. పదుల సంఖ్య నుంచి పైబడి వ్యక్తులు ప్రమాదంలో గాయ పడి ఆసుపత్రి పాలవుతున్నారు. ఎందరో అవిటి వారుగా మారారు. ఇటీవల బీజాపూర్ హైవే తో పాటు అనంతగిరి హిల్స్‌లో భారీ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అందులో నిరుపేద కుటుంబానికి చెంది న వారే ప్రాణాలు కోల్పోయారు. ఇక పోలీసులు రోజు రోడ్డు పైకి వచ్చిన డ్రంక్ అండ్ డ్రైవ్ మినహా వాహనాల దారుల లైసెన్సులను తనిఖీ చేయడం కళ్ళ ముందు నుంచే మోస్తాదు నుంచి జనాలు వాహనాలలో తరలిస్తున్న చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ అవే రోడ్లు ఉన్నాయి అవే వాహనాలు తిరుగుతున్నాయి అప్పుడు లేనిది ఇప్పుడు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి కానీ అధికారులు గుర్తించలేకపో తున్నారు. ఇక జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సామాన్య వ్యక్తుల నుంచి ప్రజా ప్రతినిధుల వరకు అన్ని పార్టీల నాయకులు స్పందించి గగ్గోలు పెట్టడం తప్ప శాశ్వత పరిష్కార మార్గాలు చూపించిన దాఖలాలు లేవు. ప్రమాదం జరిగితే ప్రతిపక్షం ఎక్స్గ్రేషియా కోసం డిమాండ్ చేయడం అధికార పక్షం బాధితులను ఆదుకుంటాం ఎక్స్గ్రేషియా చెల్లిస్తాం అంటూ వాగ్దానాలు ఇవ్వడం మినహా శాశ్వతంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పరిస్థితి ఇలాగే కొనసాగితే జిల్లాలో మరిన్ని కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉంది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

యూఎల్‌సీ భూముల వ్యవహారంపై చర్యలేవీ ?

కాప్రా మాజీ తహసీల్దార్ నిర్ణయంపై విచారణ జరపాలి

కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని గగన్‌కుమార్ ఆవేదన



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 23 (జనంసాక్షి) : కాప్రా మండల పరిధిలోని యూఎల్‌సీ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ కోరారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు స్పష్టమైన స్పందన రాలేదని పేర్కొన్నారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాప్రా మండల పరిధిలోని సర్వే నంబర్లు 329, 336, 337లో ఉన్న 2 ఎకరాల 18 గుంటల యూఎల్‌సీ భూములకు సంబంధించి నాలా కన్వర్షన్ వ్యవహారంపై గగన్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ హయాంలో ఈ భూములకు నాలా కన్వర్షన్ అనుమతులు జారీ చేసిన తీరుపై విచారణ జరిపించాలని కోరారు. ఈ మేరకు 2026 జూన్ 29న ప్రస

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 నవంబర్ 2026

సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



కౌడిపల్లి, నవంబర్ 23 (జనంసాక్షి) : సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు రైతుల భూములకు ఖచ్చితమైన హద్దులు గుర్తించే అవకాశం ఉంటుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం కౌడిపల్లి మండలం సదాశివపల్లి గ్రామంలో భూభారతి పథకంలో భాగంగా చేపడుతున్న భూముల రీ సర్వే పనులను ఏడి ల్యాండ్ సర్వే కిషన్‌తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు 11 నాన్-కెడాస్ట్రల్ (సర్వే మ్యాప్‌లు లేని) గ్రామాలు, 13 కెడాస్ట్రల్ (సర్వే మ్యాప్‌లు ఉన్న) గ్రామాలు కలిపి మొత్తం 24 గ్రామాల్లో 43,556 ఎకరాల విస్తీర్ణంలో భూ సర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. సమగ్ర భూ సర్వే ద్వారా రైతుల భూములకు సంబంధించి ఖచ్చితమైన హద్దులను గుర్తించి, భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా పటిష్టమైన భూ రికార్డులు రూపొందించడం జరుగుతుందని తెలిపారు.గతంలో భూముల కొలతలు, పట్టా రికార్డులు, వాస్తవ సాగులో ఉన్న భూముల విస్తీర్ణం మధ్య వ్యత్యాసాలు ఉండటంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సర్వే నంబర్లలో గందరగోళం, భూముల హద్దుల విషయంలో వివాదాలు, భూ ఆక్రమణలు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపట్టిందన్నారు. ఈ సర్వే ద్వారా వాస్తవ భూముల విస్తీర్ణాన్ని గుర్తించి పారదర్శకమైన డిజిటల్ భూ రికార్డులు, మ్యాపులు రూపొందించడం జరుగుతుందని వివరించారు. సర్వే ప్రక్రియలో భాగంగా రైతులకు జెండాలను అందజేస్తామని, తమ భూముల సర్వే తేదీకి రెండు రోజుల ముందుగానే నాలుగు వైపులా జెండాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో భూములను కొలతలు వేసి ఖచ్చితమైన హద్దులను గుర్తించి డిజిటల్ మ్యాపులను రూపొందిస్తారని తెలిపారు. భూములకు సంబంధించిన కోఆర్డినేట్స్ ఆధారంగా భవిష్యత్తులో ఎప్పుడైనా భూముల హద్దులను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన భూమి విస్తీర్ణం, పట్టాదారుల వివరాలను అనుసంధానం చేసి సమగ్ర మ్యాపులు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో భూముల కొనుగోలు, అమ్మకాలు, వారసత్వ బదిలీలు జరిగినప్పుడు వాటికి అనుగుణంగా మ్యాపుల్లో మార్పులు నమోదు అవుతాయని, తద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. రీ సర్వే ప్రక్రియలో రైతులను భాగస్వాములను చేయాలని, వారి సహకారంతో సర్వే నిర్వహిస్తే పనులు వేగంగా, పారదర్శకంగా పూర్తవుతాయని అధికారులకు సూచించారు. రైతులు కూడా సర్వే బృందాలకు సహకరించి తమ భూములకు సంబంధించిన వివరాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, సర్పంచ్ వీరయ్య, తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ ఎమ్మార్వో జహీర్, మాజీ సర్పంచి నర్సింగ్ రావు, తోపాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దెలబండలో కల్తీకల్లు విక్రయాలు అరికట్టండి

● ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వార్డు సభ్యుడు తిమ్మప్ప



మల్దకల్, నవంబర్ 23 (జనంసాక్షి) : మండల పరిధిలోని మద్దెలబండ గ్రామంలో కల్తీకల్లు విక్రయాలను అరికట్టాలని గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు తిమ్మప్ప సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కలు దుకాణంలో ఒక కడువ (బిందె)తో మూడు డ్రమ్ముల నీళ్లు కలిపి కల్తీ కళ్ళు అమ్మకాలు వలన ప్రజలు అనారోగ్యాలు పాలై అవుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో కల్తీకల్లు విచ్చలవిడిగా అమ్మకాలు సాగుతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. గ్రామంలోని ఈత చెట్లు లేకున్నా కృత్తిమ కల్లు తయారుచేసి అమ్ముతున్నారని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని తిమ్మప్ప కోరారు. అదేవిధంగా వీరలాపురం గ్రామ శివారులోని విద్యుత్ స్తంభాలను పాతడానికి నిరాకరిస్తున్నాడని తూముకుంట గ్రామం చెందిన రాజు ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి గ్రామం జగదీష్ దివ్యాంగుడు సదరం సర్టిఫికెట్లు పర్సంటేజీ శాతం ఉన్నప్పటికీ వికలాంగుల పింఛను రాలేదని బాధితుడు ఫిర్యాదు చేశారు.

వీధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



కృష్ణ, నవంబర్ 23 (జనం సాక్షి) : వీధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. ప్రజల ఫిర్యాదులు పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తాసిల్దార్ శ్రీనివాస్ ను ఆదేశించారు. సోమవారం కృష్ణ మండల తాసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పలు రికార్డులు, పరిశీలించారు. అలాగే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డ్ గదిని తనిఖీ చేసిన కలెక్టర్ కంప్యూటర్ గదిని తనకి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెరిఫికేషన్ ఎవరు చేస్తారని సెక్షన్ వారిని అడిగి తెలుసుకున్నారు.తహసీల్దార్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్లో ఉంచకుండా ఎప్పటిక ప్పుడు పరిష్కరించాలని తాసిల్దార్ ను ఆదేశించారు.

భూముల రీ-సర్వేతో రైతులకు శాశ్వత పరిష్కారం



మక్తల్, నవంబర్ 23 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే వల్ల రైతులకు సరైన న్యాయం జరగడమే కాకుండా, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక పేర్కొన్నారు. సోమవారం మక్తల్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 80 ఏళ్ల క్రితం నిర్వహించిన సర్వే రికార్డుల వల్ల రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రస్తుత ఆధునిక రీ-సర్వే ద్వారా ప్రతి రైతుకు కచ్చితమైన డిజిటల్ మ్యాప్‌తో కూడిన సర్వే నంబర్లు అందుబాటులోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు. రైతులకు ముందస్తు నోటీసులు జారీ చేసి, వారి పాస్‌బుక్ రికార్డుల ప్రకారమే అత్యంత పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్నామని, దీనివల్ల రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదని భరోసా ఇచ్చారు. గ్రామంలో ఇప్పటివరకు 120 మంది రైతులకు చెందిన 450 ఎకరాల భూమి రీ-సర్వే పూర్తయిందని తహసీల్దార్ (ఎమ్మార్వో) కలెక్టర్‌కు వివరించారు. ఎకరా కంటే తక్కువ భూమి ఉన్న రైతుల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ముసలాయిపల్లెలో సర్వే ఇప్పటికే పూర్తయిందని, ఎప్పటికప్పుడు సర్వే వివరాలను ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత తహసీల్దార్ స్థాయిలో పూర్తిస్థాయి వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. సర్వే పట్ల స్థానిక రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. తనకున్న 8 ఎకరాల భూమిని అధికారులు కొలతలు వేయగా, పాస్‌బుక్ రికార్డుల ప్రకారం కచ్చితంగా సరిపోయిందని ఓ రైతు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సర్వే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని రైతులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలికలకు సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన



కొల్చారం, నవంబర్ 23 (జనం సాక్షి) : కొల్చారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మెదక్ రూరల్ సర్కిల్ సిఐ కృష్ణమూర్తి సోమవారం సందర్శించి విద్యార్థులకు పలు సామాజిక, భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలు, సోషల్ మీడియా వినియోగం, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై వివరించి విద్యార్థిను లకు దిశా నిర్దేశం చేశారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, ఓటిపి మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం గురించి వివరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు దెబ్బతింటుందని, విద్యార్థినులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగము ప్రాముఖ్యతను వివరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, తెలియని లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నత చదువులు చదివి తమ లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. చదువుపై ఏకాగ్రత పెంచుకొని ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థినులు చదువులో లేదా వ్యక్తిగత జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్చారం పోలీస్ స్టేషన్ ఎస్ఐ మొహమ్మద్ మొయినుద్దీన్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పల్లెల సమగ్ర అభివృద్ధి

● ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
● కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం రాఘవేందర్ రెడ్డి
● గాధిర్యాల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



మహమ్మదాబాద్, నవంబర్ 23 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని,ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాఘవేందర్ రెడ్డి అన్నారు.సోమవారం మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు సర్పంచ్ మాణిక్యమ్మతో కలిసి ఆయన భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారుల ఇళ్లకు భూమి పూజచేశారు..ఈసందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు.మొదటి విడతలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయగా,రెండో విడతలోనూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి,పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి,ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్ రెడ్డి, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇరువింటి వెంకటయ్య,ఉపాధ్యక్షుడు తలారి రాములు,ఎన్.గోపాల్,కొత్తపేట శ్రీనివాసులు,శాంతిమతి,హన్మంత్ జి.రవి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐజీ ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ..

● రూ.14 లక్షలతో ఆధునిక వసతుల కల్పన..
● సేల్స్‌ఫోర్స్, నిర్మాణ్ సంస్థల సహకారం



రామచంద్రాపురం, నవంబర్ 23 (జనం సాక్షి) : భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధునిక వసతులతో రూపుదిద్దుకుంది. సేల్స్‌ఫోర్స్, నిర్మాణ్ సంస్థల సహకారంతో సుమారు రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.
పాఠశాలలో పైకప్పు లీకేజీల మరమ్మతులు, ఫ్లోరింగ్, విద్యుత్, ప్లంబింగ్ పనులతో పాటు పెయింటింగ్, మరుగుదొడ్ల ఆధునీకరణ, విద్యుత్ పరికరాల ఏర్పాటు తదితర పనులు చేపట్టారు. విద్యార్థుల సౌకర్యార్థం త్వరలో భోజన షెడ్‌ను కూడా నిర్మిస్తామని సేల్స్‌ఫోర్స్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సహకరించిన సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సేల్స్‌ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్ సుదీప్ కంచెర్ల, సీనియర్ డైరెక్టర్ అభినేష్ బద్దం, ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న తటికొండ, సీనియర్ మేనేజర్ పాండురంగారావు రల్లపల్లి, రామచంద్రపురం ఎంఈఓ భాస్కర్, కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, డైరెక్టర్ శామ్యూల్, మాజీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, మహిళా మండలి అధ్యక్షురాలు వనజ, స్థానికులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల చిరకాల స్వప్నం సాకారం..

● మళ్లీ ఆర్టీసీ బస్సు పరుగులు
● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లికి బస్సు సౌకర్యం పునరుద్ధరణ



వనపర్తి బ్యూరో, నవంబర్ 22 (జనం సాక్షి) : మూడు గ్రామాల ప్రజల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. కరోనా సమయంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో తిరిగి పునరుద్ధరించారు. దీంతో మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాలకు మళ్లీ ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కరోనా మహమ్మారి సమయంలో నిలిచిపోయిన బస్సు సర్వీసుల పునరుద్ధరణ కోసం ఆయా గ్రామాల ప్రజలు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ప్రత్యేకంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసు పునఃప్రారంభానికి కృషి చేశారు. బస్సు సౌకర్యం తిరిగి అందుబాటులోకి రావడంతో మూడు గ్రామాల ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. నిత్యావసర పనులు, ఇతర అవసరాల కోసం పట్టణాలకు వెళ్లే వారికి ఈ బస్సు సౌకర్యం ఎంతగానో ఉపయోగపడనుంది. గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను గుర్తించి, వారి రవాణా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ బస్సు సర్వీసును పునరుద్ధరించేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి



మెదక్ బ్యూరో, నవంబర్ 23 (జనం సాక్షి) : ప్రజావాణిలో వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించారు. ఆయా సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా, విచారణ పురోగతిని బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరిస్తూ, పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చొరవతో మంత్రుల దృష్టికి చిరకాల డిమాండ్
● భద్రాద్రిలో వాల్మీకి ఆలయ నిర్మాణానికి మంత్రి పొంగులేటికి వినతి



గద్వాల, నవంబర్ 23 (జనం సాక్షి) : వాల్మీకి బోయ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో మహర్షి వాల్మీకి ఆలయ నిర్మాణం చేపట్టాలని వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం నాయకులు బి. వెంకటరమణ, రమేశ్ నాయుడు, రాములుతో కలిసి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, ముఖ్యంగా గద్వాల జిల్లా ప్రాంతంలో వాల్మీకి బోయ సామాజిక వర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బలంగా డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి నిరంతర చొరవ, మద్దతుతోనే నేడు ఈ చిరకాల డిమాండ్‌ను నేరుగా రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న తమ వర్గానికి ఎస్టీ రిజర్వేషన్ కల్పించడం ద్వారానే సంపూర్ణ న్యాయం జరుగుతుందని నాయకులు మంత్రికి వివరించారు. ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా స్పందించి, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, భద్రాద్రి ఆలయ ప్రాంగణంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.



రామప్పలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు

- విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- వారసత్వ సంపదను కాపాడుకోవాలని పిలుపు

వెంకటాపూర్, నవంబర్ 23 (జనం సాక్షి) : భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయ ప్రాంగణంలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటాపూర్ డిప్యూటీ తహసీల్దార్ ఎ. భవానీ ప్రసాద్, సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ అజిత్, అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్ డాక్టర్ సాయి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండే చరిత్ర మరియు వారసత్వ కట్టడాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడం మన తెలంగాణ గర్వకారణమని, దానిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని వారు స్పష్టం చేశారు. వారోత్సవాల్లో భాగంగా పాలంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం (డ్రాయింగ్) పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. రామప్ప ఆలయ శిల్పకళ, గోపురం, నంది, చారిత్రక కట్టడాలను అద్భుతంగా ఆవిష్కరించారు.ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. చిత్రలేఖనం పోటీ విజేతలుగా నిలిచిన వారిలో ప్రథమ బహుమతి బి. అవినాష్ (10వ తరగతి) గెలుచుకోగా, ద్వితీయ బహుమతి డి. వర్షిత (10వ తరగతి),తృతీయ బహుమతి డి. వరుణ్ కుమార్ (8వ తరగతి) గెలుచుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పురావస్తు శాఖ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు కఠినంగా అమలు చేయాలి


- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 23 (జనంసాక్షి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ గల కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి రహదారులపై ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, వాహనాల తనిఖీలు, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై వాహనాలు నిలిపే విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని, వాహనాలు బ్రేక్‌డౌన్ అయినా, డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవాల్సిన జాతీయ రహదారులపై ఎక్కడపడితే అక్కడ నిలపకుండా నిర్దేశించిన ట్రక్ లే-బే ప్రాంతాలలో మాత్రమే నిలపాలని సూచించారు. ఈ విషయంలో జాతీయ రహదారుల అధికారులు, ఆర్ & బి అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా రహదారి భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి., డి.టి.ఓ. ద్వారా నామినేట్ చేయబడిన ఎంవిఐ, ఆర్ & బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎన్‌హెచ్ఎఐ డిప్యూటీ మేనేజర్, సంబంధిత రహదారుల అధికారులు, హైదరాబాద్-కరీంనగర్-రామగుండం రహదారి, ఎన్‌హెచ్-363, ఎన్‌హెచ్-63, ఎస్‌హెచ్-24 ప్రతినిధులు సభ్యులుగా ఉండాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించాలని తెలిపారు. బెల్లంపల్లి కాల్ టెక్స్, కన్నాల ఫ్లైఓవర్ల వద్ద వేగంగా దిగి వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు మార్కింగులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మధుర జంక్షన్ వద్ద ప్రస్తుతం ఉన్న టీ జంక్షన్ స్థానంలో వై జంక్షన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూచన మేరకు ఎన్‌హెచ్-63, ఎన్‌హెచ్-363 ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ వద్ద అకస్మాత్తుగా వచ్చే మలుపుల గురించి వాహనదారులకు ముందస్తుగా తెలిసేలా తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. లక్షెట్టిపేట బస్టాండ్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, చింతపల్లి వద్ద బతుకమ్మవాగు ప్రాంతంలో రహదారికి ఇరువైపులా సరైన షోల్డర్లు నిర్మించాలని సూచించారు. మంచిర్యాల పట్టణ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు ట్రాఫిక్ అధికారులు స్పీడ్ గన్స్, బ్రీత్ అనలైజర్లతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. మంచిర్యాల పట్టణ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద అవసరమైన రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జైపూర్ మండల పరిధిలో కొత్తగా నిర్మించిన జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్ల వద్ద చెల్లుబాటు అయ్యే బీమా, వాహన పత్రాలను పరిశీలించాలని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టి మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 8 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, 152 మందిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి మొక్కల సాగుకు సంబంధించి 20 లైవ్ ప్లాంట్ కేసులు నమోదు కాగా, 156 మంది అనుమానితుల జాబితాను సిద్ధం చేశామని తెలిపారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మంచిర్యాల జిల్లా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు.

రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

- నిరుద్యోగ యువతను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీలను భర్తీ చేయాలి
- ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి పదవులను అనుభవిస్తున్న కాంగ్రెస్ నాయకులకు నిరుద్యోగ యువత సమస్యలు మాత్రం పట్టడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి నిరుద్యోగ యువత సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం నిరుద్యోగ యువతను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న యువతకు ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంతకుముందు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రామస్వామి నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డితో కలిసి భూపాలపల్లిలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. అనంతరం సింగరేణి జీఎం కార్యాలయాన్ని సందర్శించి పట్టభద్రులను కలిసి తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సింగరేణి ఆసుపత్రిని కూడా సందర్శించి రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ప్రొబేషనరీ డీఎస్పీలకు పోలీస్ విధులపై దిశానిర్దేశం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (జనం సాక్షి) : ఇటీవల డీఎస్పీల నియామకాల్లో ఎంపికైన వారిలో ఐదుగురు ప్రొబేషనరీ డీఎస్పీలు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 24 వారాల పాటు నిర్వహించనున్న ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ ప్రొబేషనరీ డీఎస్పీలతో మాట్లాడి, శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా వినియోగిం చుకుంటూ పోలీస్ శాఖ పనితీరుపై సమగ్ర అవగాహన పెంపొందిం చుకోవాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ల నిర్వహణ, నేరాల దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీస్ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో నేర్చుకోవాలని దిశానిర్దేశం చేశారు.పోలీస్ అధికారి విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ, పారదర్శకత అత్యంత ముఖ్యమని, చట్ట పరిధిలో పనిచేస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని సత్వర పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా కల్పించే విధంగా ప్రతి అధికారి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలను భవిష్యత్తులో విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని సీపీ సూచించారు.సీపీని కలిసిన ప్రొబేషనరీ డీఎస్పీలలో ధారావత్ సఖిత, పల్లేటి సాయి ప్రత్యూష్ రెడ్డి, బుషిరెడ్డి శంతన్ కుమార్ రెడ్డి, రావిరాల యశశ్వినీ, జేరిపోతుల ఆంజనేయులు ఉన్నారు.



చిన్న వయసులోనే ఇందిరమ్మ ఇల్లు

- విచారణ జరపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

కాళేశ్వరం, నవంబర్ 23 (జనంసాక్షి) : చిన్న వయసులోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన పూతల సదవలి దీనికి సంబంధించి సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేశారు. 2005లో తన పేరు మీద ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు, రూ.11 వేల నగదు తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో ఈ విషయంపై విచారణ జరిపించాలని కోరారు. చిన్న వయసులో ఉన్న సమయంలో తనకు తెలియకుండానే తన పేరు మీద ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు నమోదు చేసి డబ్బులు వసూలు చేసిన వారిని గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు సదవలి తెలిపారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు

నెక్కొండ విద్యార్థిని బోళ్ల సాత్విక ఎంపిక



నెక్కొండ, నవంబర్ 22 (జనం సాక్షి): నెక్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని బోళ్ల సాత్విక ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మైన్పూరిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ క్రీడా పోటీలకు ఎంపిక కావడం నెక్కొండ మండలానికి గర్వకారణంగా నిలిచింది. స్వగ్రామం అప్పలరావుపేటకు చెందిన సాత్విక, తండ్రి బోళ్ల మస్తాన్, కుటుంబానికి చెందిన ఈ ప్రతిభావంతురాలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్, విద్యార్థిని సాత్వికను అభినందించి, ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేశారు. ఈ సందర్భంగా గటిక అజయ్ కుమార్, మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం మరియు అవకాశాలు కల్పిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని అన్నారు. సాత్విక ఈ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించి, నెక్కొండ ప్రాంతానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని సాత్వికను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దిన పీఈటీ కమల కుమారి మేడం, పాఠశాల ప్రిన్సిపాల్ మమత మరియు బోధన, బోధనేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలతో పాటు విద్య, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పోషక విలువలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ప్రశంసించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో కీలకమని, క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ మరియు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షులు సారంగపాణి, మాజీ సర్పంచ్ బొల్లెబోయిన వీరస్వామి, స్వేరోస్ మండల అధ్యక్షులు బొల్లపెల్లి శ్రావణ్ కుమార్ , అభి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత చెల్లెలిపై కట్టెతో దాడి చేసిన కేసులో

నిందితుడికి జైలు శిక్ష

సోనాల నవంబర్ 23 (జనంసాక్షి) : బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సొంత చెల్లెలిపై కట్టెతో దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడికి ఒక నెల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ బోథ్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం గౌరవ న్యాయమూర్తి కుంభ సందీప్ సోమవారం (23.11.2026) తుది తీర్పు వెలువరించారు.కేసు వివరాలలోకి వెళితే బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోనాల గ్రామానికి చెందిన తుల దేవేందర్ (45), తన పుస్తకాలు ఎక్కడ పెట్టావని సొంత చెల్లెలిని ప్రశ్నించగా, ఆమె ఇచ్చిన సమాధానంతో ఆగ్రహానికి గురై అసభ్య పదజాలంతో దూషిస్తూ కట్టెతో ఆమె తలపై బలంగా కొట్టి గాయపరిచాడు.ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి బోథ్ ఎస్ఐ కె. రవీందర్ క్రైమ్ నంబర్ 31/2023 U/Sec. 324, 294 (b) IPC కింద కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు.ఈ కేసు విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సిహెచ్. సతీష్ సాక్షులను ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించడంతో, సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారించి ఒక నెల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి కె. రవీందర్, ప్రస్తుత బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం, ఏపీపీ సిహెచ్. సతీష్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ సాంబాజీలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ అభినందించారు.

అనారోగ్యంతో తల్లి వద్ద ఉంటున్న

ఆడబిడ్డపై రాయితో దాడి

- తీవ్రంగా గాయపరిచిన కోడలు
- నిందితురాలికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

మొగుళ్లపల్లి, నవంబర్ 23 (జనం సాక్షి) : మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో అనారోగ్యంతో బాధపడుతూ తల్లి వద్ద నివసిస్తున్న ఆడబిడ్డపై రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో నిందితురాలిని మొగుళ్లపల్లి పోలీసులు అరెస్టు చేసి గౌరవ భూపాలపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం నిందితురాలికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

వివరాల్లోకి వెళితే.. రంగాపూర్ గ్రామానికి చెందిన గుడెపు కవిత అనారోగ్యంతో బాధపడుతుండటంతో పాటు సంతానం లేకపోవడంతో గత మూడు సంవత్సరాలుగా తన తల్లి పసర్లొండ రాజేశ్వరి ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఆమె మరదలు పసర్లొండ హేమలత, నీవు ఇంకా ఎన్నాళ్లు మీ తల్లి ఇంట్లో ఉంటావు, నీ భర్త వద్దకు ఎందుకు వెళ్లడం లేదంటూ దుర్భాషలాడుతూ గొడవకు దిగి, రాయితో ముఖంపై దాడి చేసింది. ఈ దాడిలో కవిత చెంపకు తీవ్ర గాయమవడంతో పాటు దవడ ఎముక విరిగింది. నిందితురాలు తన వృద్ధాప్యంలో ఉన్న అత్తమామల పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించకుండా, వారిని సరిగా చూసుకోకుండా కుటుంబంలో తరచూ వివాదాలకు కారణమవుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొనబడింది.

దర్యాప్తులో భాగంగా నిందితురాలు పసర్లొండ హేమలతను 23.11.2026 ఉదయం పోలీసులు అరెస్టు చేసి, గౌరవ భూపాలపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఈ సందర్భంగా మొగుళ్లపల్లి ఎస్సై ఎం. సురేష్ మాట్లాడుతూ..

తల్లిదండ్రులు, అత్తమామలు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారిని ప్రేమతో, బాధ్యతతో చూసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను, అత్తమామలను నిర్లక్ష్యం చేయడం, వేధించడం, వారిపై దాడులకు పాల్పడటం చట్టరీత్యా సహించరాని చర్యలని పేర్కొన్నారు.

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

- 26న జిల్లా కేంద్రాల్లో నిరసనలు
- ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్



వరంగల్ ఈస్ట్, నవంబర్ 23 (జనంసాక్షి) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాల వల్ల దేశీయ వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్, అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26న జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో రైతు సంఘాల జిల్లా బాధ్యుల సమావేశం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలు పండించి సమాజ మనుగడకు అవసరమైన ఆహార ఉత్పత్తులను అందిస్తున్న రైతులను కేంద్ర ప్రభుత్వ విధానాలు ఆత్మహత్యల వైపు నెట్టివేస్తున్నాయని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడి పంటల దిగుబడులు తగ్గిపోయాయని, పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం నామమాత్రంగా కొన్ని కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నందున తక్షణమే తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించి, రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ, కొత్త పథకాన్ని తీసుకురావడం, పాత కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం ద్వారా కూలీలు, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు రైతు సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రైతులు, కార్మికులు, కూలీలు, ప్రజాస్వామికవాదులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.అనంతరం నవంబర్ 26న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్లు చుక్క మొగిలి (ఏఐకేఎస్), సుధమల్ల భాస్కర్ (ఏఐకేఎస్ఎస్), జిల్లా నాయకులు ఊరటి హంసల్ రెడ్డి (తెలంగాణ రైతు సంఘం), మైదం పాణి (ఏఐయూకేఎస్), ఐతమ్ నాగేష్ (ఏఐకేఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 నవంబర్ 2026

అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలి

● ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫైర్

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 23 (జనం సాక్షి) : రాష్ట్రంలోని అర్హులైన ప్రతీ ఒక్క జర్నలిస్టుకూ ఇంటి స్థలం దక్కేవరకూ బీఆర్ఎస్ అండగా ఉంటుందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఖమ్మంలో గతంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం కేటాయించిన 23.2 ఎకరాల భూమిని వెంటనే జర్నలిస్టులకు పంపిణీ చేయాలనీ, లేకపోతే తాము జర్నలిస్టుల ఉద్యమంలో కలిసి పోరాడుతామని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ రాజ్యసభ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులుండి కూడా వెయ్యి మంది ఉన్న జర్నలిస్టులకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ఇండ్ల స్థలాలను పంపిణీ చేయడంలో తాత్సారం చేయడం సరికాదన్నారు. ఖమ్మం జిల్లాలో అర్హులైన ప్రతీ జర్నలిస్టుకూ గత ప్రభుత్వం కేటాయించిన భూమిని పంపిణీ చేయాలంటూ టీయూ డబ్ల్యూజే(టీజేఎఫ్) సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వయంగా వచ్చి మద్దతు తెలిపిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ...అమరవీరుల స్తూపం సాక్షిగా ఆందోళన చేస్తున్న టీయూ డబ్ల్యూజే(టీజేఎఫ్) ఉద్యమం పూర్తిగా చట్టబద్ధమైంది,



న్యాయమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేండ్లు అవుతున్నా జర్నలిస్టులకు ఇస్తానన్న భూమిని ఇవ్వకుండా మోసం చేయడం ఎంతవరకు న్యాయమో ముగ్గురు మంత్రులు గుర్తించాలన్నారు. 2023 జనవరి 19న ఖమ్మం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలకు సంబంధించిన జీఓ తీసుకురావడంలో నాడు మంత్రి కేటీఆర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి జీఓ రద్దుకాకుండా చేశామని ఎంపీ గుర్తుచేశారు. ఆ జీఓ ఫలితంగానే స్థల సేకరణ పూర్తయిందన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలి

420 హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ చివరికి జర్నలిస్టులకు ఇస్తానన్న ఇండ్ల స్థలం పంపిణీ చేయడంలో జర్నలిస్టులను కూడా మోసం చేసిందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1800మంది జర్నలిస్టులు ఉన్నారనీ, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 44వేల మంది జర్నలిస్టులున్నారనీ వారందరికీ ఒకొక్కరికి 150 గజాల స్థలం ఇచ్చినా మొత్తం కలిపి 1375 ఎకరాలు కేటాయించి పంపిణీ చేస్తే సరిపోతుందన్నారు. అదికూడా దశలవారీగా ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం కేటాయిస్తే వారికి న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టులకు 2023 జనవరి 19న జీఓ నెంబర్ 147 ద్వారా కేటాయించిన భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పంపిణీ చేయడంలేదో సమాధానం చెప్పాలని ఎంపీ వద్దిరాజు ప్రశ్నించారు. బీఆరఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా జర్నలిస్టులకు ఇండ్ల స్థలం దక్కేవరకూ పోరాడుతానని అన్నారు. టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి మాట్లాడుతూ..జర్నలిస్టులకు కేటాయించిన భూమిని ఇకనైనా ప్రభుత్వం స్పందించి పంపిణీ చేయాలని జర్నలిస్టులకు అండగా నిలవాలని కోరారు. ఇండ్ల స్థలాలు దక్కేవరకూ దశలవారీ పోరాటాలు కొనసాగుతాయని వారు అన్నారు.

శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం రెన్యువేషన్ కమిటీ చైర్మన్ ఏకగ్రీవం



మైళ్ళచెరువు, నవంబర్ 23 (జనం సాక్షి) : మేళ్లచెరువు మండల కేంద్రంలోని కార్తీక మాస పవిత్ర సోమవారం రోజున శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభూ శంభు లింగేశ్వర స్వామినీ కోదాడ శాసనసభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి దర్శించి ప్రత్యేక అభిషేకాలు చేశారు ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రాం రెడ్డి స్వామివారిని దర్శించుకుని వాయు లింగాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం రెన్యువేషన్ కమిటీ చైర్మన్‌గా కందుల సురేష్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కమిటీ నియామక కార్యక్రమంలో ఆయన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కోదాడ శాసనసభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌కు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మేళ్లచెరువు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొట్టే సైదేశ్వరరావు, ఇతర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, ఆలయ ఈవో, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించాలి



సూర్యాపేట, నవంబర్ 23 (జనంసాక్షి) : ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఏఐసీసీ సభ్యులు, ఉమ్మడి నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు స్వామి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంకల్ప ర్యాలీ నిర్వహించారు.అనంతరం పబ్లిక్ క్లబ్‌లో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలో భారీగా గ్రాడ్యుయేట్స్ ఓటరుగా నమోదు చేసుకున్నారని అన్నారు.వేల మంది అర్హులైన పట్టభద్రులను ఓటరు జాబితాలో చేర్పించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజాద్ అలీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, బైరు వెంకన్న గౌడ్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, సునీల్ రెడ్డి, తన్వీర్ హుస్సేన్, కొణతం రాజేష్ రెడ్డి, కోడి నాగరాజు, ఆలేటి మాణిక్యం, గుణగంటి సతీష్, సిద్దిక్, రాజబోయిన శ్రీకాంత్, బైరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరిగేలా నాణ్యమైన బోధన అందించాలి

● ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన

బూర్గంపహాడ్, నవంబర్ 23 (జనంసాక్షి) : విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు ఆలోచనా శక్తి, విశ్లేషణ సామర్థ్యం పెంపొందించేలా ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన స్థాయిని, ఉపాధ్యాయుల బోధనా విధానాలను స్వయంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు సంధించారు. పదో తరగతి సాంఘిక శాస్త్రంలో ప్రపంచీకరణ, సరళీకరణ, బహుళజాతి సంస్థలు, ఆహార భద్రత వంటి అంశాలపై విద్యార్థుల అవగాహనను పరీక్షించారు. ఆంగ్లంలో నిర్వచనాలు చెప్పడంతో పాటు వాటి అర్థాలను తెలుగులో వివరించాలని సూచించారు.



పాఠ్యాంశాలను కేవలం కంఠస్థం చేయకుండా నిత్యజీవితంలో ఎదురయ్యే పరిస్థితులతో అన్వయించుకొని అర్థం చేసుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. ఉపాధ్యాయులు మైండ్ మ్యాపింగ్ విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తూ, కీలక అంశాలను విద్యార్థులతో గుర్తించి నోట్స్ రాయిస్తున్న తీరును పరిశీలించారు. ఆంగ్ల మాధ్యమంలో ఉన్న ప్రశ్నలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా అవసరమైన చోట తెలుగులోనూ వివరించాలని, ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన కల్పించేలా బోధన సాగించాలని సూచించారు. సాంఘిక శాస్త్రంలోని రాంపూర్ గ్రామ ఆర్థిక వ్యవస్థ పాఠ్యాంశంపై విద్యార్థులను ప్రశ్నిస్తూ వ్యవసాయం, వ్యవసాయేతర కార్యకలాపాలు, పంటలు, తలసరి ఆదాయం, విద్య, రవాణా తదితర అంశాలపై వారి పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఉన్న రాంపూర్ గ్రామ వ్యవసాయ విధానాలను బూర్గంపాడు ప్రాంతంలోని వరి, మిరప, పత్తి, పామాయిల్ సాగుతో పోల్చి వివరించారు. స్థానిక గ్రామాల్లో ఉన్న వనరులు, ఉపాధి అవకాశాలను గుర్తించి వాటి వినియోగంపై విద్యార్థులతో క్షేత్రస్థాయి అధ్యయనాలు, అసైన్‌మెంట్లు చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తద్వారా గ్రామాభివృద్ధిపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో బూర్గంపాడు డిప్యూటీ తహసీల్దార్ ధనియాల శ్రీనివాస్, మండల విద్యాధికారి ఏదు సింహరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరకొండలో వీధి కుక్కల స్వైరవిహారం

● మున్సిపల్ అధికారులకు కనిపించని సమస్య
● గుంపులు గుంపులుగా కుక్కల సంచారం
● విద్యార్థులు, ప్రజల ప్రాణాలకు ముప్పు..
● ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

దేవరకొండ, నవంబర్ 23 (జనం సాక్షి) : దేవరకొండ మున్సిపాలిటీలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని హనుమాన్ నగర్, గాంధీ బజార్, శాలిబండ ప్రాంతాలలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కల కారణంగా పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కుక్కల గుంపులను చూసి భయపడుతున్నారు. తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలంటేనే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందోనన్న భయం స్థానికులను వెంటాడుతోంది.
ప్రజల భద్రతకు సంబంధించిన ఇంత తీవ్రమైన సమస్య మున్సిపల్ అధికారులకు కనిపించడం లేదా? కుక్కలు దాడి చేసి ఎవరైనా గాయపడిన తర్వాతే అధికారులు మేల్కొంటారా? ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే వరకు వేచి చూడటమేనా అధికారుల బాధ్యత? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
వీధి కుక్కల నియంత్రణపై కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం వీధి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా విద్యార్థులు,



మహిళలు, వృద్ధులు భయంలేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం



దేవరకొండ పట్టణంలో వీధి కుక్కల బెడదపై ప్రజల నుంచి వస్తున్న ఆందోళనల నేపథ్యంలో మున్సిపల్ అధికారులను వివరణ కోరగా, సమస్య ఉన్న మాట వాస్తవమేనని వారు అంగీకరించారు.గతంలో పట్టణంలోనే సుమారు 1000 నుంచి 1,200 వరకు వీధి కుక్కలు ఉండేవని, వాటిలో సగం కుక్కలను పట్టుకుని తీసుకెళ్లి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు (ఆపరేషన్), చికిత్సలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.మిగిలిన కుక్కల నియంత్రణ కోసం మరో వారం రోజుల్లో ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి, పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టుకుని అవసరమైన చికిత్సలు, వ్యాక్సినేషన్ చేపడతామని వెల్లడించారు.పట్టణ ప్రజల భద్రతకు మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రజల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రామదుర్గా రెడ్డి, మున్సిపల్ కమిషనర్

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

● 11 మంది అరెస్ట్ నగదు స్వాధీనం

మర్పల్లి, నవంబర్ 23 (జనంసాక్షి) : వికారాబాద్ జిల్లా మర్పల్లి శివారు లోని మర్రి చెన్నారెడ్డి వ్యవసాయ పొలంలో పేకాట స్థావరంపై మర్పల్లి పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది తో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేశారు. ప్రభుత్వంచే నిషేధించబడిన పేకాట ఆడుతున్న 11 మంది పోలీసులను చూసి వారు పారిపోతుంటే పట్టుకొని అరెస్టు చేసి వారి వద్ద నుండి 37,940/- వేల రూపాయలు, 11 సెల్ ఫోన్లు 208 పేకాట ముక్కలు 1 బైకును స్వాధీనం చేసుకోమన్నామని మర్పల్లి ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను పాడుపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుమతులు లేని నైన్ ఎడ్యుకేషన్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



బోడుప్పల్, నవంబర్ 23 (జనంసాక్షి) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నైన్ ఎడ్యుకేషన్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.డి. అన్వర్ ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కళాశాలలో సుమారు 300 మంది విద్యార్థులు చదువుతున్నారని, అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవని పేర్కొన్నారు. తక్షణమే విచారణ జరిపి కళాశాలపై చర్యలు తీసుకొని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు.

మోడల్ స్కూళ్లలో నాలుగు అవుట్‌సోర్సింగ్ పోస్టులు

గుండుమాల్, నవంబర్ 23 (జనంసాక్షి) : జిల్లాలోని గుండుమాల్, తెలంగాణ మోడల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న నాలుగు అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం. గోవిందరాజు తెలిపారు. గుండుమాల్ తెలంగాణ మోడల్ స్కూల్, తెలంగాణ మోడల్ స్కూల్‌లలో ఒక్కొక్క ఆర్ట్, యోగా, కంప్యూటర్ టీచర్, లైబ్రేరియన్ పోస్టును భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 21 నుంచి 44 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. టీచర్ పోస్టులకు నెలకు రూ.22,750, లైబ్రేరియన్ పోస్టుకు రూ.19,500 వేతనం చెల్లించనున్నట్లు డీఈఓ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పినపాక అభివృద్ధికి రూ.130 కోట్ల నిధుల కోసం ఎమ్మెల్యే పాయం వినతి



అశ్వాపురం, నవంబర్ 23 (జనంసాక్షి) : పినపాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు సోమవారం హైదరాబాద్‌లో ముగ్గురు రాష్ట్ర మంత్రులను కలిసి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. గ్రామీణ మౌలిక వసతులు, గిరిజన ప్రాంతాల్లో విద్యా సదుపాయాలు, మెరుగైన వైద్య సేవల కల్పనకు ప్రాధాన్యమిస్తూ మొత్తం రూ.130 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సమర్పించారు.పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి రూ.44 కోట్లతో బీటీ రహదారులు, వంతెనలు, కల్వర్టులు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు కోరారు.గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి రూ.86 కోట్లతో గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని 100 పడకల నుంచి 150 పడకలకు పెంచాలని, గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. సారపాకలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు, ఆరోగ్య కేంద్రాల్లో డయాలసిస్ సేవలు, ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గ ప్రజలకు అవసరమైన రహదారులు, విద్య, వైద్య సదుపాయాల అభివృద్ధికి సమర్పించిన ప్రతిపాదనలపై ముగ్గురు మంత్రులు సానుకూలంగా స్పందించి, నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కార్యాలయం వెల్లడించింది.

డిసెంబర్ 11 నుంచి ఖేలో ఇండియా యూత్ గేమ్స్

సూర్యాపేట, నవంబర్ 23 (జనంసాక్షి) : జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ రాష్ట్రం వేదిక కావడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సంబంధించి కెఐవైజి-2026 అధికారిక లోగో, మస్కట్, సెల్ఫీ స్టాండ్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఖేలో ఇండియా పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.తమలోని క్రీడా ప్రతిభను గుర్తించి, కష్టపడి సాధన చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి.హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి డి.ప్రేమ్ రాజ్, జిల్లా యువజన, క్రీడల అధికారి బి.వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈవో శిరీష, డిఐఈఓ సులోచన రాణి, డిఎస్సిడిఓ లత, అధికారులు పాల్గొన్నారు.



సోహం ఇథనాల్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణ అప్రజాస్వామికం

● ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి
● కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఐక్యవేదిక ధర్నా
● జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 23 (జనం సాక్షి) : దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో సోహం ఇథనాల్ పరిశ్రమకు సంబంధించి నవంబర్ 20న నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ అప్రజాస్వామికంగా జరిగిందని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బి.రామయ్య, మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటరమణ ఆరోపించారు.ఈ ప్రజాభిప్రాయ సేకరణను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ విద్యావంతుల వేదిక, మానవ హక్కుల వేదిక, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రజాసంఘాల ఐక్యవేదిక, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వీర్లపాలెం గ్రామ ప్రజలతో కలిసి నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుమారు 5 వేల మంది జనాభా కలిగిన వీర్లపాలెం గ్రామంలో 20 మందిలోపే అభిప్రాయాలు సేకరించడం ప్రజాభిప్రాయ సేకరణ పారదర్శకతను ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. కంపెనీకి అనుకూలంగా ఉన్న కొంతమందిని తీసుకొచ్చి వారి అభిప్రాయాలను మాత్రమే నమోదు చేశారని, స్థానిక షెడ్యూల్డ్ తెగల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఇథనాల్ పరిశ్రమలపై అధ్యయనం చేసిన నిపుణుల అభిప్రాయాలను కూడా పట్టించుకోలేదని విమర్శించారు.ఈ పరిశ్రమ వల్ల క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, కృష్ణా నది జలాలు కలుషితమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతానికి కృష్ణా నది కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. రోజుకు 60 లక్షల లీటర్ల నీటిని కృష్ణా నది నుంచి వినియోగించనున్నారనే అంశం ప్రజల్లో



మరింత భయాందోళనలకు కారణమవుతోందన్నారు. ఈ ధర్నాలో జన విజ్ఞాన వేదిక నాయకులు సుదర్శన్, ధర్మసమాజ్ పార్టీ నాయకులు ఎల్లయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వీర్లపాలెం ప్రాంత ప్రజలు నినాబాద్ సిపాయి, కుంజ రామయ్య, అల్లం నాగరాజు, వినోద్ నాయక్, ఆంగోతు బాలు, రూపావత్ సైదా, రూపావత్ లక్ష్మి, మూడావత్ కిరి, కృపావతు బాజు, ఏడుపాల సౌజన్య, ధనావత్ సైది తదితరులతో పాటు సుమారు వందమంది గ్రామస్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24.11.2026



అర్ధరాత్రి ఆపరేషన్ కవచ్ పాయింట్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

పోలీసుల అప్రమత్తత,

వాహన తనిఖీల తీరును పరిశీలించిన జిల్లా ఎస్పీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):కామారెడ్డి జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు చేపడుతున్న ఆపరేషన్ కవచ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ కవచ్ పాయింట్‌ను సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అప్రమత్తత, తనిఖీల తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి తనిఖీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరస్థులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, వాహనాల తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని, నేరాల నియంత్రణకు పటిష్టమైన తనిఖీలు, నిరంతర నిఘా అవసరమని పేర్కొన్నారు.

చిత్రలేఖనంలో అద్భుత ప్రతిభ..

చిన్నారి కావ్యకు కళలపై మక్కువ..





ఆర్మూర్,నవంబర్ 23 (జనంసాక్షి):చిన్నతనం నుంచే ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే పిల్లలు అన్ని రంగాల్లో రాణించగలరని నిరూపిస్తోంది ఆర్మూర్‌కు చెందిన చిన్నారి సుమళ్ళ కావ్య.ఆర్మూర్ పట్టణంలోని విశాఖ కాలనీకి చెందిన లక్ష్మి,లక్ష్మణ్ యాదవ్ దంపతుల కుమార్తె అయిన కావ్య, నవ్య భారతి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది.చదువుతో పాటు చిత్రలేఖనంపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తూ తనలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీస్తోంది.వివిధ రకాల చిత్రాలను అందంగా గీస్తూ తన కళా నైపుణ్యాన్ని చాటుకుంటోంది.చిన్న వయసులోనే చిత్రలేఖనంపై ఇంతటి ఆసక్తి, పట్టుదల కనబరచడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో చిత్రలేఖన రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.చిన్నారి కావ్యలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

రూరల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూంపల్లి మహేందర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి:సోమవారం నిర్వహించిన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తూంపల్లి మహేందర్ పాల్గొని మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ భీమా పథకం ఎంతో గొప్పదని, మానవతా దృక్పథంతో పేద కుటుంబాల జీవితాలకు భరోసా కల్పించే గొప్ప సంక్షేమ పథకమని కొనియాడారు.ప్రజల సంక్షేమం, పేద కుటుంబాల భద్రతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ప్రజాహిత పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించాలని,ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.యూత్ కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు ప్రజాసేవా కార్యక్రమాలకు నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రూరల్ ఉపాధ్యక్షులు మోతే నవీన్ రెడ్డి,జిల్లా జనరల్ సెక్రటరీ ఆకాశ్ రెడ్డి, డిచ్‌పల్లి మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి,యువజన నాయకులు సాగర్ రెడ్డి, వంశీ నాయక్, లోలం గ్రామ అధ్యక్షులు శ్రీరామ్, సతీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

గోదావరి, కృష్ణా నీరు వృథాగా పోతున్నా ఒడిసిపట్టే ఆలోచన చేయలేదు:ఎల్. రమణ ఎమ్మెల్సీ



జగిత్యాల బ్యూరో (జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తు న్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సం స్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ తీవ్రస్థాయిలో విమర్శించారు. జగిత్యాలలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ప్రభు త్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా మాట్లాడారు.ఎల్‌నినో ప్రభావం, కరువుపై నిర్లక్ష్యం: గత ఆరు నెలలుగా ప్రపంచవ్యాప్తం గా,దేశ వ్యాప్తంగా, తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ఉంటుం దని,ఎల్‌నినో వల్ల కరువు వచ్చే పరిస్థితి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దానికి తగ్గట్టుగా చర్యలు చేపట్టడం,ముందస్తు ప్రణాళికలు తయారు చేయడం, అవసరమైన వనరులను సమకూర్చుకోవడం వంటి వేటిపైనా ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎన్నికల హామీల అమలు కోసం పింఛన్లు పెంచడం వంటి చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. కానీ తెలంగాణలో మాత్రం మూడేళ్లలో ప్రధాన హామీలను అమలు చేయకుండా పాలన సాగిస్తున్నారని విమర్శించారు.విద్యా, నిరుద్యోగ విద్యార్థులకు ఇచ్చిన హామీలు గాలిలో కలిశాయని అన్నారు. నిరుద్యోగ భృతితో సహా ఏ హామీని కూడా అమలు చేయలేదని, అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని పలు సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే మార్గాలపై కనీసం పెట్టుబడి పెట్టే ఆలోచన కూడా చేయడం లేదని, చెప్పిన మాటల అమలులో చిత్తశుద్ధి లోపించిందని విమర్శించారు. ఉద్యమ సమయంలో చేనేత కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యలను దృష్టిలో ఉంచుకుని, గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2014 జీవో ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా వీవర్స్‌కు పింఛన్లు అందించిందని గుర్తు చేశారు. అయితే నేడు పింఛన్లను తొలగించేలా, తగ్గించే ఉద్దేశంతో మెడికల్ సర్టిఫికెట్లు కావాలని కోరడం దారుణమన్నారు. 50 ఏళ్లు, 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్య పింఛన్లు వస్తాయని, కనీస కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జగిత్యాల కలెక్టరేట్ వద్ద వందలాది మంది వీవర్స్ వినతిపత్రం ఇచ్చినా, సమస్యను పరిష్కరించే మాట చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పండించిన పంటలకు కొనుగోలు కేంద్రాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సన్నరకం వడ్లు కొంటే బోనస్ ఇస్తారనే భావనతో ఉన్న రైతులు, ప్రభుత్వ తీరుపై ఆగ్రహంతో ధాన్యం తగలబెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా నీరు వేల టీఎంసీలు వృథాగా పోతున్నా ఒడిసిపట్టే ఆలోచన చేయలేదని విమర్శించారు. ప్రపంచంలోనే అతి తక్కువ సమయంలో పూర్తయిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం అని, మేడిగడ్డ వద్ద సాంకేతిక లోపాన్ని సరిదిద్ది, కాఫర్ డ్యామ్ వంటి వాటితో నీటిని వాడుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. దీనివల్ల తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తాయని తెలిపారు. ప్రభుత్వ మనుగడపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు ప్రభుత్వ వైఫల్యాలపై ఎదురుతిరిగే పరిస్థితి ఉందని అన్నారు. ఇచ్చిన ఐదేళ్ల పాలన పూర్తి చేస్తుందా లేదా అనే అనుమానం కలుగుతోందని, ఎమ్మెల్యేల ఆరోపణలతో ప్రభుత్వం కుదుటపడేలా లేదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీష్, దేవేందర్ నాయక్,పట్టణ అధ్యక్షులు అయిల్నేని వెంకటేశ్వర్ రావు అయిల్నేని సాగర్ రావు, వొళ్ళేం మల్లేశం,మాజీ జడ్పీటీసీ కొలముల రమణ, సాగి సత్యం రావు,తురగ శ్రీధర్ రెడ్డి, అల్లాల ఆనంద్ రావు,పడిగేల గంగారెడ్డి,దయ్యాల మల్లారెడ్డి, వొళ్ళాల గంగాధర్, చేటుపెల్లి సుధాకర్,పులి మల్లేశం గౌడ్, కుడిక్యాల సర్వేశ్వర్, సింహారాజు శ్రీధర్,గంగిపెల్లి వేణుమాధవ్,వెన్నమనేని కృష్ణారావు,సజీల్, గంగిపెల్లి శేఖర్,పెండం గంగాధర్, చెని తిరుపతి నాయకులు

ఇండోర్ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేయాలి

డిచ్‌పల్లిలో రూ.75 లక్షల వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తు కేంద్రం ప్రారంభించిన సిఎండి కే. వరుణ్ రెడ్డి ఐఏఎస్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి:



విద్యుత్ వినియోగదారులకు, ముఖ్యంగా రైతులకు మరింత వేగంగా సేవలందించేందుకు డిచ్‌పల్లి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తు కేంద్రాన్ని సోమవారం టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి . వరుణ్ రెడ్డి ఐఏఎస్ ప్రారంభించారు.నూతనంగా ఏర్పాటైన డిచ్‌పల్లి డివిజన్ పరిధిలోని మోపాల్, డిచ్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ ప్రాంతాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మత్తుల నిమిత్తం దూర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరాన్ని తగ్గించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సీఎండి తెలిపారు. సుమారు రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రంలో ఆధునిక యంత్ర పరికరాలను ఏర్పాటు చేశామని, రైతులకు మరింత సత్వర సేవలు అందించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తు పనులను వేగవంతం చేయడం దీని ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సంస్థ పరిధిలో ఇది మూడవ డిపార్ట్మెంటల్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తు కేంద్రం కాగా, దీనిని అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన మోడల్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం నిజామాబాద్ పట్టణంలోని పులాంగ్ రైతు బజార్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇండోర్ సబ్‌స్టేషన్ పనులను సీఎండి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి, నిర్మాణ పనులను వేగవంతం చేసి డిసెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా నాణ్యత, విశ్వసనీయత పెంపొందించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.డైరెక్టర్ (ఆపరేషన్స్) టి. మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) అశోక్ కుమార్, ఎస్ఈ నిజామాబాద్ పి.వి. రాజేశ్వరరావు, డీఈ ఎంఆర్టీ అండ్ కన్స్ట్రక్షన్ వెంకటరమణ, ఇతర అధికారులు హరిచంద్ర, మహమ్మద్ ముక్తార్, రఘు, ఏడీఈలు కే. నటరాజ్, అశోక్, తోట రాజశేఖర్, సాయి తేజ, ఏఈలు గంగారాం, లక్ష్మణ్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి 131 ఫిర్యాదులు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 23 జనంసాక్షి:
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతో పాటు డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

సదాశివనగర్, నవంబర్ 23 (జనంసాక్షి):
కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లింగంపల్లి గ్రామ సర్పంచ్ బేక్రియాల లావణ్య రమేష్ సూచించారు. సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ పథకం నమోదు ప్రక్రియను ప్రారంభించారు.ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణతో పాటు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కుటుంబంలో ఒక్కరికి జీవిత బీమా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని, రేషన్ కార్డులోని సభ్యుల్లో ఒకరిని బీమా కోసం ఎంపిక చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి రావాలని కోరారు. బీమా లబ్ధిదారుడు నామినీ పేరును కూడా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.ముందుగా తెల్ల రేషన్ కార్డు లేదా బియ్యం కార్డు కలిగిన కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించిన అనంతరం, ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డులు లేని వారికి కూడా అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజలు వృత్తి, వ్యాపార పనుల నిమిత్తం ఎక్కడ ఉన్నప్పటికీ ఈ నెల 28వ తేదీలోపు ఒకరోజు సమయం కేటాయించి బీమా నమోదు చేసుకోవాలని సర్పంచ్ కోరారు. ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగారాం, వార్డు సభ్యులు రమేష్ రావు, శ్రీకాంత్, జ్యోతి, గంగయ్య, సౌమ్య, పద్మ, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సీఏ రవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అంజన్న సేవలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మల్యాల (జనంసాక్షి):తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ఆంజనేయస్వామి నిజరూపాన్ని సోమవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి దర్శించుకున్నాడు. ఆలయ అధికారులు అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు.



ఆల్ ఇండియా కరాటే పోటీల్లో విద్యోదయ విద్యార్థినికి గోల్డ్ మెడల్

జమ్మికుంట (జనంసాక్షి):జగిత్యాల జిల్లా లోని ఏ ఆర్ గార్డెన్ లో ఆదివారం నిర్వహించిన అల్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యోదయ విద్యా సంస్థలలో ఐదవ తరగతి చదువుచున్న జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని ఆవుల సహస్ర గోల్డ్ మెడల్ సాధించారు. ఈ పోటీలలో పలు జిల్లాల, రాష్ట్రాల నుండి 600 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా ఆవుల సహస్ర గోల్డ్ మెడల్ సాధించడం పట్ల విద్యోదయ విద్యాసంస్థల కరెస్పాండంట్ యేబూషి ఆర్యన్ కౌశిక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు,తల్లి దండ్రులు,సీనియర్ కరాటే మాస్టర్ పెద్దపల్లి రాజేందర్, రాష్ట్ర కరాటే ఉపాధ్యక్షులు భూసారపు బాపూరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్యన్ కౌశిక్ మాట్లాడుతూ విద్యతో పాటు ఇతర ఆటపాటలు, క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ అన్ని రంగాలలో రాణించేలా విద్యోదయ విద్యా సంస్థల యాజమాన్యం నిరంతరం ప్రోత్సహిస్తుందని తెలిపారు.విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి వారి ఉజ్వల భవిష్యత్తుకు విద్యాసంస్థ ఎప్పుడూ కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు.






రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు పారమిత విద్యార్థిని ఎంపిక

కరీంనగర్ కల్చరల్, (జనంసాక్షి):
తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 70వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని జి.అతిధి వైశాలి ఎంపికైంది.ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు.ఇటీవల జేఎన్‌టీయూ మంథనిలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికల అండర్-17 విభాగంలో అతిధి వైశాలి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది.ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆమె పాల్గొననుంది.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పాఠశాల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు,డైరెక్టర్లు ప్రసూన,అనూకర్ రావు, రశ్మిత,రాకేశ్,వి.యు.యం. ప్రసాద్,వినోద్ రావు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాల డైరెక్టర్ కె.హన్మంతరావు,ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ,సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో,నాగరాజు,రాము, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు,ఎం.డి.జునైద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

చైర్మెన్ పుండ్ర నారాయణరెడ్డి



కథలాపూర్ (జనంసాక్షి):కథలాపూర్ మండల కేంద్రంలో సిరికొండ గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కథలాపూర్ మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి,వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్ లు ఈరోజు రిబ్బెన కట్ చేసి ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఐ కే పి వారిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని రైతులు పండించిన ఆఖరి ధన్యపు గింజ వరకు కోనేందుంకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదాని, ఇప్పుడు సూపర్ ఎల్ నినో కారణంగా నీటి ఎద్దడి ఏర్పడి వేసవి కాలం తీవ్ర కరువు వాటిల్లే అవకాశం ఉన్నందున వ్యవసాయ అధికారుల సూచనల మేరకు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంతరెడ్డి గారు తెలిపిన విధంగా రైతులు అరుతడి పంటలను వేయాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెలిచలా సత్యనారాయణ జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాయితీ నాగరాజు కథలాపూరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు న్యావనంది శేఖర్, భూషణరావుపేట ఫ్యాక్స్ చైర్మన్ గడ్డం స్వామి రెడ్డి, సిరికొండ ఫ్యాక్స్ చైర్మన్ ఎండి మోబిన్, సర్పంచ్ ముధం రవి, ఏఎంసి డైరెక్టర్స్ వాకిటి రాజారెడ్డి రమేష్ నాయకు లతో పాటు పలువురు రైతులు అధికారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతర సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు



భీమ్గల్ నవంబర్ 23 జనంసాక్షి:జాతర సందర్భంగా భీంగల్ మండలం లో నీ లింబాద్రిగుట్ట పార్కింగ్ స్థలాన్ని పరిశీలించిన సీఐ పొన్నం సత్యనారాయణ ఎస్సై చిరంజీవి అనంతరం సీఐ పొన్నం సత్యనారాయణ మాట్లాడుతూ....సిపి ఆదేశాల మేరకు భీంగల్ నుండి లింబాద్రిగుట్ట వెళ్లే రోడ్డు జాతరకు ఒక రోజు ముందు జాతర రోజున 48 గంటలు వన్వే విధంగా గుట్ట మీదికివెళ్లాలి గుట్ట నుండి వచ్చేవారు పల్లికొండ లింగాపూర్ బెజ్జోర మీదుగా భీంగల్ కి రావాలి భక్తుల రద్దీ మేరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సిఐ పొన్నం సత్యనారాయణ తెలిపారు అనంతరం నంబి పార్థసారథి మాట్లాడుతూ.... జాతర సందర్భంగా పార్కింగ్ స్థలాన్ని రెండు ట్రాక్టర్స్ ఒక జెసిబి తో చెట్ల పొదలను తొలగించి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసినాము పార్కింగ్ స్థలంలోనే వారి వారి వాహనములు నిలుపుకోవాలని గుట్ట పైకి ఎవరి వాహనంలకు అనుమతి లేదని అలాగే విఐపి దర్శనాలు కూడా రద్దు చేశామని భక్తుల రద్దీ మేరకు భక్తులకు ఏ అటంకాలు జరగకుండా ఉండడానికి సిఐ చెప్పినట్లు గుట్టమీదికి వన్వే విధంగా రావాలని వెళ్లేటప్పుడు లింగాపూర్ మీదుగా భీంగల్ వెళ్లాలని భక్తులు అందరూ సహకరించాలని కోరుచున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐ పొన్నం సత్యనారాయణ ఎస్సై చిరంజీవి ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి పాల్గొన్నారు.

రైతుల భూములలో ఫారెస్ట్ అధికారుల జులుం ఏంటి ?

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులచారి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి:ఇందూర్ జిల్లాలోని పలు మండలాల్లో దశాబ్దాల క్రితం ప్రభుత్వమే పేద రైతులకు మంజూరు చేసిన అసైన్డ్ పట్టా భూములపై అటవీ శాఖ అధికారులు అక్రమంగా నోటీసులు జారీ చేస్తూ, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇట్టి భూముల పోయిన అటవీ అధికారుల జులుం ఏంటి అని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులచారి అన్నారు. సోమవారం రైతులతో కలిసి ఇందూర్ జిల్లా కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో బీజేపీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ..1986వ సంవత్సరంలో ప్రభుత్వమే పేద రైతులకు అసైన్డ్ భూములపై అధికారికంగా పట్టాలు ఇచ్చింది. నాటి నుండి నేటి వరకు రైతులు ఆ భూములను చదును చేసుకుని, వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇదే పట్టాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నుండి రుణాలు పొందడమే కాకుండా, గత 13 ఏళ్లుగా రైతు బంధు / రైతు భరోసా మరియు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఆర్థిక సహాయం కూడా పొందుతున్నారు. ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ రికార్డుల్లో ఉండి, సాగు చేసుకుంటున్న భూములను ఇప్పుడు తమవి అంటూ అటవీ అధికారులు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడం దారుణం.జిల్లాలోని ధర్పల్లి మండలం (రామడుగు గ్రామం, డిబి తాండ), ఇందల్వాయి మండలం (ఇందల్వాయి, సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాలు), అలాగే సిరికొండ, మోపాల్, వర్ని మండలాల్లోని పలు గ్రామాల రైతులు అటవీ అధికారుల వేధింపులతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.2004వ సంవత్సరానికి ముందు నుండి అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజన, పేద రైతులకే ప్రభుత్వం పోడు పట్టాలు ఇచ్చింది. అలాంటిది 1986లోనే ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూములను లాక్కోవాలని చూడటం ఏమాత్రం సమంజసం కాదు. అంతేకాకుండా, 2004కు ముందు నుండి పోడు సాగు చేసుకుంటున్న అర్హులైన పేద రైతులలో ఇంకా పట్టాలు రాని వారందరికీ తక్షణమే పోడు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాము.రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాల కారణంగా అమాయక పేద రైతులు బలవుతున్నారు. అటవీ అధికారులు అసలు అటవీ భూములను రక్షించుకోవడం మానేసి, పేద రైతుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారు.రెవెన్యూ భూమి అయితే రైతులను వేధిస్తున్న అటవీ అధికారుల పైన, ఒకవేళ అటవీ భూమి అయితే తప్పుడు పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారుల

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 నవంబర్ 2026

కార్మికులకు కలుషిత జలాలా..
అధికారులకు శుద్ధి నీళ్లా!

- సింగరేణి యాజమాన్యంపై టీబీజీకేఎస్ నేతల విమర్శలు
- స్వచ్ఛమైన తాగునీటి కోసం దశలవారీగా ఆందోళనలు
- 13 వేల కుటుంబాలకు 34 ఎంఎల్‌డీల నీరు అవసరం
- ఫిల్టర్ బెడ్ సామర్థ్యం 16 ఎంఎల్‌డీలే
- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం



గోదావరిఖని, జనంసాక్షి: కార్మిక వాడలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయకపోవడం ద్వారా సింగరేణి యాజమాన్యం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య విమర్శించారు. సోమవారం కార్మికులకు సరఫరా చేస్తున్న గోదావరి నీటిని సంఘం ప్రతినిధి బృందం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలోని మురుగునీరు మల్కాపురం వద్ద గోదావరిలో కలుస్తోందని, అదే నీరు నదిలో ఏర్పాటు చేసిన బావుల్లోకి చేరి కార్మిక వాడలకు సరఫరా అవుతోందని ఆరోపించారు. నదిలో బావుల వద్ద రక్షణ నిర్మాణాలు, మైక్రో సిమెంట్ పనులు చేపట్టాలని సూచించారు.

గంగానగర్ ఫిల్టర్ బెడ్ రోజుకు కేవలం 16 ఎంఎల్‌డీల నీటిని మాత్రమే శుద్ధి చేయగలదని, 8వ ఇంక్లైన్, సెంటినరీ కాలనీల్లోని సుమారు 13 వేల కుటుంబాలకు 34 ఎంఎల్‌డీల నీరు అవసరమని తెలిపారు. గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాంతాల్లోని ఆయిల్, గ్రీజు, పేలుడు పదార్థాల రసాయనాలతో కలుషితమైన నీటిని కార్మికులకు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల నివాసాలకు మాత్రం ప్రత్యేక ఫిల్టర్ బెడ్ ద్వారా నీరు అందించడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఇసుక తవ్వకాలతో భూగర్భ జలమట్టం తగ్గుతోందని, కార్మిక కుటుంబాలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమం కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, యాజమాన్యం కార్మికులకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు అందించలేక పోవడం శోచనీయమన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు చేపడతామని, సింగరేణి అధికారులపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు చట్టబద్ధంగా పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, నాగెల్లి సాంబయ్య, ఐ. సత్యం, బేతి చంద్రయ్య, సంపత్ రెడ్డి, చల్లా రవీందర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను
వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేయాలి

- మంథని పుష్కర ఘాట్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



మంథని, నవంబర్ 23, (జనంసాక్షి) : ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రయోజనం అందేలా లబ్ధిదారుల పేర్లు, నామినీ వివరాలను ఖచ్చితంగా సేకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణ లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సంబంధించి ఏర్పాటు చేసిన శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని చేపడుతున్న అభివృద్ధి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనుల పురోగతి, ఇంకా ప్రారంభం కావాల్సిన పనులు, డిజైన్ ఆమోదాలు పెండింగ్ లో ఉన్న పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2027 గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన అభివృద్ధి పనులన్నింటినీ వేగవంతం చేయాలని ఆదేశించారు. డిజైన్ ఆమోదాలు పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధిత శాఖల అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి వెంటనే అనుమతులు పొందాలని సూచిం చారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ప్రారంభమై న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కాంట్రాక్టర్లు నిర్దిష్ట సమయంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు సురక్షితమైన స్నాన సౌకర్యాలు, తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, మరుగుదొడ్లు, రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రత తదితర మౌలిక సదుపాయాలను ముందస్తుగా కల్పించేలా ప్రణాళికా బద్ధంగా పనులు చేపట్టాలని సూచించారు. పుష్కరాలకు ముందే అన్ని పనులు నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

పోలీసింగ్ విధానాలు, క్షేత్రస్థాయి శిక్షణతో సమర్థవంతమైన
పోలీస్ అధికారులుగా ఎదగాలి

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- జిల్లాలోని వివిధ పోలీస్ విభాగాల్లో శిక్షణ పొందనున్న ట్రైనీ డీఎస్పీలు



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 23(జనంసాక్షి); పోలీస్ శాఖలో విధులు, బాధ్యతలు, పోలీసింగ్ విధానాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రాక్టికల్ శిక్షణ ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు.పోలీస్ శిక్షణలో భాగంగా 24 వారాల పాటు వివిధ పోలీస్ విభాగాల్లో క్షేత్రస్థాయి ప్రాక్టికల్ శిక్షణ పొందేందుకు జిల్లాకు కేటాయించబడిన ట్రైనీ డీఎస్పీలు పి.రవికుమార్, బి.సందీప్ నాయక్ లు సోమవారం రిపోర్ట్ చేశారు.ఈ సందర్భంగా వారు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ట్రైనీ డీఎస్పీలకు జిల్లాలో కేటాయించిన వివిధ ప్రాక్టికల్ ట్రైనింగ్ యూనిట్లు,ఆయా విభాగాల పనితీరు, విధులు,బాధ్యతలు,పోలీస్ శాఖ నిర్వహించే కార్యకలాపాల గురించి వివరించారు.శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ పోలీస్ శాఖలోని ప్రతి విభాగం పనితీరుపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ముఖ్యంగా పోలీస్ స్టేషన్ల నిర్వహణ, స్టేషన్ హౌస్ ఆఫీసర్ విధులు,కేసుల నమోదు, నేర పరిశోధన,నిందితుల గుర్తింపు,సాక్ష్యాధారాల సేకరణ,కోర్టు విధానాలు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి నేర్చుకోవాలని తెలిపారు.అదేవిధంగా ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్తు విధులు,ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం,మహిళలు, బాలల భద్రత,సైబర్ నేరాల నియంత్రణ,సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.24 వారాల శిక్షణ కాలంలో వివిధ పోలీస్ విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులను ప్రత్యక్షంగా పరిశీలించాలని, ప్రతి అంశాన్ని ఆసక్తితో నేర్చుకుంటూ భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలందించే సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.



ఇంట్లో ఎవరూ లేని సమయంలో భారీ చోరీ

- బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ
- 11 తులాల బంగారం, 82 తులాల వెండి, రూ.లక్ష నగదు చోరీ

గంభీరావుపేట, నవంబర్ 23 (జనం సాక్షి): ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చేసుకున్న గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి భారీ చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన గంభీరావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారవేణి పరశురాములు (51) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న మధ్యాహ్నం భార్య, పెద్ద కుమారుడితో కలిసి వేములవాడలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం 6 గంటలకు ఇంటికి చేరుకోగా, ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు వస్తువులన్నీ చిందరవందరగా కనిపించాయి.వెంటనే ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం సైతం పగులగొట్టి అందులో భద్రపరిచిన సుమారు 11 తులాల బంగారు ఆభరణాలు, 82 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు

దీంతో బాధితుడు సోమవారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఇంట్లో ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

విద్యుత్ కార్యాలయాలకు ప్రాంతాల పేర్లు

- వినియోగదారులకు సేవలు మరింత సులభం
- మూడు సబ్‌డివిజన్లు, మూడు ఈఆర్ఓల పేర్ల మార్పు
- తొమ్మిది ఆపరేషన్ సెక్షన్లకు కొత్త నామకరణం
- పరిపాలనా విధుల్లో ఎలాంటి మార్పు ఉండదు



కరీంనగర్ టౌన్, నవంబర్ 23 (జనంసాక్షి): విద్యుత్ వినియోగదారులకు మరింత సౌలభ్యం కల్పించే లక్ష్యంతో కరీంనగర్ పట్టణంలోని విద్యుత్ కార్యాలయాలకు ప్రాంతాల పేర్లు ఖరారు చేస్తూ టీజీఎన్పీడీసీఎల్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు టౌన్-1, టౌన్-2, టౌన్-3 వంటి సంఖ్యలతో కొనసాగుతున్న కార్యాలయాల పేర్లను మార్చినట్లు కరీంనగర్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఏ. విజయేందర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మూడు సబ్‌డివిజన్లు, మూడు విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు (ఈఆర్ఓలు), తొమ్మిది ఆపరేషన్ సెక్షన్లకు కొత్త పేర్లు నిర్ణయించారు.

సబ్‌డివిజన్లలో టౌన్-1కి కరీంనగర్, టౌన్-2కి ముకరంపుర, రూరల్‌కు కొత్తపల్లి పేర్లు పెట్టారు. ఈఆర్ఓలకు కూడా కరీంనగర్, ముకరంపుర, కొత్తపల్లి పేర్లు ఖరారు చేశారు. ఆపరేషన్ సెక్షన్లలో టౌన్-1 నుంచి 9 వరకు వరుసగా అంబేద్కర్ నగర్, పద్మానగర్, వావిలాలపల్లి, భగత్ నగర్, టవర్ సర్కిల్, చైతన్యపురి, సప్తగిరి కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఉజ్వల పార్క్ పేర్లను నిర్ణయించారు. ఈ మార్పులతో వినియోగదారులు తమ ప్రాంతానికి సంబంధించిన విద్యుత్ కార్యాలయాలను సులభంగా గుర్తించి సేవలు పొందవచ్చని ఎస్ఈ తెలిపారు. కార్యాలయాల పేర్ల మార్పు మాత్రమేనని, పరిపాలనా వ్యవస్థ, అధికారుల విధులు, సిబ్బంది, బాధ్యతలు, సేవల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 81 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజలు ప్రజావాణికి వస్తున్నారని, వారి నమ్మ కాన్ని నిలబెట్టేలా అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలని సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా, అర్హత మేరకు త్వరితగతిన చర్యలు తీసుకోవాల ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, సీఈఓ చందర్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలకు రూ.30 వేల ఆర్థిక సాయం

నవంబర్ 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 23 (జనం సాక్షి) : క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు కామారెడ్డి జిల్లాలోని అర్హత కలిగిన చర్చిలకు తెలంగాణ ప్రభుత్వం రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనుంది. చర్చిలకు సున్నం వేయడం, విద్యుత్ దీపాలంకరణ కోసం ఈ నిధులను మంజూరు చేయనున్నారు. క్రిస్మస్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న ప్రభుత్వం ఈ మేరకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. ఎం. శశి కుమార్ తెలిపారు. ఒక్కో చర్చి నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారు. అర్హత కలిగిన చర్చిలు నవంబర్ 23 నుంచి 30 వరకు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ప్రింట్‌తో పాటు చర్చి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, నిర్వహణ కమిటీ తీర్మానం, బ్యాంక్ పాస్‌బుక్ లేదా క్యాన్సిల్డ్ చెక్, పాస్టర్ లేదా అధ్యక్షుడు లేదా కార్యదర్శి ఆధార్ కార్డు, చర్చి తాజా ఫోటోలు, నిధులను సున్నం వేయడానికి, దీపాలంకరణకు మాత్రమే వినియోగిస్తామని అండర్‌టేకింగ్‌ను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలి. జిల్లాలోని పాస్టర్లు, చర్చి కమిటీ సభ్యులు, క్రైస్తవ సామాజిక నాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్దిష్ట గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9912290880 నంబర్‌ను సంప్రదించవచ్చు.

తెలంగాణ ఉద్యమానికి కేసీఆర్ ఆమరణ దీక్షే ఊపిరి

- దీక్షా దివస్ స్ఫూర్తి సభను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



గంగాధర నవంబర్ 23 (జనంసాక్షి): తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడటానికి ఆనాడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షే ప్రధాన కారణమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. నవంబర్ 29 తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని పేర్కొన్నారు.ఈ నెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూరులో నిర్వహించనున్న దీక్షా దివస్ స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం గంగాధర మండలంలోని మధురానగర్‌లో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో గంగాధర, బోయినిపల్లి మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జీవన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష తెలంగాణ ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసిందన్నారు. మరోసారి ఉద్యమ స్ఫూర్తితో పార్టీ శ్రేణులు పోరాట పటిమను చాటాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.దీక్షా దివస్ స్ఫూర్తి సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనతో ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని మరో ఏడాది ప్రజల పక్షాన నిరంతరం పోరాటం సాగించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 29 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన రోజని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఆమరణ దీక్షకు సిద్ధమై ఉద్యమానికి కొత్త ఊపిరి పోశారని గుర్తుచేశారు. కేసీఆర్ దీక్షతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతమైందని, అప్పటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రకటించిందని తెలిపారు. అనేక అడ్డంకులు కుట్రలను ఎదుర్కొని తెలంగాణ ప్రజలను ఏకం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రజల ఆశీస్సులతో రెండుసార్లు ముఖ్య మంత్రిగా పనిచేసి తెలంగాణ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన కొనసాగుతోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది, కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 29న ఉద్యమాల పురిటిగడ్డ కరీంనగర్‌లో నిర్వహించే దీక్షా దివస్ స్ఫూర్తి సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త జైపాల్ రెడ్డి.నాగి శేఖర్,సింగిల్ విండో చైర్మెన్ దూలం బాలగౌడ్,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మెచినేని నవీన్ రావు.కత్తెరపాక కొండయ్య, సర్పంచులు కరబూజ తిరుపతిగౌడ్, వేముల దామోదర్, చిలుముల సుధాకర్,నాయకులు ఆకుల మధుసూదన్,మధుసూదన్ రెడ్డి,మరియు గంగాధర, బోయినిపెల్లి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12 గంటల్లోనే హత్య కేసు ఛేదింపు

పాత కక్షలు, వ్యక్తిగత విభేదాలే హత్యకు కారణం

- ఫోన్ చేసి పిలిపించి కత్తులతో దాడి
- నలుగురు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- ఆటో, రెండు కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం





గోదావరిఖని, నవంబర్ 23 (జనంసాక్షి): గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలో సింగరేణి కార్మికుడు అట్ల రాజశేఖర్ (36) హత్య కేసును పన్‌టౌన్ పోలీసులు 12 గంటల్లోనే ఛేదించారు. పాత కక్షలు, వ్యక్తిగత విభేదాలే హత్య కు కారణమని నిర్ధారించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఆర్కే-1 గనిలో కార్మికుడిగా పనిచేస్తున్న రాజశేఖర్‌కు ప్రధాన నిందితుడు ఎన్నం ప్రసాద్‌తో గతంలో సన్నిహిత సంబంధాలు ఉండేవి. అయితే ఆరు నెలలుగా వ్యక్తిగత విభేదాలు, ఫోన్‌లో వాగ్వాదాలు, కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలతో ఇద్దరి మధ్య కక్ష పెరిగింది. దీంతో ప్రసాద్ తన స్నేహితులు ఎడ్లపల్లి శ్రావణ్ కుమార్, అయిలీ దేవేందర్, బోరె మల్లేష్‌లతో కలిసి హత్యకు పథకం రచించాడు.

ఈ నెల 22న రాత్రి నలుగురూ ప్రసాద్‌కు చెందిన ఆటోలో బృందావన్ గార్డెన్స్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లి, అనంతరం పవర్‌హౌస్ కాలనీలోని బాలయ్య కిరాణా దుకాణం సమీపంలో రాజశేఖర్ కోసం మాటువేశారు. 23వ తేదీ తెల్లవారుజామున 1.10 గంటలకు ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న రాజశేఖర్‌ను అడ్డగించి పెద్ద, చిన్న కత్తులతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. హత్య అనంతరం రక్తపు మరకలున్న దుస్తులను కాల్చివేసి, బూడిదను గోదావరిలో పడేశారు. అనంతరం కాల్వ శ్రీరాంపూర్ వైపు పారిపోతుండగా 5 ఇంక్లైన్ చౌరస్తా సమీపంలో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పసుపు రంగు ఆటో, రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు, రక్తపు మరకలున్న టీషర్టును స్వాధీనం చేసుకున్నారు.

రాజశేఖర్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలతో దర్యాప్తు చేపట్టారు. డీసీపీ రామ్‌రెడ్డి సూచనల మేరకు ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో పన్‌టౌన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, ఎస్సైలు మనోహర్, రాజశేఖర్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని డీసీపీ, ఏసీపీ అభినందించారు. వ్యక్తిగత వివాదాలను హింసకు దారితీయకుండా చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని డీసీపీ సూచించారు.

ఎస్సీ బీసీలకు చదువులు దూరం చేస్తున్న పాలకులు

- అవసరం లేకుండా ఐదు కోట్లతో మున్సిపల్ ఆఫీస్ కడుతుండ్లు
- పేద విద్యార్థులను రోడ్డున పడేసిన ఘనత వారిదే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, నవంబర్ 23, (జనంసాక్షి) : పనులు మంజూరైతే నేరుగా పది శాతం...బిల్లులు ఇప్పిస్తే మరో పది శాతం కమీషన్‌ల కోసమే పాలకులు అభివృద్ధి పేరిట పనులు చేయిస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ఎస్సీ బాలికల హస్టల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ బాలికల హస్టల్ శిథిలావస్తలో ఉండటంతో అద్దె భవనంలోకి మార్చి నెల రూ. 40 వేల కిరాయి చెల్లిస్తున్నారని, అందులోనూ కింది భవనంలో ఇంటి యజమానులు ఉండగా పై అంతస్తులో బాలికల హస్టల్‌ను నడిపిస్తున్నారని తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా ఉన్న కొత్త భవనం కోసం కనీసం ప్రతిపాదనలు కూడా చేయలేదని విమర్శించారు. తండ్రి ఆశయాల కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే అన్నాతమ్ముళ్లు మంథనిలో డబ్బుల కోసం కమీషన్‌ల కోసం పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల పాఠశాలలు, హస్టల్‌లకు ఏ మాత్రం సౌకర్యాల కోసం ఆలోచన చేయడం లేదని, ఇందుకు బాలికల హస్టల్ నిదర్శనమన్నారు. ఎంతసేపు డబ్బులు ఎక్కడ వస్తయి ఎంత కమీషన్ వస్తయనే ఆలోచనతోనే పనిచేస్తున్నారని, అవసరం లేకున్నా కమీషన్‌ల కోసమే పనులు చేయిస్తున్నారన్నారు. మంథనిలో పదిహేను ఏండ్ల క్రితమే నిర్మించిన మున్సిపల్ కార్యాలయం మంచిగా ఉన్నప్పటికి దానికి కొత్త భవనానికి రూ.5 కోట్లు వెచ్చించి నిర్మిస్తున్నారన్నారు. ఈ భవనం అవసరం లేకున్నా ఇక్కడ ఉండే హస్టల్‌లో 200 మంది పేద విద్యార్థులను రోడ్డున పడేశారని, దీంతో ఈనాడు హస్టల్ 25మందికే పరిమితం అయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూచిరాజ్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాలను కూల్చివేసి నాలుగు కోట్లతో గెస్ట్‌హౌజ్ కడుతున్నారని, నియోజకవర్గంలో 80ఏండ్ల తర్వాత కూడా ఎస్సీలను బీసీలను చదువులకు దూరం చేస్తున్న చరిత్ర దుద్దిళ్ల కుటుంబానిదేనని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ ఐదు కోట్ల భవనంలోకి ఈ హస్టల్ పిల్లలను తీసుకెళ్లి ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. అదికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా కనీసం బిల్డింగ్ కోసం ప్రతిపాదనలు చేయడం లేదని, పిల్లల సంఖ్యను పెంచాలని ఆలోచన చేయడం లేదని విమర్శించారు. ఎక్కడ హస్టల్ వసతులు లేకుండా చేయడం, పాఠశాలల్లో సౌకర్యాలు లేకుండా చేస్తే ప్రైవేటుకు వెళ్తారన్న ఆలోచనలో పాలకులు ఉన్నారని అన్నారు. పిల్లలను రోడ్డున పడేసి నాలుగు కోట్లతో గెస్ట్ హౌజ్, ఐదు కోట్లతో మున్సిపల్ కార్యాలయం నిర్మించాల్సిన అవసరం ఏంటని ఆయన ప్రశ్నించారు. అన్నాదమ్ముళ్ల ఈ సమాజాన్ని దోపిడి చేయడానికే ఉన్నారన్నారు. ఏ విధంగా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నరో, ఏ విధంగా మా చదువులను అడ్డుకుంటున్నారో సమాజానికి తె

కీసరగుట్టలో భక్తుల సమస్యలు పరిష్కరించాలి

- దుకాణాల వద్ద ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి
- దిగువన మరుగుదొడ్లు నిర్మించాలి
- సామాజిక సేవకుడు తుడుం శ్రీనివాస్



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 23 (జనంసాక్షి) : కార్తీక మాసం సందర్భంగా కీసరగుట్టకు భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సామాజిక సేవకుడు తుడుం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కీసరగుట్టకు తరలివస్తున్నారు. అయితే క్షేత్రానికి వచ్చే భక్తులు, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కీసర మండల సామాజిక సేవకుడు తుడుం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు. కీసరగుట్టపై పూజా సామగ్రి, కొబ్బరికాయలు తదితర వస్తువులు విక్రయించే, ప్రతి దుకాణం వద్ద ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా భక్తులు మోసపోకుండా న్యాయమైన ధరలకు వస్తువులు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా కీసరగుట్ట దిగువ భాగంలో మహిళలు, చిన్నారులు, వృద్ధుల సౌకర్యార్థం పరిశుభ్రమైన మరుగుదొడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత దేవాదాయ శాఖ అధికారులతో పాటు కీసర రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని తుడుం శ్రీనివాస్ కోరారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

- యువతలో అవగాహనకు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ డా.ప్రియాంక అలా



హైదరాబాద్ సిటీ, నవంబర్ 23 (జనం సాక్షి) : ప్రతిష్టాత్మకమైన 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 నిర్వహణపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో విస్తృత అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అధికారిక మాస్కట్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్ వద్ద సెల్ఫీ దిగడంతో జిల్లాలో క్రీడల ప్రచార కార్యక్రమాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ పోటీల పట్ల ఆసక్తి, ఉత్సాహం పెంపొందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, వివిధ మాధ్యమాలు, ప్రజా సంబంధ కార్యక్రమాల ద్వారా క్రీడా పోటీల సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. క్రీడల విజయవంతమైన నిర్వహణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలోని ఎనిమిది ఆతిథ్య జిల్లాల్లో 20 వేదికలపై పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి డా.నారాయణ, పరిపాలన అధికారి వెంకట్రామిరెడ్డి, యువజన క్రీడల శాఖ పర్యవేక్షకులు శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొడంగల్ పోలీస్ స్టేషన్‌ని ఆకస్మిక తనిఖీ

- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఎస్పీ .స్నేహ మెహ్రా



కొడంగల్, నవంబర్ 23 (జనం సాక్షి) : వార్షిక తనిఖీల్లో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఐపీఎస్ సోమవారం కొడంగల్ పోలీస్ స్టేషన్‌తో పాటు సీఐ కార్యాలయాన్ని సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి డీఎస్పీ శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి ఎస్పీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, రిజిస్టర్లు, సిబ్బంది విధులు, ఫిర్యాదుల స్వీకరణ తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతి, నిందితుల అరెస్టులు, దర్యాప్తు, కోర్టు కేసుల నిర్వహణపై సమీక్షించారు. అనంతరం బ్లూ కోల్ట్స్, సీసీటీఎన్ఎస్, కోర్టు డ్యూటీ సిబ్బందితో మాట్లాడి వారి విధులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలను ఓపికగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, బ్లూ కోల్ట్స్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ గస్తీ నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం సీఐ కార్యాలయాన్ని పరిశీలించి సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, సిబ్బంది పనితీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు టైక్వాండో ఎంతో అవసరం

- విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి



కొడంగల్, నవంబర్ 23 (జనం సాక్షి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, శారీరక దృఢత్వం, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కొడంగల్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నవీన ఆదర్శ కాన్వెంట్ హైస్కూల్‌లో జిల్లా టైక్వాండో అధ్యక్షులు గంటి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టైక్వాండో సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు, మహిళలు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ పొందడం ఎంతో అవసరమని, ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే ధైర్యం టైక్వాండో ద్వారా లభిస్తుందని అన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు గంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. కొడంగల్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో సాయంత్రం 5:30 నుంచి 6:30 గంటల వరకు టైక్వాండో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా హెచ్. మనోహర్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా బెస్ట్ మాస్టర్ నంది అవార్డును అందుకున్నారు.ఈ కార్యక్రమంలో టైక్వాండో జిల్లా కార్యదర్శి హకీం మనోహర్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్ రాజు, కరస్పాండెంట్ డి.వి. వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

- మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత కల్పించాలి
- కొండుర్గు పడమర సర్వే నంబర్ 44పై ప్రజావాణిలో బోయ చందన్ కుమార్ వినతి



కొండుర్గు, నవంబర్ 23 (జనంసాక్షి) : కొండుర్గు మండల కేంద్రంలోని కొండుర్గు పడమర శివారు సర్వే నంబర్ 44 లో ఉన్న అసైన్డ్ భూమిలో మహిళా సంఘాలకు ఆర్థిక భరోసాను కల్పించే దిశగా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ కొండుర్గు నివాసి బోయ చందన్ కుమార్ సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండుర్గు పడమర పరిధిలోని సర్వే నంబర్ 44 లో ఇన్‌క్రెడిబుల్ ఇండియా వెంచర్ యాజమాన్యం అక్రమంగా 7.34 గుంటల అసైన్డ్ భూమిని పట్టగా మార్చుకుని వెంచర్ గా మార్చే ప్రయత్నం చేసింది. గతంలో ఇదే వివాదం పైన పిర్యాదు ఇవ్వగా ఆ భూమిని ప్రభుత్వం రిజిస్ట్రేషన్ రద్దు చేసింది. రద్దయిన భూమి రికవరీ చెయ్యగా ఆ స్థలం ఖాళీగా ఉందని తెలిపారు. ఈ ప్రభుత్వ భూమిలో మహిళా సమాఖ్య ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేపడితే, స్థానిక మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయం సమకూరి వారు ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆత్మరక్షణకు టైక్వాండో ఎంతో అవసరం



కొడంగల్, నవంబర్ 23 (జనం సాక్షి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, శారీరక దృఢత్వం, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కొడంగల్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నవీన ఆదర్శ కాన్వెంట్ హైస్కూల్‌లో జిల్లా టైక్వాండో అధ్యక్షులు గంటి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టైక్వాండో సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు, మహిళలు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ పొందడం ఎంతో అవసరమని, ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే ధైర్యం టైక్వాండో ద్వారా లభిస్తుందని అన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు గంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. కొడంగల్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో సాయంత్రం 5:30 నుంచి 6:30 గంటల వరకు టైక్వాండో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా హెచ్. మనోహర్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా బెస్ట్ మాస్టర్ నంది అవార్డును అందుకున్నారు.ఈ కార్యక్రమంలో టైక్వాండో జిల్లా కార్యదర్శి హకీం మనోహర్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్ రాజు, కరస్పాండెంట్ డి.వి. వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి కసరత్తు

- స్థల పరిశీలనకు కలెక్టర్‌కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి
- రేపటిలోగా పరిశీలిస్తామని కలెక్టర్ హామీ



ఉప్పల్, నవంబర్ 23 (జనం సాక్షి) : ఉప్పల్ నియోజకవర్గంలోని భగాయత్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ మను చౌదరిని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంబంధిత రెవెన్యూ అధికారులతో స్థల పరిశీలన నిర్వహించి, నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి రేపటిలోగా సంబంధిత ఎంఆర్ఓ ద్వారా స్థల పరిశీలన చేయించి, అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అర్హులైన పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించేందుకు కృషి చేస్తామని, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం కార్యరూపం దాల్చేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి హైదరాబాద్ వాక్స్



ఖైరతాబాద్, నవంబర్ 23 (జనం సాక్షి) : మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నవంబర్ 25, 26, 27 తేదీల్లో 'నషా ముక్త్ భారత్-హైదరాబాద్ వాక్స్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ గిరిజన మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సింగ్ తెలిపారు. అంబర్‌పేట్ నుంచి ప్రారంభమయ్యే ఈ వాక్స్ జూబ్లీహిల్స్ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా యువతలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రేరేపించనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత దేశ భవిష్యత్తు అని, మాదకద్రవ్యాల వ్యసనం యువత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి ఈ పోరాటాన్ని సామాజిక ఉద్యమంగా కొనసాగించాలని కోరారు. ఈ వాక్స్‌లో యువత, ప్రజలు, సినీ ప్రముఖులు, వివిధ మతాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'డ్రగ్స్‌కు నో-జీవితానికి యెస్' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 'నషా ముక్త్ యువ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. యాంటీ నార్కోటిక్స్ సహాయం కోసం 1933, డీ-అడిక్షన్ సేవల కోసం 14446 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. 'డ్రగ్స్ రహిత యువత-బలమైన భారత్, డ్రగ్స్ రహిత హైదరాబాద్-ఆరోగ్యవంతమైన సమాజం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చరణ్ సింగ్ వివరించారు.

ప్రతి శుక్రవారం 'చెక్-5' పాటించాలి

- దోమల నివారణకు ప్రజలు భాగస్వాములు కావాలి
- ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 23 (జనంసాక్షి) : డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో ఐదు ప్రదేశాలను పరిశీలించి, మూడు నివారణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. దోమల ఉత్పత్తిని ప్రాథమిక దశలోనే అరికట్టేందుకు ఎంఎంసీ ఆధ్వర్యంలో 'చెక్-5 ప్రతి శుక్రవారం' ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి అవగాహన పోస్టర్‌ను సోమవారం తార్నాక లోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో విడుదల చేశారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇళ్ల పరిసరాల్లోని నీటి నిల్వ పాత్రలు, పూలకుండీల కింద ప్లేట్లు, కూలర్లు, పాత టైర్లు, ఇతర వస్తువులను ప్రతి శుక్రవారం పరిశీలించాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించడం, పాత్రలను శుభ్రంగా తోమడం, అవసరమైన నీటి నిల్వలకు మూతలు పెట్టడం అనే మూడు చర్యలు (3సి) పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీ సంక్షేమ సంఘాలు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఆరోగ్యకరమైన మల్కాజిగిరిని నిర్మించగలమని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు సి.ఎన్.రఘు ప్రసాద్, కె.వేణుగోపాల్, చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.శ్రీనివాస్, యూబీడీ డైరెక్టర్ సునంద, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రదీప్, రంజిత్, వెటర్నరీ విభాగాధిపతి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖండిత కందకాల పనులను పరిశీలించిన అధికారులు



కొడంగల్, నవంబర్ 23 (జనం సాక్షి) : కొడంగల్ మండలం పోచమ్మ తండా గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న ఖండిత కందకాల పనులను ఏపీఓ రాములు సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ కూలీలకు పనుల ప్రాధాన్యత, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సునీత మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు భూసార పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణకు ఖండిత కందకాల పనులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి కూలీ పనుల పట్ల బాధ్యతగా వ్యవహరించి, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాములు, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాజు, మేట్ గోపాల్, గ్రామ కూలీలు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టును వృధా కాకుండా అరికట్టాలి

- నెక్సస్ ప్లే స్కూల్ కారస్పాండెంట్ యాదగిరి

శామీర్‌పేట్, నవంబర్ 23 (జనం సాక్షి) : నీటి వృధాను అరికట్టినప్పుడే రాబోయే రోజులు నీటి కొరత నివారణ సాధ్యం అవుతుందని శామీర్ పేట్ లోని నెక్సస్ ప్లే స్కూల్ కారస్పాండెంట్ యాదగిరి అన్నారు. సోమవారం శామీర్ పేట్ డివిజన్ లో నెక్సస్ స్కూల్ ప్రిన్సిపాల్ సోని ఆధ్వర్యంలో సేవ్ వాటర్ అనే బ్యానర్ తో విద్యార్థులతో కలిసి స్కూల్ నుండి వై ఎస్సార్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగానెక్సస్ స్కూల్ కరస్పాండెంట్ యాదగిరి మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో ఎల్ నినో తో నీటి కొరత తీవ్రతరం కానుందని ప్రతి ఒక్కరూ నీటిని వృధా కాకుండా కృషి చెయ్యాలని అన్నారు. గ్రౌండ్ వాటర్ చాల తక్కువ ఉండడటంతో అందరు అవసరానికి అనుగుణంగా నీరు వాడకం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 నవంబర్ 2026

అటవీ ఉద్యోగికి జాతీయ పురస్కారం



న్యూఢిల్లీ (జనంసాక్షి) : వన్యప్రాణుల సంరక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయిన అటవీ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయి పురస్కారం ప్రకటించింది. వన్యప్రాణుల రక్షణ, వేట నిరోధక చర్యల్లో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా 'ఫ్రంట్‌లైన్ స్టాఫ్-ప్రొటెక్షన్ అండ్ యాంటీ పోచింగ్' విభాగంలో ఈ అవార్డును ఎంపిక చేసింది. సోమవారం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చేతుల మీదుగా నవీన్ భార్య, కుటుంబ సభ్యులు పురస్కారాన్ని స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ అటవీ పరిధిలో విధులు నిర్వహించిన నవీన్.. వన్యప్రాణుల వేటను అడ్డుకునే ప్రయత్నంలో విద్యుత్ ఉచ్చుకు గురై ప్రాణాలు కోల్పోయారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మరణానంతరం ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో అటవీ దళాధిపతి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

లైసెన్స్ సర్వేయర్లకు పెండింగ్ నిధులు విడుదల చేయండి

మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన



మహబూబాబాద్, నవంబర్ 23(జనం సాక్షి): రీ-సర్వే విధుల్లో పాల్గొంటున్న లైసెన్స్ సర్వేయర్లకు పెండింగ్ నిధుల విడుదల, వేతన సవరణ, గౌరవ వేతనం, ఇతర సమస్యల పరిష్కారానికై జిల్లాలో పనిచేస్తున్న లైసెన్స్ పొందిన సర్వేయర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూ బాబాద్ జిల్లాలోని ఆయా మండలాల్లో ఇప్పటికే ఒక్కో గ్రామంలో రీ-సర్వే పనులు పూర్తిచేసి, ప్రస్తుతం రెండవ గ్రామంలో సర్వే పనులు నిర్వహిస్తున్నామన్నారు. అయినప్పటికీ, గత సుమారు 8 నెలలుగా నిరంతరంగా విధులు నిర్వహిస్తున్న ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాలేదనీ, కొంతమంది సర్వేయర్లకు కేవలం నామమాత్రంగా 5 వేల రూపాయలు మాత్రమే చెల్లించడం జరిగిందన్నారు. ఎలాంటి సౌకర్యాలు లేకుండా, కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎండ, వాన, బురద, పొలాలు, ముళ్లపొదలు వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నాము. క్రిమికీటకాలు, విషపురుగులు, పాముల వల్ల ప్రాణాపాయం ఉన్నప్పటికీ విధులను కొనసాగిస్తున్నామన్నారు. రీ సర్వేల్లో పాల్గొన్న సర్వేయర్లకు గౌరవ వేతనం మరియు పెండింగ్ వేతనాల చెల్లింపు వేతన సవరణ, ప్రభుత్వ, ఇతర భూముల సర్వేకు పారితోషికం, కార్యాలయ రికార్డు పనులకు అదనపు వేతనం, ప్రమాద బీమా మరియు ఇన్సూరెన్స్ తదితర డిమాండ్లను పరీక్షరించాహని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారు వెంకన్న సభ్యులు ఆరేపల్లి సతీష్ రాజు జంపన్న రాజేష్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్ భూముల్లో అక్రమ తవ్వకాలకు చెక్

ఎర్రరాయి మాఫియాపై పోలీసుల ఉక్కుపాదం



- మూడు రోజులు వరుస దాడులు..
- 5 యంత్రాల స్వాధీనం

న్యాల్‌కల్, నవంబర్ 23 (జనం సాక్షి): నిమ్జ్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూముల్లో అక్రమంగా సాగుతున్న ఎర్రరాయి తవ్వకాలపై పోలీసులు నిఘా పెంచారు. ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మైనింగ్ నిర్వహించడం, ప్రాజెక్టు అధికారులు ఏర్పాటు చేసిన కంచెలను ధ్వంసం చేసి తవ్వకాలు కొనసాగించడంపై కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ రూరల్ సీఐ నర్సింలు హెచ్చరించారు. నిమ్జ్ ప్రాజెక్టు ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ సైదా నాయక్ ఆదేశాలతో సోమవారం రూరల్ సీఐ ఆధ్వర్యంలో హత్నూర ఎస్సై సుజిత్, రాయికోడ్, ఝరాసంగం ఎస్సైలతో పాటు పోలీసు బృందం గణేశ్‌పూర్ గ్రామ శివారులోని మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించింది.

డ్రోన్ కెమెరాలతో క్షేత్రస్థాయి పరిశీలన

అక్రమ మైనింగ్‌ను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పోలీసులు డ్రోన్ కెమెరాల సాయంతో తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని అనువణువూ పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్రజలకు అక్రమ తవ్వకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మైనింగ్ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఇప్పటికే ఈ దందాతో సంబంధం ఉన్న 15 మందిపై కేసులు నమోదు చేసి, తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో వరుసగా దాడులు నిర్వహించి, సోమవారం మరో మూడు కోత యంత్రాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దశాబ్ద కాలానికి పైగా అధికార, విపక్ష పార్టీలకు చెందిన కొందరి సహకారంతో స్థానికులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిమ్జ్ ఉన్నతాధికారుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి వరుస దాడులు నిర్వహిస్తుండటంతో అక్రమ మైనింగ్ నిర్వాహకుల్లో ఆందోళన మొదలైంది.

పోలీసుల చర్యలపై రైతుల హర్షం

ఏళ్ల తరబడి సాగుతున్న అక్రమ మైనింగ్ కారణంగా గ్రామానికి వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 35 ఏళ్లుగా రహదారులకు కనీస మరమ్మతులు కూడా చేయలేదని తెలిపారు. ఎర్రరాయి, మట్టి తవ్వకాలతో సమీపంలోని పంట పొలాలపై దుమ్ము పేరుకుపోయి పంటలకు నష్టం కలుగుతోందని, రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎట్టకేలకు పోలీసులు అక్రమ మైనింగ్‌పై చర్యలు చేపడుతుండటంతో రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కేజీబీవీలో విద్యార్థినిపై పీఈటీ దాడి..

అన్నపురెడ్డిపల్లి (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్నాక్స్ బాక్స్ తీసుకురాలేదనే కారణంతో ఓ విద్యార్థినిని గెస్ట్ వ్యాయామ ఉపాధ్యాయురాలు (పీఈటీ) కర్రతో కొట్టడంతో ఆమె భుజం ఎముకకు తీవ్ర గాయమైనట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. కృష్ణ కుమారై కానిని వాసవి (16) ఏడో తరగతి నుంచి అన్నపురెడ్డిపల్లి కేజీబీవీలో చదువుతోంది. ప్రస్తుతం పదో తరగతి అభ్యసిస్తోంది. ఇటీవల పాఠశాలలో స్నాక్స్ కోసం బాక్స్ తీసుకురాలేదనే కారణంతో గెస్ట్ పీఈటీ స్వాతి కర్రతో వాసవిని కొట్టినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ ఘటనలో బాలిక భుజానికి తీవ్ర గాయమైందని, ఎముక విరిగినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




ఓఆర్ఆర్‌పై నుంచి సర్వీస్ రోడ్డులో లారీ బోల్తా

శంషాబాద్, నవంబర్ 23 (జనంసాక్షి) : ఓఆర్ఆర్‌పై అదుపుతప్పిన లారీ సర్వీస్ రోడ్డులో పడటంతో, ఆ సమయంలో ఎవరూ అటువైపు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన సోమవారం ఉదయం 5 గంటల సమయంలో శంషాబాద్ ఓఆర్ఆర్ ఎగ్జిట్-17 సమీపంలోని చెన్నమ్మ హోటల్ వద్ద చోటుచేసుకుంది. శంషాబాద్ ఆర్జీఐఏ ఎస్సై ఇంద్రసేనారెడ్డి వివరాల ప్రకారం కోదాడ నుంచి కోకాపేటకు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి ఓఆర్ఆర్‌పై నుంచి సర్వీస్ రోడ్డులో కిందపడింది. డ్రైవర్ ఎలాంటి గాయాలు లేకుండా బయటపడగా, ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న ఆర్జీఐఏ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భూ భారతి పోర్టల్‌లో భూ బాగోతం

నకిలీ పత్రాలతో భూమి కాజేసే యత్నం



- ఇతరుల భూమిపై కన్ను.. భూ భారతి రికార్డుల్లో అక్రమ మార్పులు
- రెండు ఎకరాల భూమికి నకిలీ యజమాని
- రూ.2.30 లక్షల రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించి స్లాట్ బుకింగ్
- ముగ్గురు నిందితులు అరెస్ట్ మరో వ్యక్తి పరారీ

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 23(జనం సాక్షి): భూ భారతి పోర్టల్‌లో భూ రికార్డులను అక్రమంగా మార్చి, నకిలీ ఆధార్ వివరాలతో ఇతరుల భూమిని విక్రయించేందుకు ప్రయత్నించిన ముగ్గురు నిందితులను సంగారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉండగా, అతని కోసం గాలిస్తున్నారు. అరెస్టయిన వారిని న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నారు.

వివరాలు ఇలా ఉన్నాయి...ఈ నెల 21న సాయంత్రం సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 228/ఏ లో ఉన్న రెండు ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు నలుగురు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకరు అసలైన భూ యజమాని జి. రాజేంద్ర ప్రసాద్‌గా నటిస్తున్నట్లు తహసీల్దార్‌కు అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం అందించారు.దీంతో సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామునాయుడు అక్కడికి చేరుకుని ఇమ్తియాజ్ అహ్మద్ (సంగారెడ్డి), నవీద్ అహ్మద్, రామచంద్ర (బీదర్, కర్ణాటక)లను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అసలైన భూ యజమాని రాజేంద్ర ప్రసాద్ పేరుతో రామచంద్ర ఆధార్ కార్డు వివరాలను అక్రమంగా మార్చి, నకిలీ ఆధార్ ఆధారంగా భూ భారతి పోర్టల్‌లో రికార్డులను సవరించినట్లు వెల్లడైంది. ఈ విధంగా అక్రమంగా ఈ-పట్టాదార్ పాస్‌బుక్ కూడా పొందినట్లు గుర్తించారు. అంతేకాకుండా ఈ నెల 19న రూ.2,30,773 రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించి, రిజిస్ట్రేషన్ కోసం సమయం కేటాయించుకున్నారు. అయితే భూమికి సంబంధించిన తప్పనిసరి ఓఆర్‌సీ ధ్రువపత్రం సమర్పించకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. తహసీల్దార్ విచారణలో అక్రమాలు బయటపడటంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భూముల కొనుగోలు, అమ్మకాల సమయంలో పట్టాదార్ పాస్‌బుక్‌లు, ఆధార్ వివరాలు, ఇతర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా పోలీసులు ప్రజలకు సూచించారు. ప్రభుత్వ పోర్టళ్లలో అక్రమ మార్పులు చేయడం, నకిలీ పత్రాలతో ఇతరుల భూములను విక్రయించేందుకు ప్రయత్నించడం నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనర్ విద్యార్థినిపై లైంగిక వేధింపులు

- లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు

ఆమీన్‌పూర్, నవంబర్ 23 (జనం సాక్షి): మైనర్ బాలికను లైంగికంగా వేధించిన ఓ కళాశాల లెక్చరర్‌పై పోక్సు చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి వెల్లడించారు. అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధి పటేల్ గూడ లో ఉన్న ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినిపై, అదే కళాశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ లెక్చరర్ లైంగిక వేధింపులకు/దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిపై విచారణ జరుపుతున్నారు.

ఎంఐఎం నాయకుడు

మూర్తజా పహిల్వాన్ హత్య

కత్తులతో విచక్షణారహితంగా దాడి...

- చికిత్స పొందుతూ మృతి..




రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ రాజేంద్రనగర్ (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని హిమాయత్ సాగర్ రోడ్డుకు సమీపంలో మూర్తజా పహిల్వాన్‌పై 8 నుంచి 10 మంది వ్యక్తులు గుంపుగా వచ్చి ఆకస్మికంగా దాడికి పాల్పడినట్లు పాల్పడ్డారు ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే జర్మన్ ఆసుపత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మూర్తజా పహిల్వాన్ మృతి చెందాడు అనంతరం ఆయన మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి గల కారణాలు, నిందితుల వివరాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు పాత కక్షలు హత్యకు కారణమై ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు ఘటన స్థలానికి చేరుకున్న శంషాబాద్ డిసిపి రాజేష్ హత్య జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేనేత కార్మికులను అక్కున చేర్చుకోండి

అర్హులందరికీ ఆంక్షలు లేకుండా చేయూత పెన్షన్లు ఇవ్వాలి

- ప్రజావాణిలో కలెక్టర్‌కు చేనేత ఐక్యవేదిక వినతి



గద్వాల, నవంబర్ 23 (జనం సాక్షి) : జిల్లాలోని అర్హులైన చేనేత కార్మికులందరినీ ప్రభుత్వం తక్షణమే అక్కున చేర్చుకుని, ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయూత ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేదం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు ముడిసరుకుల ధరలు పెరగడం, సరైన ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెన్షన్ల మంజూరులో అడ్డంకిగా మారిన జియో ట్యాగింగ్ నిబంధనలను తక్షణమే తొలగించాలని, కుటుంబంలో అర్హులైన భార్యాభర్తలిద్దరికీ విడివిడిగా పెన్షన్లు అందించాలని కోరారు.గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ప్రతి కార్మికుడికి న్యాయం జరిగేలా వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి, వారికి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక నాయకులు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.



పుష్కరఘాట్‌లో నీటి కష్టాలు

ధరూరు, నవంబర్ 23 (జనం సాక్షి) ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కృష్ణానది లో నీటిమట్టం భారీగా పడిపోయింది. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గద్వాల నదీ అగ్రహారం పుష్కర ఘాట్ వద్ద అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. శివాలయ దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ దీపాలంకరణ, కృష్ణానది తీరాన మహాహారతి నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నారు.పండుగ రోజున వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారనే అంచనాతో అధికారులు విద్యుత్ దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. అయితే, వర్షాలు లేక నది వెలవెలబోతుండటం, పుష్కరఘాట్ వద్ద నీరు అరకొరగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో కార్తీక పౌర్ణమి రోజున పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవని స్థానికులు వాపోతున్నారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370